శ్రీ

ముద్రిక

ఆఱంకములనాటకము

పానుగంటి లక్ష్మీనరసింహారావుపంతులవారిచే

రచియింపఁబడినది.

మొదటి కూర్పు

రాజమహేంద్రవరము.

డి. వి. రమణారావుగారిచే

శ్రీ విద్యానిలయముద్రాక్షరశాలను ముద్రితము

1923

[వెల 10 అ

పీ ఠి క.

ఇది నాపదునాలుగవనాటకము. శ్రీపీఠికాపురపు మహారాజావారగు మ. రా. రా. శ్రీ. శ్రీరావు వేంకటకుమారమహీపతిసూర్య్యరావుబహాద్దరుగారి ధనసాహాయ్యమున దీని నచ్చువేయించితిని. భాషాపోషకులగు మామహారాజావారికి వారికుటుంబమునకు సర్వేశ్వరుఁడు సకలశ్రేయములనిచ్చి రక్షించుఁగాక.

పా॥ ల. నరసింహారావు.

ఇందు వచ్చు పాత్రములు.

సేతుమాధవుఁడు—కనకపురరాజు.

మాఘుఁడు—రాజు వేడుకచెలికాఁడు.

మాధవుఁడు—శ్రీపురరాజు సేవకుఁడు.

ఇందుమతి—కనకపురరాజ్ఞి.

సుందరి—ఆమెదాసి.

మానవతి—ఇందుమతిచెల్లెలు.

సంపంగి—మానవతిదాసి.

శ్రీరామా.

ముద్రిక

ప్రథమాంకము.

ప్రదేశము—కనకపురపు రాణి యంతఃపురము.

ప్రవేశము—రాణి, ఇందుమతి, దాసి, సుందరి.

ఇందు—సుందరీ! ఈసారి కొంత కఠినఁదనమువహించి యల్లరిచేసినఁగాని దారికివచ్చునట్లు లేదు.

సుంద—అమ్మా! ఇందుమతీ! ఈమాట లేల? మీవలననగునని నే ననుకొనను.

ఇందు—ఆ! కాకపోవునా? చూతువు కాని—

సుంద—నేను జూచున దేమి? మీరు చూచిచూడనట్లయిన నుండవలయునే; కాదేని జేతనైనయెడలఁ గట్టుదిట్టమైన పనియైనఁ జేయవలయును. అందులకు సహనశక్తి లేదయ్యెను. ఇందులకు సాహసము లేదయ్యెను.

ఇందు—సుందరీ! సహనశక్తి లేకపోవుటకాదు. ఎంతసహనశక్తి లేనిదే యింతకాలము తటస్థముగ నుందునా? కాని, యదియిప్పుడు తగ్గుచున్నది. తగ్గదా? ఈసారి యాతఁడు తెచ్చినదానిని విధ్యుక్తముఁగా వివాహమాడునఁట!

సుంద—ఆడఁడా? అమ్మగారి యశక్తతనుజూచి య[illegible]రెన్నిమాటలనాడిన వాడును. ఆతని తప్పేమున్నది? ఒక్క [illegible] నోరుమాలినసతికి నీతిమాలినపతి తప్పఁడు.

హా

ఇందు—క్రిందటిసారి కంచినుండి వైష్ణవిని దెచ్చినప్పుడు—నీవు లేవుకాని— నీయక్క నెదుటఁ బెట్టుకొని—కొంతసాహసము తెచ్చుకొని రాజుగారిని దలవాచునట్లు నాల్గుమాట లన్యాపదేశముగా దులిపిదులిపి విడువలేదా?

సుంద—మీరు దులిపినమాటలేవో తన్నుఁగూర్చినవి కావని యాయన వెంటనే దులిపి వేసికొన్నాఁడు కాఁబోలు.

ఇందు—అట్లుకాదు లే. అప్పటికిఁ గొంతపశ్చాత్తాపము వచ్చినట్లు కనఁబడినదిలే.

సుంద—మీకట్లే కనఁబడును.

ఇందు—కాదు కాదు. ఇఁకఁ బరస్త్రీ నపేక్షింపనని మీయక్క యెదుటఁ గొన్నిప్రమాణములుగూడఁ జేసినాఁడు.

సుంద—దైవమునెదుటఁ జేసినప్రమాణములకు లెక్కలేదు కాని దాసియెదుటఁ జేసినవానికా? అందులో విటుని ప్రమాణములా విటునిప్రమాణములు, నటుని రోదనములుఁ జెప్పనక్కఱలేదు. గారట్లు ప్రమాణము చేసినారని మీరు భయములేకుండ నప్పటినుండి యు నుంటిరి కాఁబోలు!

ఇందు—ఉండక—యెంతసేపు కౌఁగిలించుకొని కూరుచుండు ను? ఎంతసేపు చెంగున ముడివైచుకొని తిరుగుదును? ఎంతసేపు కను ఱెప్పల మూయకుండఁ జూడఁగలను?

సుంద—మీ రతనిని గనిపెట్టుకొనియుండినఁ బ్రయోజనక యేమున్నది? ఆతఁడు మిమ్ముఁ గనిపెట్టుకొని చుట్టుచుట్టు తిరుగు యుట ప్రయోజనకత. పతుల వశముచేసికొనిన సతులందఱు వారిని ముకాయవలె రొంటఁ బెట్టుకొనుచున్నారా? గడియారము వ బెట్టుకొనుచున్నారా? కుక్కలవలె మంచపుఁగోటికిఁ గట్టు న్నారా? కనుబొమముడిచేఁ గట్టివైచుచున్నారు. కోరచూపు-

గడగడలాడించుచున్నారు. తర్జనిజే నిర్జించుచున్నారు. భయపెట్టినఁ గాని బతిమాలిన భటుఁడు పనిచేయునా? కఱ్ఱ చూపవలయును గాని గంగడోలు దువ్వినయెడల గంగిరెద్దు తలఁగదలుపునా? కొరడ చూపవలయునుగాని గోఁకినయెడలఁ గోతి కృష్ణవేష మభినయించునా?

ఇందు—సుందరీ! ఎందులకే యాచదువు? నాభర్త నీసారి బెదరించి శిక్షింపుమనియేకదా నీవనఁదలఁచినమాట!

సుంద—అమ్మా! నే ననుట యెందులకు? నేను జెప్పుట యెందులకు? మీకేల తోఁచఁదగదు. అయిన నొకరు బోధింపవలసిన యంశమా యిది? అభ్యసించుట కిదియేమి యున్నప్రాశనమా? వల్లెవేయుట కిదియేమి వేదపాఠమా? కావ్యము లెవఁడైన నేర్పఁగలఁడు కాని, కవిత్వ మెవఁడు నేర్పఁగలఁడు? చౌకతానవర్ణములు సాగఁదీసి వల్లింపవచ్చును గాని, స్వరకల్పనము కంఠపాఠమునకందునా? మగని వశపఱచుకొను శక్తి పుట్టుకతోడనే కలుగవలయును. అమ్మా! యిటులంటినని కోపపడకుము.

ఇందు—సుందరీ! నేను గోపముగలదాననే యగునెడల నాపతి యింత మితిమీఱిపోఁగలఁడా? నన్నీకష్టమునుండి తరింపఁజేయఁగలవని నమ్మిన నీపై నేను గోపపడుదునా? పతివశీకరణకార్యమున నీవు మిక్కిలి గడుసుదానవని నీయక్కవలనవినియే నిన్ను రహస్యముగ మీయూరనుండి యిటకుఁ బిలిపించితిని.

సుంద—అమ్మా! అటులైన వినుము. నామాట నేను జెప్పుకొనఁగూడదు కాని—నేను జేరదీసిన యయ్యవారలున్నాఁడే—ఆతఁడు పట్టి వన్నెలవిసనకఱ్ఱ. సంగీతములో, సాహిత్యములో, సరసత[illegible] సమర్థతలో, స్వరూపములో సంపూర్ణుఁడు, కాని పట్టిచపలుఁడు [illegible]ద్రజాలికుఁడు. పట్టిదొంగలగురువు. కనుమూసి తెఱచులోపల న[illegible] కొంతలు చక్కఁబెట్టుకొని వచ్చు నైజముకలవాఁడు. ఎక్కడప[illegible]

గుగడపయేకాని యెక్కడోనైనఁ గాలు కుదిరియుండువాఁడు కాఁడు. దేనికిని లొంగినవాఁడు కాఁడు. నేర్పరియైన సవారు మిగుల పొగరు బోతుగుఱ్ఱము నెఱిఁగియుండి యిచ్చవచ్చినట్లు నే నాతని సాఁగదీయు టకై-నా నేర్పు లోకమునకుఁ గానఁబఱచుటకై-అపరిగినామాల పై యాటల పందెమును దీసికొంటిని. అమ్మా! చెప్పిన నమ్ముదువో లేదో! మునుపటి కోడెగానితన మేమయ్యెనో? ఇప్పుడు పట్టికుక్కనపేను, మునుపటి చిలుకపలుకు లేమయ్యెనో యిప్పుడు పట్టిచెప్పినట్లు, మా పాదములే యిప్పుడు దాసాధనమునకుఁ దిగునడిత్తాముకలు. నాప్రతిభా విశేషమున నాతఁ డిట్లయ్యె నని మాయక్క మీతో తెలుపచేసికొని యుండెదుగాఁబోలు! ఏమో? ఎక్కడికి? నేనే మహామహోపాధ్యా యినినాయేమి? ఎల్ల ప్రతిభలలోవలె దీనిలోఁగూడ నొకరిని మించిన వా రొకరుండవచ్చును.

ఇందు—ప్రతిభ ప్రధానమైనదే కాని, మీ రేవో మందు పెట్టి పతివశ్యము చేసికొందురఁటే?

సుంద—అట్టి వైద్యమేయున్నయెడల నది చేతగాని పెద్దమ్మ చేయవలసినపని. కంటిలోఁ గలుగుచున్న కాంతకుఁ బతి చెవిలోఁ బసరు తోఁ బనియేమి? ముద్దులో నీటున్నదానికి ముద్దులో మాటలు? మా టలో వడియున్నదానికి ముక్కులోఁ దిరియేల? ఎటులైనను గప్పను బట్టినది పాము—కాంతు నేలినది కాంత.

ఇందు—నిజమే! భర్తను వశపఱచుకొనలేనిది దొరసానియైన దాసియే.

సుంద—అంతే కాదమ్మా! వశపఱచుకొనినది దాసియైనను దొరసానియే.

ఇందు—హాఁ! నిజమే. పతివశ్యము లేని యాఁడుదానిబ్రతుకు లఘుపదార్థము ప్రపంచమున మఱియొకటి గలదా? మగని

కన్ను మఱియొకమగువపైఁ బ్రాలినప్పుడు మహాలక్ష్మి నాకనుసన్న మెలఁగిన నైననేమి ? మగఁడు పరకాంతతో నిగిలించినప్పుడు మహాదృష్టదేవత నన్నుఁ గాంచి మందహాసముచేసిన నైననేమి ? ఈరత్నాభరణములు — ఈగజకంఖాణావైభవములు — ఈరాజ్యభోగములు నాలాఘవమును, నానీచతను, నానిర్భాగ్యతను మఱింత వెల్లడించుటకే యుపయోగించుచున్నవి కావా ? ఊరు పేరు లేని యాఁడుదానికి నావంటి యవస్థయే పట్టినయెడల నది యెవరికిఁ దెలియును? దాసియుబునైనతెకుఁ గావలెను ? నాగతి యట్లు కాదే? రాజ్యమునను న్న యయ్యాకొయ్యలందఱు నన్నుఁ దలఁచి పకపక లాడువారే. అమ్మలక్కలందఱు నాపేరెత్తి బుగ్గలు నొక్కుకొనువారే. చేతవాతగాని పెద్దమ్మయని — పట్టి మట్టిముద్దయని — వంకరటింకర కొంకనక్కయని — జ్యేష్ఠాదేవి యపరావతారమని యందఱు నన్నెత్తిపొడిచి దుర్భాషలాడువారే. కనకపురపురాణి యని బ్రహ్మాండమంత పేరు. మూరెడుకోటలో నూటయేఁబదంతఃపురములు. బాపనరాణులు, కోమటిరాణులు, శూద్రరాణులు, తురకరాణులు, దూదేకులరాణులు రాణులమంద — కాంతలసంత — భార్యలబందెలదొడ్డి; జాతియేమి? నీతియేమి? హద్దేమి? పద్దేమి? ఇంక నీనానాసంకరసపత్నీసమాజము చూపుతడకలనుండి నన్నుఁ జూచి వెక్కిరించుట. కిటికితలుపులనడుమనుండి మెటికలువిఱుచుట. తలుపుచాటులనుండి తలపంకించుట. ఇట్లున్నది నాబ్రదుకు! వీరిదనుక నెందులకు ? నాకాళ్ళుకడుగవలసిన దాసిముండలు సైతము నాగతి చూచి పైటచాటునఁ గిచకిచలాడుచున్నారు.

సుంద — అమ్మా! ఎంతమాట! మీమనసులోని సందేహ[illegible] [illegible] మీకట్లు పడెనేమో కాని మీయెంగిలి మెతుకులఁ దినుదాసు[illegible] లేమి? అట్లు చేయుటయేమి ?

ఇందు—నేనసత్యమాడ లేదు. భ్రమపడ లేదు. నిన్నగాక మొన్న సాయంకాలమున నేను జాంపపైఁ బరుండుకొంటిని. నిలువుదిండు నాపక్కను నిలువుగఁ బెట్టియున్నది. దానిపైఁ జేవైచి దానిదగ్గఱగఁ జేరిపండుకొంటిని. అప్పుడు నా కాళ్ళలొత్తుదాసి విసరుచున్నదాసిని వంకగాఁ జూచి కన్నుగీటెను. విసరుచున్నదాసి మొగమునకు వీవనయడ్డు పెట్టుకొని కిసుక్కుమనినవ్వెను. ఇట్లుబ్రదుకుటకంటె మరణించుట మంచిదికాదా ?

సుంద—మీరు మరణించినందువలన మహారాజునకు బుద్ధిరాగలదా ? మానవతియగు నాఁడుది తనప్రయత్నమెంతవట్టునకుఁ బోగలదో యంతవట్టునకుఁ జేయవలయును. అప్పటికిని మనోరథము నెరవేఱకుండెనేని మరణింపవలసినదే. ఆకనిని జెంగున ముడిపైదుకొం ప్రయత్నముచేయకుండనే గొంతుకకు ముడిబిగించుకొనుట యభిమానవతులకులక్షణము కాదు. అశక్తికిఁ బుట్టుకచేదాసినైన నాకేయీయుపద్రవము దుస్సహముగనున్నది. నేనిట్టి యవస్థననుభవింపనిదాననైనను మీహృదయక్షోభము నెఱుఁగుటకుఁ దగిన తెలివితేటలు నాకున్నవి.

ఇందు—నీకట్టి తెలివితేటలే కావు. నాకుఁ బ్రేమాస్పదమైన దాసి చెల్లెలవగుటచే నీకట్టి ప్రేమకూడనున్నదని మాయక్క చెప్పినది.

సుంద—అక్కమాటలేమి యాగమవాక్యములా ? అనుభవమున మీ రేకని పెట్టుదురుగాక ! మాయక్కయైన నాతో నిన్నిమాటలు చెప్పలేదు. దానితోనైనఁ జెప్పనిరహస్యములుకూడ నాతో మీరు టఁబట్టి మీకు నాయందెంత ప్రేమయున్నదో కనిపెట్టలేనా ? ఇందుఁ దగినయభిమానముతోఁ బ్రవర్తించి మీయభిసంధిని సమకూర్పలనా ? చూతురుకాని చావునకైననుఁ దెగువపెట్టి యెంతపని చేయుదునో

ఇందు—అయ్యయ్యో! చావునకైన లక్ష్యపెట్టక యుంచున్నావు. నాకు భయము వైచుచున్నది. ఆతని కేమైనమందులు పెట్టిన యెడల మొదటికే మోసము వచ్చునేమో?

సుంద—అమ్మా! నా చావుమాట చెప్పితిని. మందులు ప్రయోగింపనని యిదివఱకు సూచింపలేదా?

ఇందు—నిజముగా నేకద!

సుంద—మీ పాదముల తోడు.

ఇందు—అట్లైన నేమి చేయుదువు?

సుంద—నేను మీ యొద్దనే యుండి యంతయు మీ చేతనే చేయింతును,

ఇందు—ఏమైన దంటా మాటలలోఁ గుట్రపనులలో మారువేసపు గొడవలలో నన్ను దింపుదువేమో? అది నాకంతయిష్టము కాదు.

సుంద—వంకరకఱ్ఱను సరిచేయుటకు రవంత వాట్లనైనఁ జూపవలెను లేదా? గట్టిగా నిలఁబెట్టుకొనుటకుఁ గొంతయుచ్చునైన నుపయోగింపఁడగదా? మీకిట్టిదేదియు నిష్టము కానిచో మీ రీవ్యాపారము వదిగకుండుటయే మంచిది,

ఇందు—దిగకి నేమి చేయుమంటివి?

సుంద—ఏమున్నది? ఆతని చర్యలఁ గూర్చి చెవులుమూసికొనవలయును. సపత్నుల యెడలఁ గన్నులుమూసికొనవలయును. వైరాగ్యమవలంబించి ముక్కుమూసికొనవలయును.

ఇందు—అట్లు నోరుమూసికొని పడియుండుటకు సహనశక్తి యేది? ఇదివఱకదియుండెను. ఎన్నటికైన గుణము మారకపోవునా? భర్తనేల నొప్పింపవలయును? అని చూచిచూడనట్లుంటిని. క్రొ(త్త) సవతి యొక్క సారియే కొంచెము కఠినముగ నాతని నెదుర్కొంటిని. ఇదివఱకు దేఁబడిన కాంతలందఱు కేవలముం పుడుకత్తెలు. పాకలో నిరుక్కుఁ బిడారము

నువలె గుడిసెలోని కోళ్లగుంపునువలెనే యంతలక్ష్యముగాఁ జూడలేదు కాని యీనవీననారీమణిని రాణిగాఁ జేయుననుకొను వదంతి వినినప్పటి నుండియు నాసహనశక్తి చచ్చినది.

సుంద—అమ్మా! ప్రస్తుతబాధపడలేక గౌరవహాని సహింప లేక—కడుపుడికి మీ రిన్నిమాటలు చెప్పితిరి కాని మీవైఖరిని జూడఁగ మీకు యథార్థమగు నసూయ హృదయమున జనించినట్లు నాకుఁ దోఁచుటలేదు.

ఇందు—సుందరీ! నీకేమి వెఱ్ఱి! భర్తృపరాంగనాలోలుఁడగు నెడల భార్యకసూయ లేకుండునా? అది ప్రకృతిధర్మము కాని బలాత్కృతమా? యథార్థమగు నసూయయని యుంటివి యథార్థమని కృత్రిమమని రెండా?

సుంద—ఆ—మీయసూయ సత్యమగునది కాదు. ఉంపుకత్తె లేకదా యని నేను వారిని గణింపలేదని చలింపకుండఁ జల్లగఁ తిరే? అసూయావతి యిట్లుండఁగలదా! అనఁగలదా! నాభర్త—మాటవరుసకు—ఇంకొకదానిని దెచ్చుటకేల కొందులకు? చూచుటకేల కొందులకు?—తలపెట్టినంతమాత్రమున గూడ పైఁబెట్టునా?

ఇందు—ఔను. నీవట్లు చేయ శక్తిగలదానవు. నాకట్టిశక్తి లేదు. కాని నీకున్న యసూయ నాకు లేకపోలేదుసుమా!

సుంద—శక్తి శక్తి యని మాట సేసి యన్నారు. మీకు లే శక్తి యేమి? నాకదనముగనున్న శక్తి యేమి? అసూయయెంతశక్తి. ఉచిప్పకంటె నది తీక్ష్ణమైనది. వెఱ్ఱికుక్కకంటె విషముగలది. పి ంటె బెడిదమైనది. అది హృదయమునఁ బుట్టినప్పుడు చల్లనిమ ము, జడియుటలు, జంకుటలు, సంతుష్టులు సంభవించునా? అది ప వేశించినపుడు తలవొందుకొని త్రాఁచుపామగును.

ఇందు — అందుచేతనే యెటుపోయి యెటువచ్చునోయను భయము.

సుంద — అట్టి భయముచేతనే యసూయ పుట్టకుండఁ జేసికొని నారుకాఁబోలు!

ఇందు — పుట్టకుండఁగాదు. ఉండనేయున్నది. వృద్ధిపొందకుండఁ జేసికొనుచున్నాను.

సుంద — అమ్మా! యీసారికూడ నటులే చేసికొని యూరకుండరాదా?

ఇందు — నేనాఁపినను నాఁగకుండ నున్నది. ఆ! కామతంత్ర వ్యాపారమున కక్కఱకువచ్చు నూర్గురు కామినులనుదెచ్చి తన ప్రక్కలోఁ బెట్టుకొనరాదా? నేను వలదంటినా? ఈసారి దీనిని రాణినిజేసి నానెత్తిఁ ద్రొక్కింపఁబూనుటెందులకు? తనముచ్చటఁ దీర్చుకొనుటకు గాదు — నన్నుఁ బరాభవించుటకు. తనకోర్కెఁ దీర్చుకొనుటకుఁ గాదు — నాగొంతుఁ గోయుటకు. రాణియని నుదుట వ్రాసినఁగాని ప్రక్కలోనికిఁ బనికిరాదు కాఁబోలు!

సుంద — అమ్మా! కడుపులోఁ గావలసినంత యాఁకలి యయ్యెను. నోట నొక్క కబళమైనఁ బెట్టుకొనవయ్యెను. నీటిలోమునిఁగి కెక్కు కెక్కుమని కొట్టుకొనుచుంటి నయ్యెను. చేయి యందిచ్చిన నందుకొనవయ్యెను. ఇదియేమి?

ఇందు — ఏమున్నది? నేను బరమశాంతురాలను. పాపదూరురాలను. భర్తృవిధేయను. ఈతని వెనుకటి దుర్నయములను గణించినదానను గాను. ఎన్నఁడు నాతనిపైనేమి యెవరిపైనేమి కోపవ[illegible] ఱుంగను. ఈసారి నాకుఁ గోప మాఁదయించుచున్నది. జన్మకాల[illegible] నుగు శాంతిచే దాని నాఁపుకొనుచున్నాను.

సుంద—సరే. బాగుగా నేయున్నది. ఇంతటితో సరియా? చేయవలసినదేమైన నున్నదా?

ఇందు—తగురీతిఁ బ్రతిక్రియ—ప్రతిక్రియ.

సుంద—"తగురీతి"యనఁగ నేమి?

ఇందు—చెప్పలేదా? మాయలు మర్మములు తగవు. వేసము లు మోసములు తగవు.

సుంద—తగక?

ఇందు—తగవు; ధారాళముగా నాతనితో నీకిది తగదు—తగదు—తగదని ముమ్మాటికిఁ గఠినముగాఁ జెప్పి నీతిని బోధింతును.

సుంద—(నవ్వుచు) నీవు కఠినముగనైన నట్లుచెప్పుట యెందులకు? క్షేమధర్మములు చెప్పించినయెడల నీతివచ్చునేమో! లేదా సత్యనారాయణవ్రతము చేయించినయెడలఁ జక్కఁబడునేమో?

ఇందు—నవ్వెదవేమి? నీత్యుపదేశ మిట్టిస్థితిలోఁ బరిహాసింపవలసినదియు, నిరాకరింపఁబడవలసినదియుఁ గాదు సుమా?

సుంద—వేదములు, శాస్త్రములు, పురాణములు, ఇతిహాసములు, నీతిశతకములు, బ్రహ్మగీతములు, త్రిమతభాష్యకర్తలతో గూడ సంఘసంస్కర్తలతోఁగూడ ఱోటఁబోసిచి రసముతీసి యాతగొంతులోఁ బోసినను గార్యములేదు.

ఇందు—ఎందుచేత?

సుంద—నాల్గుపదులు మీఁదికివచ్చినతరువాతఁగూడ దుర్బుద్ధినుండు మగవాఁడు, మగువయు నాల్గుభుజములమీఁదికి వచ్చువఱకు యుందురు.

ఇందు—నలువదింక దాఁటలేదే? ఇంక నాలుగైదు తరువాతనుమే యున్నవి కాఁబోలు!

సుంద — దాఁటకపోవుటయేల? కాడలు దగ్గఱఁబడెను; దంతము లెడముపడెను; మొగము ముడుతలువడెనని మాయక్క చెప్పినదే!

ఇందు — ఈ యసాధారణచర్యచేతనే — నీవిటకు మాయూరనుండి వచ్చినతరువాత రాజుగారిని జూడనేలేదా?

సుంద — దూరమునుండి చూచినట్లే చూచితిని. సరే. నలుపది దాఁటలేదు. అటుపైన —

ఇందు — నేనుచితరీతిని బోధించుటయే కాక — కొన్నినాళ్ళవఱకుఁ దగినయుపదేష్టను బెట్టించి నీతిని బోధింతును.

సుంద — అటులైన నన్నెందులకుఁ బిలిపించితిరి?

ఇందు — మనమాలోచించుకొని ప్రవర్తింపవలయుననియే —

సుంద — ఏమి? నీతి నుపదేశింతువా? నీతియుక్తముగఁ బదునెనిమిదిపురాణములు, భారతమును వ్రాసిన వ్యాసుఁడు పరకాంతను జూచి పండ్లిగిలింపలేదా? కడుపులో నీతి పుట్టినవానికే గతిలేదుగాని వడఁదీసి చెవిలో నీతిని దిగిపెట్టఁబడినవానికా?

ఇందు — మహర్షి దూషణము తప్పు.

సుంద — మనరాజుగారికట్లు నీతిగలుగుననుట యెంతకంటెఁ దప్పు. ఆతనికిఁ జదువుట కోపికయేది? వినుటకైన నవకాశమేది? కూరుచుండుటకైనఁ దీరికయేది? ముండలవెంటఁ బరువెత్తువానికి వెనుకపాటున భగవద్గీతాపురాణపఠనమేమి సొగసుగనోయుండును!

ఇందు — ఏమి? నామాట నీకు నచ్చలేదా?

సుంద — నాకొక్కతకే కాదమ్మా! కన్నగానికిఁ గార్తికనక్షత్రములా? సురాపాయికి సూర్యనమస్కారములా?

ఇందు — నీయభిప్రాయ మట్లున్నది కావున నాభర్తనెదురని నుంచొకసారి కఠినముగా మాటలాడిచూతును.

సుంద — ఏమని?

ఇందు—"క్రొత్తరాణి నెచ్చటనుండి తెచ్చితివో యామెను సగౌరవముగఁ బంపుము. లేనియెడల బాగుగా జరుగనేరదు. వివాహమాడితివేని నిద్దఱురాణులు నీకనావశ్యకము కావున నేను గాశికిఁ బోయెదను." అని యిట్టిమాటలేవో యప్పటిరాకడననుసరించి—

సుంద—అటులైన నీ వాతని యభీష్టము నెఱవేర్చినదాననగుదువుగాని యెదుర్కొనినదాన వెట్లగుదువు?

ఇందు—ప్రాణము విసిఁగి నేనే లేచిపోవలయుననియే యాతఁడు దీనిని దెచ్చెనందువా? ఆహా! అటులే యైయుండునా? ఎంతద్రోహము! ఎంత విశ్వాసఘాతుకత! ఎంత గొంతుకోఁతదనము! పదునాలుగేండ్లనుండి కాపురము చేయుచుంటినే!— కంటికొనన యెఱుపుగాని-నాలుకకొనన కఱకుగాని లేకుండఁ గాలక్షేపము చేసితినే!—అడుగులకు మడుఁగులిడితినే!—అట్టి నన్నుఁ గోటనుండి తఱిమివేయుట యీపని చేసియుండునా? సుందరీ! గత్యంతర మేమైననున్నదా?

సుంద—లేకేమి? అది వారు చేయుట కిష్టపడకుందువా?

ఇందు—మోసమేనా? అంతకంటె మంచిది దొరకినప్పు డిష్టము కాకేమి!

సుంద—ఇట్టికార్యములలోఁ బాసితోఁ సమానమైనదే లేదు. అడవియేనుఁగును గోతిలోఁ బడఁద్రోచి పట్టుచున్నారా? లేదా? చేదుమాత్రల మ్రింగని చిన్నపిల్లలకామాత్రలనే పంచదారతోఁ బొదివి యిచ్చి రోగనివృత్తి చేయుచున్నారా లేదా? ఎఱ్ఱగుచ్చిన గాలము వైచి చేఁపను లాగుచున్నారా లేదా? లోకాచారమగు నిందునఁ దప్పేమియు నాకగపడలేదు. మీరెందులకింత సందేహించుచున్నారో?

ఇందు—సందే—హమువలదు. (ఆలోచించి) లేదు సందేహము? తిరుపతిమహంతుగారి సవారివచ్చుచున్నదని నాతోఁ జెప్పినమ్మికఁ జేసి నన్ను మఱియొక యంతఃపురమునకుఁ బంపి యాసవరిలో నెక్కి

వచ్చిన మహామ్మదీయవేశ్యయుండాను—నిచ్చటనే—నాయంతఃపుర ములోనే—యిల్లాలనైన నాయంతఃపురములోనే—మహారాజ్ఞినైన నాయంతఃపురములోనే—మావ్యవాహసన్నిధినిధర్మాచరణమునకైకూర్పఁబడిన ప్రభుదంపతుల పవిత్రమైన యీయంతఃపురములోనే—తిరికాలదీక్ష నిర్వహింపలేదా. ఇటుతెన్నిసారులనన్ను మోసముచేసి యుండలేదా?

సుంద — తిరుపతిస్వామిని దురకసానిని జేసిన దేవాంతకుఁడు తిరుప్పావుకాలక్షేపమున నాచార్యపురుషుఁడగునా!

ఇందు—అతనిపూర్వచర్యలాలోచించినకొలఁది నొడలుమండుకొనిపోవుచున్నది. వానినన్నిటి నేనెట్లుసహింపఁగల్గితినో నాకేయాశ్చర్యముగనున్నది. మొట్టమొదటనేయేదైనఁ గట్టుదిట్టమైన పనిచేసి యుండునెడల నింతవఱకు రాక యుండునేమో.

సుంద—ఇప్పుడైన మిగుల నాలస్యముకాలేదు పట్టుదలతో మాత్రము పనిచేయువలయును.

ఇందు—ఏమిచేయువలయునో చెప్పుము.

సుంద—నేనుమాత్రి మాలోచించుకొనియుంటినా? ఏదోమన మాలోచించి కాలికిమెడకు మెలతవేసి యాతని నొకమూలఁబడఁ ద్రోచి సిగ్గుతెప్పించి బుద్ధివచ్చునట్లు చేయవలసియున్నది.

ఇందు—మనమాలోచించి యనుచున్నావు. నేనాలోచింపనక్కఱలేదు—నీయిష్టమెటులో నేనట్లు చేసెదను. నీభర్తను నీవువశపఱచుకొనినట్లే నాభర్తను నేనువశపఱచుకొనునట్లు చేయుము. నీ మామునుండి నన్నిందుకొఱకే యిందుకుఁ బిలిపించితిని. ఈగ్రామమువార నిన్నెఱ్ఱెఱుఁగరుకాదా.

హా

సుంద—నన్నెవ్వరెఱుఁగుదురు? నాయక్కయింట నేనుండిన యెడలఁ గోటలో దాసికి బంధువని యెవ్వరైననను కొందురేమో అట్లైన జనులనుకొనవలెను. మఱియొకచోట బసచేసెదను.

ఇందు—ఊరికెవతెయో క్రొత్తదాసివచ్చినదని జనులు గుబ్బటిలుపడుదురేమో?

సుంద—ఆవిషయమున నేనేమో పాట్లుపడెదను; కాని ప్రయత్నములో దిగినతరువాత మీరు వెనుకకుఁదీసిన యెడల—

ఇందు—నేనంత పిఱికిదాననను కొంటివా! (వెనుకకుఁ జూచుచున్నది.)

సుంద—అమ్మా—అప్పుడే వెనుకకుఁజూచుచున్నావేమి?

ఇందు—అదిగో—మాఘుఁడు రాజుగారితో మాటలాడి దిడ్డిగుమ్మమునుండిపోవుచున్నాఁడు. ఈతఁడిప్పుడు పాతిహావేలీలో భద్రముగ దాఁచఁబడుచున్న యాక్రొత్తరాణిగారికేదో వార్తనుమోసికొని పోవుచున్నాఁడని తోఁచుచున్నది.

సుంద—చప్పున మేడదిగి యటుపోయి వానినెదుర్కొని మాటలాడుదును.

ఇందు—సరేపొమ్ము (సుందరిపోవును) తల నొచ్చుచున్నది. గుండెకొట్టుకొనుచున్నది. కాళ్లువడఁకుచున్నవి. మ్రొక్కవలసిన భర్తను మోసము చేయవలసివచ్చినది—బహుమానింపవలసినభర్తను బరిభవింపవలసివచ్చినది— పూజింపవలసిన కాంతుని దూషింపవలసివచ్చినది. కావా మఱి? నాగౌరవమును గాపాడినాఁడా? నామగనాలితనమును మన్నించినాఁడా? నాయాభిజాత్యమునైన గణించినాఁడా? ఎంతకాలము నోరుమూసికొనిపడియుండలేదు? ఇఁకసహింపలేను సహనశక్తి [illegible]చ్చినది—మనుష్యజన్మముగాని మఱియొకటి కాదే—సుందరియీసరికి [illegible]నిని గలసికొనెనో లేదో—నేనింక మేడదిగిపోయి పండుకొందును [illegible]రీ! ఏమి బాధగానున్నదయ్యో! (ఇందుమతి నిష్క్రమించును)

ఇది ప్రథమాంకము.

శ్రీరామ.

ముద్రిక.

ద్వితీయాంకము.

ప్రదేశము. వీధి.

ప్రవేశము—మాఘుఁడు.

మా—హా! హరీ! ఏమిబాధగానున్నదయ్యా! ఈబాధతనవు తోడనే కాని నివర్తించుననితోఁపదు. ఇద్దఱా, ముగ్గురా, పదుగురా? మోపులు, గుంపులు, తండోపతండములు. ఇట్టుతీసికొనివచ్చుటయు—అటుకొట్టులో వైచుటయు—తిరుగ దానిమొగము చూడకుండుటయు. పగటిది సాయంకాలమువఱకుఁ బనికిరాదు. సాయంతనపుది రాత్రికిఁ బనికిరాదు. దృష్టిపాఱినవెంటనే తెచ్చినదాఁక నొక్కటేతహతహ. ఒక్కటేగిలగిల. తెచ్చినయొక్కనిముసమువఱకుఁ బెద్దముచ్చట. తాటాకుమంట. అటుపైనివిరాగము. దానిపైఁ గొట్టులోనబీగము. కోమటియుపరదినుసులను గాదులలోఁబోసినట్లు చేయుచున్నాఁడు. పసిడిధనపుగోతములను గోతిలోఁ బెట్టునట్లు పెట్టుచున్నాఁడు. కృష్ణుఁడు, కోమటియుఁ దమసరకుల నాత్రమునఁదఱచుగఁజూచుకొందు మూసిపెట్టినపిదపనితనికి ముందుదృష్టియేకాని వెనుకదృష్టిలేదు. వింత పశువులను వేలువేలుసంతలకుఁ బోవునట్లు వివిధజాతులకాం నై వేలువేలు క్షేత్రములకు మంచితీర్థయాత్రాసమయములఁబోవు

దీపకాంతికిఁ జేరిన పురుగులను బట్టుకొనుటకు బల్లి కాచియుండునట్లు కాచియుండును. ముచ్చటఁదీర్చుకొనినపిమ్మట నొక్కొక్కవేళ వలకుఁ దోలివేయఁగూడదా? ఉహూ. అదిపనికిరాదు. గదులు చాలక యొక్క గదిలో నిద్దఱు కూడ బస్తాబందీ చేయుచున్నాఁడు. నిరంతరము పదు క్షోభము—హరిహరీ!—పగవానికైన వలదు. రాజుగారు చేపట్టిన యెడల నేదో యఖండవైభవమున్నదనియు, నంతఃపురమునం నమ్మగారైనయెడల నసాధారణభోగమేదో యున్నదనియు నీపెద్దమ్మలాసపడి యిచ్చటికివచ్చి పగవానికి మొగమువాచి వెదురుతడికలచాటున జనపనారసంచుల తెరలచాటున నెత్తినోరు కొట్టుకొనుచున్నారు. ఎవరి మట్టుకు వారేనన్నుఁబిలచి "మాఘుఁడా! రాజుగారితో నన్నుఁ గూర్చి చెప్పవా?" యని బతిమాలువారే. చెప్పినయెడల నాజగదేకజారుఁడు ముందు సంతసముగూర్చి ముచ్చటించును. పిదపనేమనేను దిరుగ లేకపడుచున్నబాధ—హరిహరీ!—తనువుపోడనే కాని నివర్తించునదిలేదు అదిగో! అప్పుడే యెవ్వతేయో నాకొఱకే కాఁబోలు వచ్చుచున్నది.

(సుందరి ప్రవేశించును)

సుంద—రాజమిత్రమా! నమస్కారము.

మా—నమస్కారమునకేమికాని నీవెవ్వరిబాసనవో యెందుకొఱకువచ్చితివో వేగ చెప్పుము నాకుఁబనియున్నది.

సుంద—ఇదిగో! నావంక బాగుగఁజూడుము. నేనెవ్వరిదానినో యానవాలేపట్టలేవా?

మా—నూటయేబదియొక్క యంతఃపురములున్న కనకపురి [illegible]దాసి కావా లేమి? కిష్కింధలోఁ గోతుల కానవా లేమి?

సుంద—(మాఘుని చేయిపట్టుకొని) ఇటుచూడుము. కన్నులు [illegible]చుకొని యిటుచూడుము. నన్నెఱుఁగనే యెఱుఁగవా?

మా—చేతినివదలుము. ఇదివఱకున్న దాసీసలలో నా చేయి పట్టుకొని నాతో నింతచనవు తీసికొనిన దెవతెయును లేదే. నీవు క్రొత్త దాసివా యేమి ?

సుంద—నీ కేమిదృష్టి చూదమా? బుద్ధిమందమా? నీవు నన్నొక్క సారియాచూచినది ?

మా—ఎప్పుడు ?

సుంద—నీవు మాయమ్మయింటికి వచ్చినప్పుడు నేనునిన్ను లోనికిరమ్మని చెప్పలేదా ? ఉచితాసనమునఁ గూరుచుండఁ బెట్టలేదా? రాజుగారి క్షేమ మడుగ లేదా ? మాయమ్మగారు లోననున్నారు. ఇప్పుడేయిటువచ్చి మాటలాడుదురని చెప్పలేదా ? ఇవి యన్నియు మఱచిపోయితివా ?

మా—రాజుగారినిబట్టి సామాన్యముగ దాసీసలెల్లరు నాకుఁ జేయునుపచారమిదియే. నీవువారిలోనే దాసివౌ నాకెట్లు తెలియును?

సుంద—సామాన్యోపచారములగుటచే జ్ఞప్తి లేదు కాఁబోలును ఇట్టియసాధారణోపచారమైనయెడల నాచంద్రార్కము జ్ఞప్తి యుండునా ? (లెంపపైఁగొట్టును.)

మా—ఓసి! నీవుముండమోపు ! దాడపైఁగొట్టెదవా ?

(కఱ్ఱయెత్తి కొట్టఁబోవును)

సుంద—(దెబ్బతప్పించుకొని) నీచెంపకు నేఁటికైన మహాభాగ్యవంతమగు యోగము నకటచేతఁగదా నాచేతిపెట్టు నీకుసిద్ధించెను! ఎవనికి సిద్ధించును? ఎంతవారికి సిద్ధించును ? కోటీశ్వరులకుఁ బ్రభువులకుఁ బ్రధానులకుఁ జిరకాలాశ్రయముశ్రమమున విశేషధనప్రదానమునఁగాని సిద్ధింపని యీమహాగౌరవము నీమహాపుణ్యముచే నీకనాయాసముగ గలిగినది. నీపుత్త్రరజన్మమున దేవేంద్రుఁడవయ్యెదవు. నీజన్మ మిది తరించినది. పో !

మా—ఓసి! నీయిల్లుమాసిపోను! నీనాలుకఁగోయ! దొడ్డపెట్టుతో దేవేంద్రత్వ మీయఁగలముండవు నీవెవతెవు? ఇటురా! నాకుఁ జూపుబాగుగానానదు.

సుంద—కన్నులుసార్థకములగునట్లు నన్నుఁజూడు. నీకుఁ బుద్ధి వచ్చినయెడల నీరాజునకుఁ గూడ బుద్ధివచ్చును. ఏది? ఒక్కదానిని—నావంటిచక్కనిచుక్కను—నావంటి వాలుఁగన్నుల వగలాఁడిని—ఎక్కడికక్కడికిఁదగినయంగున్న నావంటిబంగారుబొమ్మను—మాటలతోడనే మరులుకొలుపఁదగిన నావంటినెఱజాణను—ఏది? మీకోటలోని నూటయేఁబదియొక్క యంతఃపురములలో నొక్కతెను జూపింపుము. ఇటులున్నది మీరూపగ్రహణశక్తి. అనుభవించురసజ్ఞతమాట తరువాతఁ జూచుకొనవచ్చును. ముందుఁదగినదానిని చెప్పుకొనుటకే మీకుఁ దెలివితేటలు లేవే? తెచ్చితిరి! బుంగలఁబెట్టితిరి! పురులఁగట్టితిరి! పాతరగోతులఁద్రోసితిరి! తీసి వ్రేఁతసరకులను—దిక్కుమాలినపెంటను—సంతబైటితుక్కును—ఎలజాజితీఁగయేదో—యెుబుకచెవికూరయేదో, చెంగలువపూవేదో—చెంగలిగడ్డియేదో, పశువులకైనఁ దెలియునుఁగాని మీకుఁ దెలియకపోయెనే! ఇట్టిప్రయోజకత బద్ధులై నిన్నుఁజెంపపైనిట్టియన్నందులకు—ఇంతరోషమువచ్చినదా? నిన్ను జెంపపగులఁగొట్టవలయునా? చేతఁగానివృత్తిలోఁ దగుదునమ్మాయ సిద్ధపడిసందులకు నిలువునఁజీల్పవలయునా?

మా—(కఱ్ఱయెత్తి) తలపగులఁగొట్టెదను. జాగ్రత్త! వః కూఁతలురానీయకు. అంతఃపురస్త్రీలచేనైన రవంతమాటపడనినే దాసిముండవైన నీచేతఁబడుదునా?

సుంద—అంతఃపురకాంతలా? అంతఃపురమనుమాట గా[illegible]ను కూడఁదగుఁబెట్టకు. దొడ్డికాళ్లదొరసానియొకతె. ము[illegible]రామాలతాడియొకతె, బాకినోటిబానిసయొకతె. ఇట్టివారేనా యం

పురకాంతలు ! వారిచే నీవుమన్ననలు పడయుటకంటె నాచే నీవు తన్నులుపడుట నీకు గౌరవము. అర్థములేని మొగముతో వాచూపేమి? కొట్టెదనంటివి. కొట్టవేమి? (నవ్వుచు) మెడలోఁగాసులపేరు పెట్టిన వాఁడు కన్నెతికపువిటుఁడు. తలపైఁ గట్రిపెట్టు పెట్టినవాఁడు కాసాభటుఁడు. కానీ !

మా—ఓసి ! మొండిముండ! నాకుఁ గోపముపోవ నవ్వువచ్చుచున్నది. నీవెవతెవే ?

సుంద—సిగ్గులేనివెఱ్ఱిమొగమునకు నవ్వేసింగారముకాదా ? మాఘుఁడా ! నీవుకోపమును విడువుము. నీతోఁగొన్నిసంగతులు చెప్పవచ్చితిని. నేఁ జెప్పునట్లుచేసితివేని రాజుగారికభీష్టసిద్ధియగును.

మా—కానిముందు నీవెవతెవో చెప్పుము.

సుంద—నడువీథిలో మనమిటమాటలాడుకొనుట బాగుగానుండదు. అదిగో ! ఆవేఁపచెట్టునీడకుఁ బోవుదమురా ? (చేయిపట్టుకొనును.) (వేపచెట్టునీడకుఁబోవుదురు.)

మా—నేనువచ్చెదను చేయివదలుము. కాని నీమాటలేవో త్వరగఁ జెప్పవలయును. రాజుగారిచేఁ బ్రేరితుఁడనై యొకరహస్యపుఁబనిమీఁదఁ బోవుచున్నాను. (తలతడిమిచూచుకొనును.)

సుంద—(తనలో) అమ్మ ! ముండకొడుకా ! తలతడుముకొనుచున్నాఁడా? అక్కడనున్నదా ? (ప్రకాశ) రాజుగారికి నీతోఁగలుగు పని రహస్యపుఁబనియని వేఱచెప్పనక్కఱలేదు. లోకములో నేయుద్యోగికైన రహస్యమని బహిరంగమని వ్యవహారములు రెండుండునుగాని—నీకట్టిది లేదు.

మా—అబ్బ ! వృథాకాలయాపనమేల ? శీఘ్రముగఁ

సుంద—సావధానుఁడవైవిను. నీవురాజునకు ముఖ్యచెలికాఁడవు కాదా ?

మా — ఇప్పటినుండియా? ఇఱువదేండ్లనుండి — మాబాబునకు బుద్ధి జీమకాలంతవచ్చినప్పటినుండియు.

సుంద — ఆమాటకేమిలే. కాని — నీకని వనితానుసంధానమే కాదా?

మా — ఆ! అట్టిదే.

సుంద — ఇంతకాలమునుండి నీవీవృత్తిని నిరాఘాటముగాఁ జేయుచుంటివికదా నీకేమైనఁ దెలివితేట లిదునఁ గుదిరినవా?

మా — బుద్ధియొకనిసొమ్మా? ఎక్కడికి? కుదిరినఁ తవఱకుఁ గుదిరినది. కాని నీకీగొడవయెందులకు?

సుంద — నాకుఁ గావలసియుండియే యడిగితిని. మాయచేనేమి — బలాత్కారముచేనేమి — మాయమ్మగారిని మీరాజుగారు తెచ్చిరికదా? తెచ్చియాదయ్యాలకొంపలో నన్నికట్టులకులోఁ బఱచి పెట్టిరికదా? ఇదివఱకుఁ గొన్నిసారులామెతో మాటలాడుటకు నీవు వచ్చితివికదా? ఆమెను మీరాజుతో సంధానపఱుపఁగలిగితివా?

మా — ఆఁ! ఆఁ! నీవు క్రొత్తరాణిదాసివా? సదసద! రాజుగారియొద్దకు. నీగొంతుఁగోయింతును. పైవారులోనికి రాకుండ లోనివారు పైకిరాకుండ నెన్నికాపులుంచినను నీవెటులో బైటబడితివా? నడనడు! రాజు నిన్నుప్పుపాతర వేయించును.

సుంద — నాయభిప్రాయము మొఱుఁగకుండమాటలాడుచున్నావు. మీరాజునప్రసిద్ధికే నేనుబ్రయత్నించుచున్నానని నీకుఁ జెప్పలేదా? ఆమెనన్నిబంధములలోనుంచినారు. మంచిదే నేనువీధిలోనికివచ్చి నెడల సంగతి యెవ్వరికైనఁ దెలిసిపోవునని యో, నాచేనేమైన యుత్తరము తనవారికి లేఖాశాలలో వేయించునని యో, నన్నే మీరాజు పట్టపుదేవియొద్ద కామెపంపి రాజునల్లరిచేయించునని యో, ఈ వృత్తాంతమపూర్వోత్తరము లామెకు నాచేఁ దెలియునని యో మఱియే కార

ణమునన్నో మాకిన్ని బాధములఁ గల్పించినారు. బాగుగనే యున్నది.
ఆమెను లాలించి వశపఱచుకొందురా? బంధించి వశపఱచుకొందు
రా? స్త్రీవశ్యమున కిదియేనా మార్గము? ఈయమర్యాదతో నామె
యింటికిఁబోవుటకుఁగాని, ఈవార్త తనవారికిఁ దెలియఁజేయుటకుగాని
బొత్తిగ నిష్టపడక జరుగవలసినరీతిని జరుగునని నిశ్చయపఱచుకొని
యున్నదిగదా! అట్టిచో నామెను బుజ్జగించి రాజుతో సంధానపఱచిన
యెడల నామె క్షేమము పోవునే-రాజుగారికోరిక తీరునే. ఆమె కెన్నా
ళ్లీచింత? రాజుగారి కెన్నాళ్లీవంత? వృథగ నడుమ నూఁగులాడు నీకె
న్నాళ్లీబాధ? ఎందుకొఱకుఁ దెచ్చితిరో యది త్వరగఁ దీర్పవలయును
గదా! అట్టి సంధానము నీవలనఁ గాదయ్యెను. మా రాణిబాధను
జూడలేక నీకు నేనింతులకుఁ దోడ్పడవలయునని నీతోఁ జెప్పుటకుఁ
జచ్చిచెడి వెలుపలికి రాఁగ నీక్షేమము కూడ నెఱుఁగకుండ నట్లు
గింజుకొనెదవేమి?

మా—నాకిన్ని తెలియవు. నీవెట్లు వెలుపలికి వచ్చితివి?

సుంద—ద్వారరక్షకుల కొంపలుగూడ నేల తీసెదవు? పాప
ము! బీదవాండ్రు.

మా—మీయందఱికొంపలుఁ గూల్చుదు. నడు నడు. రావేమి?

సుంద—ఇంత ముక్కు మొగమెఱుఁగని మూర్ఖుఁడవేమి?
మీ కుపయోగించునట్టి—

మా—నేను మూర్ఖుఁడ నగుదునో-కానో; కాని, నీవు కన్న
పుదొంగలలో నగ్రగణ్యవు.

సుంద—(తనలో) ఇచ్చవఱకుఁ దల తడిమికొంటివి కాని, యీ
సారి నేలఁ గొట్టుకొందువుకాని—(ప్రకాశ) తాల్పుము కాఁడా! నీ
మాట నేనేల కాదనవలయును? నేను దొంగలలో నగ్రగణ్యను. (సైచేఁ
పైబట్ట లాగికొనను.)

మా—అయ్యయ్యో! నాబట్ట—నాబట్ట—నాకిమ్ము. ఈయవా? హాఁ! (కలియఁబడి లాగికొనఁబోవును.)

సుంద—ప్ో! దూరముగఁ బో! ఆఁడుదానిమీఁద నడువీధిలోఁ జేయిచేసికొందువా? జాగ్రత్త! దాసినైననేమి లోకువ యనుకొంటివా? నీమగతనము మండ! నీవు నామీఁదఁ బడి పైఁట లాగఁబోవఁగ నేను నీనెత్తిగుడ్డలాగుట తప్పా? మాట మాట యని వేఁపచెట్టుక్రిందకు నన్ను లాగి మీఁదఁబడెదవా? పశువా! నన్నిట్లుచేసిన నీమానప్రాణములు దక్కనిచ్చెదనా? ఓ పెద్దమనుష్యులారా! రండు. ఈచండాలుఁడు—

మా—అయ్యయ్యో! అంత గట్టిగ మాటలాడవలదు. పెద్దమనుష్యులు వలదు; పిన్నమనుష్యులువలదు. నాబట్ట నాకిమ్ము. అబ్బ! త్వరగ నిమ్ము. నిన్ను బతిమాలుకొందును. అదేమి దానిలో నేదో తడుముచున్నావేమి?

సుంద—నీబట్ట నేనేమి మ్రింగెదననుకొంటివా? ఇదిగో! బట్ట వేసికో యింక నెత్తినిముసుఁగు. (బట్టకొసయందలి మూటనున్న లేఖను దీసికొనును.)

మా—బట్ట కాదే! అదే! అదే! అది యీయవే! అయ్యయ్యో! అదే! (నెత్తి నోరు కొట్టుకొనును.)

సుంద—కొట్టుకో! బాగుగాఁ గొట్టుకో! ప్రభువుల పాదసేవ జేసి బ్రతుకవలసిన నిక్షేపమువంటి కులవృత్తికంటె సానులఁ దార్చుట యధిక గౌరవమని యిందులో దిగితివని కొట్టుకో! ఇరువదేండ్లనుండీవృత్తి చేయుచున్నను నిమ్మకుఁగూడఁ జచ్చుచుండకొదుక నైతినని రొకమారు కొట్టుకో!

మా—నేను జచ్చుచుండకొదుకను. నాకేమియుఁ జేలఁగాదు. అయ్యయ్యో! అదేమి? ఆ కాగితమును నలిపివేయుచుంటివా యేమి

నా ప్రాణమంతయు దానియం దున్నది; నన్నుఁ జంపక యది నాకిమ్ము. ఇచ్చెదవా లేదా? దొంగముండ! బతిమాలినకొలఁది బిఱ్ఱబిగియుచున్నావు. హా! (మీఁదికి వచ్చును.)

సుంద — మీఁదిమీఁదికి వచ్చుచున్నావు. జాగ్రత్త! నీకు నేను జడిసెద ననుకొంటివా? నీశక్తి నేనెఱుఁగనిది కాదు. ముసలిముండకొడుక! సాగఁదీసి తన్నినయెడలఁ గోటకందకములోఁ బడెదవు. బ్రదుకుపై నాసయున్నయెడల దూరముగఁ బో!

మా — (సభయము) అహాహా! ఓసి! వెఱ్ఱిదానా! ఊరక బెదరించితినిగాని యాఁడుదానిని జేయిచేసికొనునంతటి యవివేకినా? అందులో-మనము కావలసినవారముగూడఁ గామా? ఇదిగో! నీపుణ్యమాయని బ్రతికెదను. పెద్దవాఁడను. నీవు చెప్పినట్లు బుద్ధిలేక యీకూలిపని చేయుచుంటిని. ఆలేఖ రాజుగారు క్రొత్తరాణికివ్రాసి నాచేతికిచ్చి యామెకుఁ జూపించి తిరుగఁ దనయొద్దకుఁ దెమ్మనినారు. నాకొంప కూలిపోవును. నాయన్నము పడిపోవును. నాగొంతు తెగిపోవును. నన్ను రక్షింపుము. నీవేది చెప్పిన నది చేసెదను, —

సుంద — మా రాణిగారియింటికి నీవు వెళ్లుచునేయుంటివికదా! రాజుగారి యభిప్రాయమేమో యామెతోఁ జెప్పనేచెప్పుదువుకదా-రాజుగారీయుత్తరమేల వ్రాయవలయును?

మా — నేనిదివఱకు నాలుగుదినములనుండి పడవలసిన యవస్థపాటులు పడుచునేయున్నాను. నీవు కూడఁ జూచుచునేయుందువు. నేను జెప్పినమాట లేవియు నామెవినదే! నేనటువచ్చుసరికిఁ దానట్టపోవునే! నామాట వినినయెడల నేదో కొంతగ్రంథము చేతనైనట్లు లోఁ బెంపఁగలను గాని వినికియే శూన్యమైనప్పుడు నేనేమి చేయఁగలయును? అందుపైఁ బ్రాణమువిసిఁగి రాజుతో నీసంగతి చెప్పఁగ, నా

యన యీయుత్తరమిచ్చి యామెకుఁ జూపుమనినాఁడు. లౌకికుఁడు కావున నెందులకైన మంచిదని లేఖను దిరుగఁదెమ్మనినాఁడు.

సుంద—లేఖయేల ? ఆయనయే మారాణిగారియొద్దకు వచ్చి తన యభిప్రాయము సేల వెల్లడింపకపోయెను ?

మా—ఆమె యెవతెయో యుత్తమక్షత్రియకన్య కావున నామె యంగీకారము మొదట నొందకుండ నామెయెదుటఁ బడుటకు రాజు జడియుచున్నాఁడు.

సుంద—ఆమెను రాజాంతఃపురములో నుంపక వేఱుగ నొక యింటిలో నుంపనేల ?

మా—ఆమెనకూర్చి యన్నియు వేఱువేఱు నేర్పాటులను రాజు చేయుఁదలఁచినట్లు కనఁబడుచున్నది.

సుంద—నీవు భ్రమపడుచుంటివి కాని—మారాణినిగూడ నీమందలోనికిఁ దోలిపెట్టుననియే నానమ్మకము.

మా—అట్లనుకొనవలదు. మీరాణియున్నచోట మఱియొక కోట బయలుదేఱును. మీరాణిని విధ్యుక్తముగా మారాజు వివాహము చేసికొనును. ముందు జరుగవలసిన విశేషము లెన్నోకలవు.

సుంద—సంతోషమే. మారాణిని గట్టుకొన్నతరువాత మీ రాజునకన్నియాటలు చల్లారునులే. కోటలో నిప్పుడున్న వంకకొప్పుల జారుపైఁటల దండునకు వెంటనే విడుదలఁగునులే. మారాణి మిగుల గడుసుది. అసాధ్యురాలు ! కాని మాఘుండా ! ప్రస్తుతరాజ్ఞి యెట్టిది ?

మా—ఇందుమతియేనా ? జ్యేష్ఠ—వట్టి పెసరపప్పు. సుద్ధ పెద్దమ్మ.

సుంద—ఆమె యట్టి లొంగుగుంటయే మనకు మేలుఁగాదా?

మా—కాదా మఱి? కాని—అట్టి చెప్పుముక్క— నా ముఖము మీఁదఁ బాఱవేయవా ?

సుంద—రాజుగారియాజ్ఞకు వ్యతిరేకముగ నేను వెలుపలికి వచ్చితినని యాయనతోఁ జెప్పి నాగొంతుఁ గోయింపవుగద ! ద్వారరక్షకుల కొంపలు గూల్పవుగద !

మా—ఎంతమాట ! ఐనయింటి కాసాబిడ్డఁ డట్లు చేయునా ? తప్పు కాదా ? మా తాతసంగతి నీ వెఱిఁగియుందువు. ఏదో చూచి రాజుగారిచ్చినదేదో తీసికొనుటయే కాని కనుచాటున స్వాతంత్రించి యొక ప్రాఁత బట్టమీఁదఁ గాని, యొక పండుమీఁదగాని యెట్టి చేయి వైచియెఱుఁగఁడు. మాజాతిలో నతఁడు సత్యహరిశ్చంద్రుఁడు. ఇతరులవంటి యల్లరిచిల్లరి సంప్రదాయములలోనివారము కాము. మా తాతగారి పేరిటివాఁడనే నేను. కాని—నీ పేరేది ?

సుంద—సుందరి.

మా—సెబాస్. పేరికిఁదగిన రూపమున్నది. రూపమునకుఁదగిన తెలివియున్నది. తెలివికిఁదగిన తెగనీలుగున్నది. దానినిమించిన దొంగతనమున్నది. అవతారస్వరూపమువలె నున్నావు. సుందరీ ! ఒక్కటే మాట ! నీతో నాలోచింపకుండ నేపనియుఁ జేయను. ఇదివఱకుఁ జిరకాలమునుండి యుదేపంగఁ బరిశ్రమము చేయుచున్న విద్యయగుటచే నంతకుఁదగిన పాండిత్యమే లభించినది కాని కల్పనకుదర లేదు. నీసాహాయ్యము నాకున్నయెడల దిగ్విజయము చేయఁగలనను ధైర్యమున్నది. చూడు. ఈకృత్యము చేయు నాకుదినదినముగండమే. ఏనిముసమెవతను సమకూర్పలేకపోవుదునో యానిముసముననే రాజాగ్రహము. వెనుకఁగూర్చిన కూర్పులన్నియు గోదావరిలోఁ గలియవలసినవే. బ్రదుకు మిగులనస్థిరముగ నున్నది. సుందరీ ! క్రొత్తరాణినిగూర్చి నీవు నడువుమన్న రీతిగా నడచెదను.

సుంద—ఉత్తరమిదిగో! తీసికొందువా?

మా—ఆ! తీసికొనవలసినదే—కాని—ఏమో! ఎందులకు? అదిమీరాణిగారికేకదా! ఆమెకు నీవేచూపించి—అయిననెందుకులే? నాచేతికేయిమ్ము.

సుంద—నీయిష్టమెట్లోయట్లే కాని—రాజుగారికి మనస్త్రీని గూర్చి చెప్పుటయెందులకు?

మా—అబ్బే! దానియగత్యమేమున్నది? అయినను వీలువెంబడి నాలోచింతును—దానికేమికాని—మఱియొక—

సుంద—అదేది?

మా—నాకు సిగ్గువైచుచున్నది.

సుంద—ఏమియుసందేహింపక చెప్పుము.

మా—నీవు పడుచుదానవైపోయితివికాని—నాయీడుదానవైయుండినయెడల రాజవివాహపురాణములోనిదో కొంతయుపాఖ్యానధోరణితోఁ గొంతగ్రంథము నడిపించియుందును.

సుంద—ఆలాగా? మాయింటిలో నీకుఁదగిన వయసుగలదాసి యున్నది. దానినిగట్టుకో.

మా—ఔను. నేను మీయింటను నెవతెనో చూచినట్లు జ్ఞప్తి యున్నది. అదియెవతె?

సుంద—సరే. పెండ్లికూఁతురు నీకంటఁబడినదా? ఎక్కడ?

మా—గాబ్రియాయ్యయొద్ద.

సుంద—ఎంతవయసుదివలెఁ గానఁబడినది?

మా—నిడివిమీఁదగాని దృష్టిబాగుగానానదు. ఎట్లుచెప్పఁగలను?

సుంద—నీవెప్పుడును దానిదగ్గఱకుఁబోయి గ్రుడ్లుకదలుచున్నవో లేదోచూడలేదా?

మా — అటులడుగుచున్నావేమి ?

సుంద — నీవు నిజముగా దానినిగూర్చి యెఱుఁగ నేయెఱుఁగవా?

మా — అబ్బే !

సుంద — నాతోడే !

మా — నీతోడే.

సుంద — మొదటిరోజున మాయింటికాపుదలకు మీరుంచిన ముసలిదనుకొంటిమి.

మా — అది మీతో వచ్చినది కాదా ?

సుంద — చెప్పునదివినుము. గాబుప్రొయ్యియొద్ద నదికాళ్లుకాచుకొనుచుండెను. మాయమ్మగారి దంతధావనమునిమిత్తము వేఁడినీళ్లను దెచ్చుటకై యటకుబోయి దానిమొగము పరీక్షించిచూచితిని. గుడ్లు తిరిగినట్లు కనఁబడలేదు. అదిగాక దేహము గాజువలెనుండెను. లోని కోశములు కనఁబడీకనఁబడనట్లు కానఁబడెను. నాకొడలప్పుడు జలదరించెను. నాయొద్ద నెవ్వరును లేరు. చేతిలోనిచెంబుదానిపైఁ బడవైచితిని. గప్పుమని యదిమాయమయ్యెను. కెవ్వుమని నేనొక్కకేకవైచి కొయ్యయైతినఁట !

మా — అమ్మయ్యో ! నిజముగానే?

సుంద — దయ్యాలకొంపయని నీతో మొదటనే చెప్పలేదా ?

మా — ఇఁకఁజాలు. ఇఁకమీయింటికొక్కటేనమస్కారము. ఇదిగో! ఈయుత్తరము నీవేతీసికొనుము. (ఇచ్చును)

సుంద — అయ్యయ్యో ! నీవురాకుండినట్లు? ఈదిక్కుమాలిన భయమువలన నీవు రా మానివైచినయెడల మాబ్రతుకు లడుగనక్కఱలేదు.

మా — నేనువచ్చుట యెందులకు ? రాజుగారియాజ్ఞయో లేఖయో నీయొద్దకుఁ జేర్చెదను. అదినీవు మీరాణిగారియొద్దకు

జేర్పుము. భూతమనఁగ మాత్రము నాకావైపుబుద్ధిమెక్కదు. నామే నమామ నొక కామినిపట్టి పిల్చిపిప్పి చేసినది. అతఁడాలాగే మొగిరిపోయి నాఁడు. పెద్దవాఁడవు. నీపుణ్యానాయని బ్రదికియుంకున. నేనురాజు నకు వేడుక చెలి కాఁడనైనట్లు నీవునాకు వేడుక చెలికత్తెవు.

సుంద—అటులైన మాయమ్మకీలేఖయేదో కనబడిచి యామె యభిప్రాయ మేదో చెప్పుదువా? నీవెప్పుడు నాయొద్దకువచ్చెదవు?

మా—మీయింటివలనైకెననీకరాఁదలఁచుకొనలేదే! నాలుగు బారలప్రొద్దుండఁగ నేవేఁపచెట్టుకిందికివచ్చెదను. మఱ్ఱిచెట్టుక్రింద గౌతమునకు బుద్ధత్వమువచ్చినట్లు వేఁపచెట్టుక్రింద మాఘునకు నీతో మిత్రత్వమువచ్చినది. ఇదే మనసంకేతము.

సుంద—సరే. పొమ్ము. (ఇద్దఱును నిష్క్రమింతురు.)

ఇది ద్వితీయాంకము.

శ్రీరామా.

ముద్రిక.

తృతీయాంకము.

ప్రదేశము—వీథి.

ప్రవేశము—సుందరి.

సుంద—(చప్పటులు జరచుచు) మాఘుఁడా! ఇటు; ఇటు.

మా—(ప్రవేశించి) ఇంత సేపటినుండియు నీవేఁపచెట్టుక్రింద నే కనిపెట్టుకొనియుంటిని. ఊరకే కూరుచుంటినిగాదా? ఒక్కఁడనే కూరుచుంటినిగాదా? అందుచే రవంత కునికిపాటులు రాఁగ నిప్పుడే పొడుముపట్టుకొనుట కటు పోయితిని.

సుంద—నిద్రనాఁపుటలోఁ బొడుము పట్టుకొంటె నెత్తిపై మొట్టు మంచి పరమహంసక్రియ. (మొట్టును.)

మా—అమ్మా! నీసిగఁదఱఁగ! సహస్రారకమలము విచ్చునట్లు కొట్టినావు.

సుంద—సాయంసంధ్యవేళఁ గూరుచుండి కునికిపాటులేమి? దరిద్రస్వరూపమువలె నున్నావు.

మా—ఇఁక నకు దరిద్రతయేమి? ఇదిగో! నాలక్ష్మీదేవిపరక!

సుం—ఇదిగో! నీమహారాజపత్రము. (లేఖ మీఁదఁబడవైచును.)

మా—మీయమ్మగారికి దీనిని గానఁబడఁచితివా?

సుంద—చెప్పునదొకటి—చేయునదొకటియునా ?

మా—ఏమైనది ?

సుంద—కాదగినదేదో యదే.

మా—ఒప్పుకొనినదా ?

సుంద—రాణిచిత్తము దాసి చేతిలోనిది కాదా ?

మా—ఆమాటకేమిగాని-నాజుట్టు రాజుగారిచేతఁ బడకుండఁ నిప్పటికి రక్షించితివి.

సుంద—ఎట్లు ?

మా—నిన్నుఁజూచి పోయినతరువాత రాజు నాకొఱకు నాలుగువార్తలంపినాఁడు. వెళ్లితినన్న యెడల నేమైనదనియు, లేఖ యేదనియు నడుగును. వెళ్లలేదనిన యెడల నింత యలక్ష్యమేల యని తల పగులఁగొట్టును.

సుంద—అప్పుడెట్లు దాఁటుకొంటివి ?

మా—సన్నిహితబంధువున కెవరికో ప్రాణముమీఁదికి వచ్చుటచే నేమియుఁ దోఁపక యేదో మూలికకొఱకై పోయినాఁడనియు, సాయంకాలమున రాజదర్శనమునకు వచ్చుననియు భార్యామూలకముగఁ దెలియఁబఱచి కడకుటింటి యటుకమీఁదఁ గూరుచుంటిని. ఈదినము గండముగడచినది. నీవు నాసహాసంధానచారిణివై యుందువు గాన నిఁక నాకు భయము లేదు. తుద కొప్పుకొనఁజేసితివా ? ఎంత గట్టిదానవు !

సుంద—ఒప్పుకొనఁజేయుటయే కాదు. ఈరాత్రి యుద్యానవనములోనికి వచ్చునట్లు కూడ నేర్పాటు చేసితిని.

మా—ఆఁ ! నిజముగానే ! నిజముగానే !

సుంద—నిన్నుఁ జంపుకొని తినినట్లే.

మా—ఈరాత్రియే.

సుంద—ఆ!

మా—ఎన్నిగంటలకు?

సుంద—రెండుయామముల నొబత్తు వేయుసమయమున.

మా—సెబాస్ పిసుగా! ఎంతపనిఁ జేసితివి!

సుంద—ఇదివఱకేమైనది? ఇఁక మున్నున్నది.

మా—నీవేమి చేసినఁ జేయఁగలదానవే. చూడు. సుందరీ! రిక్తుఁడను. పెద్దవాఁడను. కుటుంబికుఁడను. అంతవారమగునెడల-ఆ మూఁడుముళ్లకాలమందు ఏదో యొక్క-భూమి-ఏది!-ఈనామగా-మారాజుగారు నన్ను లక్ష్యపెట్టరు లే-మీయమ్మగారితోఁ జెప్పి-ఈవృత్తిలోఁ దిరుగుచున్నానని-ఏది-వ్యవహారజ్ఞానము లేనివాఁడను గానుసుమా! రాచయొరుగులు దిద్దఁగలవాఁడను. ఇంతేకాక పంచకావ్యపరిచయము కొంచెముగాఁ గలవాఁడను. దానిమీఁదటఁ దెలుఁగులలోఁ గొంత సాహిత్యము కుదిరినది. ఆపైన మాతాతగారిపద్ధతిగా జననీకటాక్షమువలనఁ జల్లని కవనధోరణి కొంత పట్టుపడినది. ఇదిగో! నీవు చేయు నుపకారమునకు నీఋణము, మీఁద నుంచుకొనువాఁడను గాను. సుందరమాఘమను శృంగారప్రబంధమును జెప్పి నీకాచంద్రార్కమగు కృతి నిచ్చెదను

సుంద—ఇదివఱకున్న మాఘకావ్యముమీఁద నది పైపెట్టు కాఁబోలునేమి?

మా—అబ్బో! నీకుఁ గావ్యపరిచయము బాగుగానేయున్నదే!

సుంద—నామాట కేమి కాని-నిజముగా నీవు కవిత్వముకట్టఁ గలవా?

మా — ఎన్నియేఁడు తేఁకువని యిందులో దిగితినా? సన్న్యాసయ్యగారిశిష్యుఁడనై మొదటఁ గొంతకాలము యోగాభ్యాసము చేసితిని. అది పెడిసికొట్టుటచేఁ దరువాతఁ బొగచుట్టలవర్తక మారంభించితిని. దానిలోఁ బెట్టుబడి కిట్టకపోవుటచే నింతకంటె సుఖమైన జీవనము లేదని కవిత్వములోఁ బడినాను. కాని, గణసంధానబాధపడలేక రసికాహ్లాదకత్వమున సమానప్రవృత్తియగుటచేత గణికాసంధానములోనికిఁ జప్పునఁ దప్పుకొన్నాను. కాని — చప్పున నేను గోటలోనికిఁ బోకుండునెడల నామానప్రాణములు తక్కవు. పోదునా?

సుంద — మఱియొక్కమాట. మొదటిరాత్రి కావున మిగుల లజ్జచే మారాణిగారు రాజుగారితో నేమియు మాటలాడరు. ఆమె పక్షమునఁ జెప్పవలసినమాటలన్నియు నేనే చెప్పుదును. ఈరాత్రిమట్టునకే యీనియమము. ఈసంగతి రాజుగారితో —

మా — ప్రతిరాత్ర మీనియమమున్నను నాతనికి బాధలేదు ఆతఁడట్టి మాటలసరసుఁడుగాఁడు.

సుంద — ఇఁక నీవు పోవచ్చును. రెండుయామములవేళ రాజు నుద్యానవనములోనికిఁ దీసికొనిరావలయును.

మా — ఉద్యానములో నెచ్చటఁగనిపెట్టుకొనియుండవలయును?

సుంద — తెలివిమాలినప్రశ్న మడిగెదవేమి? నేనావనము చూచితినా? నాకెట్లు తెలియును? మీరెచ్చటనుండుఁడన్న నచ్చట నుందుము.

మా — సరే. కొలనిప్రక్కను వేదిక యున్నది. చూచుకొని యటకురండు వనబహిర్ద్వారమును దెఱచి యుంచెదను.

సుంద — సరే.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

తృతీయాంకము.

ప్రదేశము — ఉద్యానవనము.

ప్రవేశము — మేలుముసుఁగుతో నిందుమతి; సుందరి.

ఇందు — సుందరీ! నీకిదినూతనప్రవేశము. నిమ్మళముగరమ్మా.

సుంద — అమ్మా — మీకీచర్యలో నూతనప్రవేశము. భద్రముగఁ బ్రవర్తింపవలయును.

ఇందు — నిజమే. నీబుద్ధివిభవమునుజూచి నేనిందు దిగితిని. నీ ధైర్యముతప్ప నాకింక నేమియులేదు. ఇదివఱకు సమర్థకమగు సంభాషణమే యెఱుఁగని నేను జిమ్మచీఁకటిలో నర్ధరాత్రమున నుద్యానవనములో — మేలుముసుఁగువైచికొని దుర్మార్గురాలివలెఁ జేటికాసహాయమున్నై మాఱువేసముధరించి యుల్లలాడుచుంటిని. ఇంకరాజునుగూడ నెఱుఁగనివలె మనసుగాఁ బోయెను! హా! ఎంతగతిపట్టినది. ఎంతసేపటిలోఁ జిక్కువడరాలిపడిపోవుచుంటిని! నాకుగుండెలుకొట్టుకొనుచున్నవి. కాళ్లు వణఁకుచున్నవి.

సుంద — అమ్మా! వెఱ దీనికి నెంచుచున్నారా?

ఇందు — నాదుర్గతియిట్టులున్నదని నీతోఁ జెప్పితినికాని యింత వఱకువచ్చినపిదప వెనుకాడెదనా? నేను దొంగచూపెప్పుడైనఁ జూచితినా? ముఖప్రసన్నత నెప్పుడైన మేలుముసుఁగుచే మాటుపఱచితినా? మగనితో మాఱుమొగమున నెన్నడైనమాటాడితినా? మనసునకు మొగమువిధేయముగనుండునట్లెప్పుడైనఁ జేసితినా! హుఁ! ఇప్పుడు

నాతనునాపాదమస్తకము మాయాపూర్ణమైయున్నది. ఇదిగాక, సాని వలెఁ దెగిబడి యపాత్రపాత్రాభినయారంభమును జేయనుంటినిగాదా? ఇతరులు నాయెడఁదప్పుచేసిరని విచారించితినిగాని నేనితరులయెడఁ దప్పుచేసితిననివిచారించితినా? శీలమెంతలో ధ్వస్తమైనది! శిష్టతయెంత లో భ్రష్టమైనది!

సుంద—మీరట్లువిచారింపఁబనిలేదు. నేను ప్రోత్సహించి మిమ్మిందు దింపితినని మీరు లేశమైనఁ దలఁపవలసినపనిలేదు.

ఇందు—నీవుప్రోత్సహించితివని నే నంటినా? నే నంత తక్కువమనసుకలదాననా? నేనునిన్నుఁ బిలిపింపలేదా? నీయొద్ద నాసోదె వెడలఁబోసికొనలేదా? నాకష్టనివారణమునకు గతికనఁబఱుపుమని నిన్నుఁ బ్రార్థింపలేదా? నేనిందులకు మనస్ఫూర్తిగ నొప్పుకొనలేదా? ఇఁక వెనుక దిరుగననినిశ్చయించుకొనలేదా? ఇందు నీప్రోత్సాహమేమున్నది? నీవంతప్రోత్సహించుటకు నేనేమిచిన్నదాననా? అజ్ఞురాలనా?

సుంద—అమ్మా! బాగుగ మఱియొకమాఱాలోచించుకొనవచ్చును. ఇప్పుడైననుమించినదేదియులేదు.

ఇందు—నాయభిప్రాయమేమో నీవెఱుఁగకుండ మాటలాడుచున్నావు. నాపరిస్థితబాధయేదో గ్రహింపకుండ నన్నువ్యథానొంచుచున్నావు. సుందరీ! నిజముగా నాబాధయేదో యెంతయోనీకుఁ దెలియదు. నీవుతెలిసికొనఁజాలవు.

సుంద—ఎందుచేత?

ఇందు—భర్త్రాకర్షణప్రయత్నములు, పరకాంతానిందలు, నక్కటక్కులు, బొల్లిమాటలుఁ కల్లవేసములు, పొంచిపట్టుకొనుటలు, మొదలగునవి నీకుజన్మసిద్ధములు. నాకట్లుకాదే. నేనొక్కసారినీయావరణములోనికి దిగిపోవఁగ నామనస్సునకెట్టులున్నదనఁగ నగరుసూనె

నమ్ముకొనునది పిసుకలు చేయు పనిలోదిగినమొదల దానికదియొంత యసహ్యముగనుండునో, సుస్నాతయై పరిశుద్ధవసనధారిణియగు వనిత ప్రమాదమునఁ బాడిగుంటలోఁబడిన నామె కెటులుండునో, యంత కంటెమిగులరోఁతగనున్నది. సుందరీ! పచ్చికోలుదుర్వాసనావిశేషము బ్రాహ్మణికిఁ దెలియునుగాని పంచమకన్యకుఁ దెలియునా? నేనిట్టు లంటినని యన్యథా యెంచకుము. నీవు నామనస్సునకుఁ బట్టలేక మాట లాడుచుంటివని యింతదూరముగ—నింతకఠినముగఁ జెప్పితిని. నానిశ్చి తమునుగూర్చి సందేహింపకుము. చంచలచిత్తనుగాను. ఎటుపోయి యెటువచ్చినను గణించుదానను గాను.

సుంద—ఎటుపోయి యెటువచ్చినను నీరాశతోఁగూడినమాట లేల? ఆతనికిఁ బరకాంతాలోలత యటుపోవును; స్వకాంతాసక్తి యిటు వచ్చును.

ఇందు—ఏమో చూచెదముగాక!

సుంద—ఎందఱు కాంత లిట్లు రహస్యవేషముల భర్తలకు బుద్ధి చెప్పి సంసారములు బాగుచేసికొనినారు కారు! వారందఱె తవగచి యిట్టులాందోళనమందిరా? మీగౌరవమున కిప్పుడేమిలోపము కలిగెను? మీమనశ్శుద్ధి కిప్పుడేమిభంగము కలిగెను? మనము చక్కఁబఱచుకొనవలసిన మనుష్యులను నయమునఁ జక్కఁబఱచుకొందుము; భయమునఁ జక్కఁబఱచుకొందుము. ప్రత్యక్షముగ దిద్దుకొందుము; కనుబ్రామిదిద్దుకొందుము. బట్టబయలు, చాటుమాటు, నెల్లపనులలో వలె దీనిలోఁగూడ నున్నవి. శృంగారశాస్త్రములోనివి యన్నియు, వగలు—వద్దికలు—గమనికలు, విసరులు, తళుకులు, చమత్కారములు. రాగమునకివియే ప్రాణములు; గడ్డముపట్టుకొనియో, జుట్టు పట్టుకొనియో, మణిదీపముల వెలుతురనో, కనుగ్రింతలచీకటినో, మగ్గవానిని వశపఱచుకొన్నదియే యోధురాలు. అదియే మామాటల

నాఁడది. అనుకూలముగ రాజ్యమేలు రాజు భూమినేలఁగారఁడు. అన్యాయముగ రాజునేలు రాణి ధరణికి ధరణీనాథునకుఁగూడ నలఁతగాఁడు.

ఇందు— అబ్బ! ఎందులకీదీర్ఘోపన్యాసము? నీ ప్రజ్ఞ నాకింతవచ్చుఁ జెప్పనక్కఱలేదు. నాకిది కలకేవచ్చినది. నాభర్త చేష్టలవలననే వచ్చినది. సపత్నుల చాటుమాటు చెప్పులవలననే వచ్చినది. పౌరవారి కొంటెమాటలవలననే వచ్చినది. వారిమాటలను నేనంతగ గణింపను. తాననఁడు? నాసొమ్ము—నాసొమ్మేమి? రాజుగారిసొమ్మేమి? ఇరువదేండ్లనుండి తినినవాఁడు కాఁడా? నావలన ననేకపర్యాయములు బహుమానములందినవాఁడు కాఁడా? నాభృత్యుఁడు కాఁడా?

సుంద—మాఘుఁడేనా?

ఇందు—ఔను. ఆబ్రాహ్మణుఁడు—ఆపలుగాకి—నన్నేమనెను? నేను చెయ్యమ్మనా? ఊఁ! పెసరపప్పునా? నాకుఁ గలకుఁదనము లేదా? కాంతునకు లోకువైనంతమాత్రమున నీకాసామానికిఁ గూడ లోకువైతినా? నాకుఁ గలకుఁదనమున్నదో లేదో చూడఁదగిన కాలము వచ్చినది. ఆహా! లోకమెంత విధ్వస్తమైనది? ఓరిమి పిఱికితనమా? సత్యము శక్తిహీనతయా? శాంతి చచ్చుఁదనమా?

సుంద—కాకేమి? చావఁగుట్టలేని పురికోస సాలెపురుగు. తీవ్రత లేని రాజు దిష్టిపిడత. కాంతుని ముట్టలేని కాంత గడ్డిబొమ్మ.

ఇందు—కానీ! కానీ! ఊఁ! రాజుగారు—ఏది?—కొత్తరాణికి వ్రాసిపంపిన లేఖలోని యంశములు నీకు జ్ఞప్తియున్నవి కావా?

సుంద—మీరు చూచితిరి కాదా?

ఇందు—అంశములంటినా? కాదు. మాటలేమైన జ్ఞప్తియున్నవా?

సుంద—విస్మరణముగ జ్ఞప్తి చేసికొనినయెడల—అమ్మా!—ఆమాటలు మీకు బాగుగా జ్ఞప్తిలో నుండఁదగినవే.

ఇందు—జ్ఞప్తి లేకేమి? తిరుగ నొకసారి విని కసిదీఱఁ దిట్టవలయు నని—వారు వచ్చువేళ కాలేదు కాదా ?

సుంద—అటులైన వినుఁడు. "జగదేకసుందరికి—"

ఇందు—ఇతని కవిత్వమా యిది—లేక యది యట్టిదా ?

సుంద—దాని దాసియే సుందరియగునప్పు డది యెంతటిదో చెప్పవలయునా ?

ఇందు—అంతేనా ? అయిన నేమాత్రపుఁ జక్కనిదో నిమ్మళముగ మాఘునిఁ గనుఁగొనలేకపోయితివా ?

సుంద—అనుమానమున కాస్పదమగుననియాప్రశంసయే యెత్త లేదు.

ఇందు—పోనీ! కన్నులున్నవానికి—నీతియున్నవానికి—ధర్మాచరణమం దాసక్తియున్నవానికి—గ్రామ్యసుఖవిరక్తియున్నవానికి—యమదండనభీతియున్నవానికిఁ—దన ధర్మదారకంటె జగదేకసుందరి కలదా ? అవి లేనివాని కందఱు సుందరులే. జగదేకసుందరులే. ఇష్టదైవమిచ్చువానితోఁ సంతుష్టిఁగనక యాచించు కృపణున కందఱు మహారాజులే. తరువాత దానేమి వ్రాసెను ? 'నీ శరణపద్మదాసుఁడు మ్రొక్కి చేసికొను విజ్ఞాపన' మఱియా ?

సుంద—అవును.

ఇందు—ఆహా ! ఎంత నీచత ! భార్యకు భర్తయే పరమదైవము. భర్తకు భార్యయు నటులే. అట్టి పవిత్రవిశ్వాసములేని మగనిర్భాగ్యున కాఁడుజంతువులెల్ల సర్వశరీరములే. ఆముష్మికప్రదములే. అద్వితీయమగు పరబ్రహ్మము ననుసంధింప బుద్ధిస్థైర్యములేని పురుషునకుఁ గోడియు దైవమే—కుక్కయు దైవమే—బల్లియు దైవమే. తరువాత నీశృంగారశేఖరుఁ డేమి వ్రాసెను ?

సుంద—"నీతో నున్నది నా బ్రతుకు."

ఇందు—హుఁ. మొదటనే యమంగళవాక్యమా ? ఆహా ! ఎంతయొడలు తెలియని మాట నాడినాఁడు. నాబ్రదుకు కాతనిలో నున్నది. ఆతనిబ్రదుకు నాలో నున్నది. ఐహికపుబ్రదుకులోనే కాదు—ఆముష్మికపుబ్రదుకులోఁగూడ మాకట్టి యవినాభావసంబంధమున్నది. తరువాత నేమని—

సుంద—“ అత్యంతశీఘ్రసమావేశమున కాతురపడుచుంటిని. ”

ఇందు—ఇదిగో ! అది యీతీరునఁ గానున్నది కాదా ? రాజా ! ఆయువశిష్ట మిప్పుడే తీర్చుకొందువుగాక ! క్రొత్తరాణిని జూచుటకుఁ గొండంత యపేక్షతోవచ్చిన నీకు—పాపము—పరమనిర్భాగ్యదేవత యగు ప్రాఁతరాణియే దాఁపురించినది. విందారగింపఁబోయినను మిరియాలచేరుమెదుకులే సిద్ధించినవా ? హుఁ ! రాజా ! యెంత దుర్మార్గుఁడవు. ఎంత విశ్వాసహీనుఁడవైతివి ! శాస్త్రముల ననుసరించి—శపథముల ననుసరించి—జగత్కర్తశాసనము ననుసరించి జన్మమున్నంత కాలము నీకు జగదేకసుందరిగాఁ గనఁబడవలసిన నేను—ఒక్కరాత్రి-ఒక్కగడియనైనను—జీకటిని—భ్రమాచ్ఛాదితమగు నీకంటికి “ జగదేకసుందరి”గ నుండవలయునను ముచ్చటతో నిట మహాందోళనమున నుంటిని. రా ! చేతితో సర్వదేహమును, సర్వచిత్తమును, సర్వాత్మయును నీయధీనము చేసిన యిల్లాలి యీమాత్రపు మనోరథమును, దీర్ప నీకు న్యాయము కాదా ? రా !

సుంద—అమ్మా ! నీవు తొందరచే నాతని నేమియు ననఁగూడదుసుమా ! ఈరాత్రి యాతనిహృదయమును బూర్ణముగ విమర్శింతము. తరువాతఁ దగినప్రతిక్రియ చేయుదమని యనుకొంటిమి కాదా ?

ఇందు—కడుపులో నున్నపుట్టి యుడుకుచున్నది. కానీ—తరువాత నేమని వ్రాసెను ?

సుంద—ఇదిగో! జ్ఞప్తికిఁ దెచ్చుకొనుచున్నాను. "నన్ను నా రాష్ట్రమును—రాణిని నిరంకుశముగ నేలుకొనవలయును." అని.

ఇందు—హా! వికట కోపిక లేకున్నది. అట్లైన "చిత్తగింప వలయు"నే కాదా?

సుంద—అదే. "అంతరంగమునకుఁ దేవలెను."

ఇందు—చరణదాసానుదాసుఁడైనప్పుడు చిత్తగింపవలయునను టమాత్రము దోషమగునా? ఎట్లు? "నన్ను—నా రాష్ట్రమును—రాణిని నిరంకుశముగ నేలుకొనవలయును" అనియా? "నన్ను" సరే. అతనికర్మము. "నా రాష్ట్రమును" సరే. అది యతనివంశములోని రాజులందఱకర్మము. రాణినిగూడ నేల యేలుకొనవలయును? నన్నేలినఁగాని యాజగచ్చక్రవర్తికి నిరంకుశాధికారము చెల్లుబడి కాదా? నన్నుఁగూడ నేలినఁగాని యాతని "చరణదాసత్వము" నకు సంపూర్ణత సిద్ధింపదా? సుందరీ! నన్నుఁగూడ నేలుకొనుమని యాతఁడు దీని బ్రార్థింపనేల? వ్రాఁతరూపమున శాసింపనేల? లోకమున నెచ్చట నైనఁ బట్టపుదేవియే దేవి. మిగిలినవారందఱు ప్రక్కయంగుబొమ్మలే కాదా? ఈలోకనీతి తుడిచిపెట్టుకొనిపోయెనా? పోనీ! పెద్దరాణి చిన్నరాణియను తారతమ్య మక్కఱలేదా? కుడి యెడమ భేదమే కూలిపోయెనా? ముందువెనుకలతోఁ బనిలేదా? ప్రస్తావన తరువాత నాందీపూజ సేయు నటకుఁడుండునా? ప్రథమపత్రమున నుండవలసిన శ్రీకారము రెండవపత్రమున నుంచిన గ్రంథకర్త నేమనవలయును?

సుంద—అమ్మా! మోహాంధులకు ముందేమి? వెనుకయేమి?

నేపథ్యమున

ముందుంటివా? వెనుకనుంటివా? ఈగాఢాంధకారమున నా భేదమేమియుఁ దెలియుటలేదు. (మఱియొకకంఠరవముతో)

ఆభేదమే కాదు. హెచ్చుతగ్గుభేదము కూడ నశించినది.

ఇందు—పరకాంతల వేఁటకాఁడు బయలుదేరినాఁడు.

సుంద—ఱక్కతోఁగూడ-అమ్మా! వారు కొలనిపక్క వేదిక పైఁ గూర్చుందురు. కావున వారటకుఁ జేరకుండనే మనమచ్చటికిఁ బోయిన మంచిదికాదా?

ఇందు—వారేమనుకొందురో వినవచ్చునని యా? నడు.

(ఇద్దఱును వేదికను సమీపింతురు.)

(రాజు సేతుమాధవుఁడు, మాఘుఁడు ప్రవేశింతురు.)

మా—బాబూ! నేను ముందేయుంటిని బాబూ! ఇదిగో! నాకరము గ్రహింపుఁడు.

సుంద—(తనలో) అయ్యొ కీఁక బురుమ పాణిగ్రహణమే తగవాయి.

ఇందు—(తనలో) ఆహా! రాజా! విచ్చేసితివా? నీవిక చర్య భార్యకుఁ గనఁబడుమట కింతశ్రమపడి, గాంధాంధకారము వేం చేసితివా? సెబాస్. నీకు భార్యయుం బొంతదయు!

సేతు—ఓరిమాఘా! చేయిపట్టుకొన నేల? విడువుము. మాకీ దేశము నూతనమా? మాకిట్లువచ్చుట నూతనమా? మాకీవ్యాపారము నూతనమా? కాలచక్రము దేవుని చేతిలోఁ దిరుగునట్లు కాంతా చక్రము మాకంటిలోఁ దిరుగుచున్నది. హెం. హెం. హెం. (నవ్వును)

మా—బాబూ! ఈరాత్రి వెనకటిరాత్రులవంటిది కా బాబూ!

సేతు—ఎందుచేత రా?

సుంద—(తనలో) మేమిచ్చటనుండుట చేత.

మా—మబ్బుదట్టముగఁ బట్టుటచేత గాఢాంధకారము నున్నదికాదా బాబూ!

నేతు—మబ్బుపట్టనీ వర్షముకురియనీ—పిడుగులుపడనీ—మబ్బునకుఁబట్టువిడుపున్నది కాని మాకాపట్టువిడుపులేదు. పట్టినయెడల నొక్కటేపట్టు—ఎంతపట్టులేనియెడల నేనుకోర్జముల కొప్పులనొక్క పిడికిటిలోఁ బట్టగలము! ఆఁడుదానినివశపఱచుకొను తెలివియేయన్ని తెలువులలోను భింకమైనది. అదియున్నవానికిఁ బ్రపంచమంతయుఁ గరతలామలకము.

మా—మా బాబు భూలోకబృహస్పతి! ఏమిబాబూ!

ఇందు—(తనలో) ఛీ ఛీ!

మా—నిజమేకాని బాబూ! ఈరాత్రి రాణి బాబూ! అట్టియుట్టి లొంగునని తోఁపదు బాబూ!

నేతు—పెంకితనము మాయొద్దనా? అంత తెగనీలిగినయెడల మేము వెనుకముందుఁ జూతుమా? ఆఁడుదాని పెంకితనముచేతఁగాని పందయొద్ద—దయాదాక్షిణ్యము లేడ్చినపిఱికివానియొద్ద—మంచిచెడ్డయని మడిగట్టుకొన్న శుంఠయొద్ద—హృదయమనునది యేడ్చిననిర్భాగ్యునొద్ద—ఒక తెపోయినను దాసిస్థానమునఁ బదునలుగురఁ జేర్పలేని నపుంసకునియొద్ద—అంతేకాని మనయొద్దనే! హెహె హె! (నవ్వును)

ఇందు—(అపవారించి) ఈయువకతవకయహంభావములో సిగ్గుమాలిన యీనవ్వేమి?

సుద—(అపవారించి) అమ్మా! రుచికి లొట్టయెట్టిదో వాచాటతకు వెట్టినవ్వట్టిది.

మా—బాబూ! ఈరాత్రి యీయామె మీతో మాటలాడదఁట. కారణము సిగ్గఁట బాబూ!

నేతు—చూచుటకు మాటలతో నిమిత్తము లేదు. నేనింతకాలము నుండి చూచుచుంటినిగాని మాటలోఁ బసనాకెక్కడను గనఁబడలేదు.

పిండివంటకుఁ బైవాసనయెట్టిదో మాటయట్టిది. హాసనంతోఁ గడుపు నిండునా? నోటఁబెట్టవలయును; నమలవలయును; మ్రింగవలయును. అప్పుడుదానిహాయి. ధ్వనిరసజ్ఞతయని, వచోరసజ్ఞతయని, గాయకులు కవులేమో తెగనీల్గెదరుగాని రసగ్రహణమునవారు కేవలముషండులు. అందుకొఱకే వారినెవ్వరిని మనము చేరనీయలేదు. మాటయనునది శృంగారగ్రంథమునకుఁ బైనట్టవంటిది. దానినిజింపిపాఱవైచినను గ్రంథమునకుఁ బ్రమాదములేదు. అదిగాక గ్రంథోపయోగమున ముప్పాతిక బరువుతగ్గును.

మా—బాబూ! మీరొనర్చిన నిర్వచనశృంగారప్రబంధము మిగుల రసపుష్టిగలిగియున్నది బాబూ!

సుంద—(తనలో) రాజా! రసికోత్తమశిఖామణివి! వచ్చిన సంగ్రహార్థముచేత పెయ్యగఁజేసి డాఁచియుంపవలసినవ్యక్తివి.

ఇందు—(తనలో) ఆహా! పశుత్వమింతకన్న నయముగదా! పశువులలోనైననురాగలక్షణము లాలోకములలోనఱవులలోఁ గానఁబడునే! ఆహా! ఈతఁడుపట్టినిర్మనస్కమైన యంత్రమువలె నున్నాఁడే!

మా—బాబూ! ఇదియే వేదిక; సంకేతస్థలమునఁ గూర్చుండుఁడు. ఇచటఁ జెట్లనీడలేకుంటచే మిగులఁ జీఁకటిలేదు బాబూ!

సేతు—వారురాకపోవుటకుఁ గారణమేమి?

మా—ఇంకను రెండుయామముల ఘంటామ్రోగింపఁబడలేదు. బాబూ!

సేతు—ఈరాత్రియొకగంటముందుగనే దానివాయింపవలసినదని నగార్చిలతోఁ జెప్పలేకపోయితివా? నీకుబుద్ధిలేదు. నాత్రొందర యెట్టిదో గ్రహింపఁగలవ్యక్తి నీకులేదు. ఇట్టిరాజకార్యములలో రాయబారికెంతచాకచక్య ముండవలయును? కాలికి మెఱపు వేగముం

వలయును. నోటికిఁబిడుగుధాటి యుండవలయును. అస్థానవ్యాపారము లలో నింతజాడ్యమా ? ఇంతసాగుడా ?

మా — బాబ్ — బాబు, నేనుమిగులఁ గష్టపడి సేవఁజేసికొను చున్నాను. నాలోపములేదు. బాబు ! వచ్చుకాలమింక రాకుంటచే వారురాలేదు బాబూ !

సేతు — వచ్చుకాలము రాలేదేమి ? నీవుశుంఠవైనప్పుడు కాలము వచ్చునా ? జుట్టుపట్టుకొని దానినిముందునకు లాగఁగలనేర్పునీకేదీ ? నీవు పనికిరావు. నీవు తెలివిగలవాఁడవేయగునెడల మేమింక మఱి నూర్గురనైనఁ జేరఁదీసియుందుము. నీతెలివిలేమివలన మాకెంతనష్టము నుత్సాహభంగమునుగలుగుచున్నదో నీవెఱుఁగుదువా? నీవుపనికిరావు.

మా — బాబ్ ! బాబ్ ! బాబ్ ! ఏలినవారివంటి నిరంకుశుల యొద్ద — బాబూ ! — నేనుగాకపోయిన బాబూ! — మంత్రి యుఁగంధ రుఁడైన నావశ్యకమున్నదా ? బాబూ ! ఎల్లకార్యములు నిస్సహా యులై మీరేనిర్వహించుకొనుచున్నారు బాబూ ! సర్వకాంతాదిగ్వి జయము సహాస్రిబాహువులతోఁ జేయుచున్నారు బాబూ ! చూపు పాఱిన చెప్పుడైన దూసిపోయెనా ? బాబూ ! తలఁపెట్టిన దెప్పుడైన దాఁటిపోయెనా ? బాబూ! మీరాడిక చెప్పుడైన మాఱువడియున్నదా ! బాబూ ! మీజన్మకాలవిశేషమది బాబూ ! మీగ్రహబలమది బాబూ! మీపిండవృష్టియది బాబూ ! నేనూరక నిమిత్తమాత్రమని నే నెఱుఁ గనా ? బాబూ !

(లోన నొబత్తుధ్వనియగును.)

సేతు — వింటివా ? వాద్యావశిష్టము తీరినది. ఇంకవారురాలే దేమి ?

మా — బాబూ ! నే నొకసారి నిమ్మళముగఁబోయి తీసికొని రమ్మని సెలవా ? బాబూ !

సేతు—పొమ్మని సెలవాయని యందువా ? పో. ఎగురు. త్వరగ రమ్మని చెప్పు. తళుకుమను సంతలో రా ! పరుగెత్తు. చూడు చెప్పవేటు కాలములో — వెళ్లుట — తెచ్చుట. అప్పజెప్పుట. అంతే.

మా—చిత్తము బాబూ ! చిత్తము బాబూ !

(మాఘుఁడు పరిక్రమించును.)

ఇందు—(అపవారించి) సుందరీ! ఆతఁడు మనలఁ గనిపట్టునేమో ?

సుంద—(అప) అమ్మా ! నేనాతని నెదుర్కొనెదను లే. ఇంకను దొందర లేదు.

సేతు—

గీ. మొగ మొగువఁ బెట్టి చెవులు నిక్కఁగను బెట్టి
యూర్పు బిగఁబట్టి గుండెల యులుకుఁ గట్టి
యొకని రాకను గనిపెట్టి యుంటకంటెఁ
జండతరమైన బాధ వేఱొండు లేదు.
అందు పైనాఁడుదానికై యుండు మీఁదఁ
గ్రొత్త గడి క్రొత్త సరి క్రొత్త కోమలికయి
తేరి తెగటారనట్టి సందిగ్ధదశను
బడుచు వేఁచియుంట యమబాధ కాదె ?
అందు పైనట్టనడురేయి నడవిలోన
నేకతమ నిల్వ్రగుడ్డుల నిరులగిరులఁ
దూటుపడి తూలునట్లుగ దూర్చివైచి
యుంటకంటెను నరకమిం కొండు లేదు.

మా—(తనలో) ఇప్పుడెక్కడకుఁ బోదును? వారు బయలు దేరి యేయుందురేమో ! వారిదొక దారి నాదొక దారి యగునేమో ! వారిటకు వచ్చుసరికి నే నిక్కడ లేక పోయినయెడల మఱింత చెప్పుదెబ్బలు.

సుందరి పుణ్యమా యని బ్రదికితిననుకొంటిని. కాని తోటగుమ్మము నొద్దఁ గనిపెట్టుకొనియుండుము. ఈమూర్ఖున కొక్కచేతొందర. నోటి మాటయింక నోటనుండఁగనే కార్యముగఁ బైకెక్కవలయును. రాచపుండు వలెఁ బ్రాణసంకటముగానున్నది.

ఇందు —(అప) సుందరీ! ఆతఁడీవైపునకు వచ్చుచున్నాఁడేమో కొంచెము ముందునకుఁబోయి కనిపెట్టుము. ఏమియు నగపడుటలేదు.

సుంద—(అప) మనల నాతఁడు కనిపట్టలేఁడు. మీరీ చెట్టు మొదటనే యుండుఁడు. నే నాతని గలిసెదను. (పరిక్రమించును.)

సేతు—(తనలో) ఇంకను రాలేదు. కారణమేమో ? రారేమో ! వారికొఱకు వెడలిన మాఘుఁడు కూడ మాయమైనాఁడు.

సుంద—ఏమియుఁ గనఁబడుటలేదు. ఎవఁడవు నీవు? మాఘుఁడా !

మా—సుందరీ !

సుంద— నీవు తోటగుమ్మము నొద్దఁ గనిపెట్టుకొని యుండుమని చెప్పితివి కాదా ? నీ గొంతుగోయ !

మా—నాకేమి మతియా? వల్లకాడా? రాజుగారు నాగొంతుఁగోయుచున్నారు; ఆమె యేది ?

సుంద—ఇఁకఁ జాలించు. కొత్తస్థలములో గాఢాంధకారములో దారిగానలేక గిజగిజ కొట్టుకొనుచుండ—

మా—మా రాజుగా రింతకంటె నెక్కువ గిజగిజ కొట్టుకొనుచున్నారు. ఆమె వచ్చినదా ?

సుంద—ప్రాణము విసుకుటచేఁ బోవుటకు సిద్ధముగనున్నది. ఇది మర్యాదయేనా ? ఇదేనా మీ కాంతాగౌరవము. ఈమాత్రపు దానికే మీరాజింత లేఖను వ్రాసినాఁడా ? చాలులే. నడు నడు! మీ రాఖువలదు. రాష్ట్రము వలదు.

మా—సుందరమ్మా! క్షమింపుము. ఈసంగతి తెలిసినడల రాజు నన్నుఁ జంపును. ఆతనియొద్దకుఁ బోవుదము రండు. ఆమె కనఁబడదేమి ?

సుంద—మా రాణిగారు మాటలాడరని స్పష్టముగా రాజుతోఁ జెప్పితివా ?

మా—ఆ.

సుంద—అటులైన నడు. అమ్మా! ఇటురమ్ము. (ఇందుమతి వారిఁ జేరును.)

మా—రండు

ఇందు—(అప) సుందరీ! నాకు దడయెత్తుచున్నది. నన్ను గఁబట్టుకొనుము.

సుంద—(అప) నీవిప్పుడు మనసును దొట్రుపాటు కడనీకుము. ధైర్యమును విడువకు. లేనియెడలఁ బ్రమాదమున్నది.

ఇందు—(అప) నేను మాటలాడను గాదా ? ప్రమాదమేమి?

సుంద—(అప) క్రొత్త దేవతయో, పాత దేవతయో యెంతచీఁకటిలోనైన స్పర్శముచేఁ దెలిసికొనుట కష్టము కాదు. అందులో భార్యనట్లు తెలిసికొనుట బొత్తిగాఁ గష్టము కాదు. రాజు వట్టి మూర్ఖుఁడు. నన్నుఁదగినవాఁడు కాఁడు. తొందరతోఁ గౌఁగిలించుకొనిన యెడల నీవని గ్రహింపఁగలఁడు.

ఇందు—(అప) అందుకొఱకు నేమిచేయుమంటివి ?

సుంద—(అప) నేను రాజు చేష్టలు గాఢపరిశీలనముతోఁ గపట్టెదను. నీవు నాచాటుననే యుండుము. నీయెడమచేతి చూపుడు వ్రేలు గట్టిగ నొక్కిన వెంటనే పాఱిపొమ్ము. నీకీ స్థలమంతయుఁ జాలపరిచితముకదా ?

ఇందు—(అప) అబ్బ! సుందరీ! ఎన్నిచిక్కులలోఁ బడితిమి.

సుంద—ఇంతమాత్రమునకే చిక్కా? రాజును సమీపించుచున్నాము. భద్రము.

సేతు—(వినుట నభినయించి) బళే! వచ్చుచున్నట్లున్నారు.

గీ. గొంతుబిగియింపు గలగున గుసలపసలు
దొంగముంగాళ్లటంగ నా కంగుకంగు
లులుకు మాత్రగంటిపిట్టల కలకలములు
చెవులఁబడి మదిఁబడి యాత్మఁ జెనకెనహహా!
ఇలనుబడిన యాకులగల గలయు గంజి
బిగువుగాగ రాకుచ్చిళ్ల పెళపెళయును
నందెల ఝుళఁఝుళయుఁగూడి యహహా! మదికి
విలవిలనుబాపి కడుకల కలనుగూర్చు;
కిటికిగని హుంకరించు జాగిలము వలెను
బికిలిఁగని బావురను మాను బిల్లివలెను
గప్పఁగని బుస్సుమను త్రాఁచు కరణినట్టె
మొగిరి గుటుకున దాని మ్రింగఁగఁదలంతు.

(ఇందుముఖి, సుందరి, మాఘుఁడు రాజసమీపమునకుఁ
బోవుచున్నారు.)

సేతు—రే మాఘా! రావోయి! రప్పింపవోయి! పీఁట వేయింపవోయి! పళ్లెర మెదుటఁ బెట్టింపవోయి! చిత్రగుప్తునోటికి బెడ్డఁగొట్టింపవోయి! పాయసకలశము నోటి కందీయవోయి.

మా—ఇఁక మీయిష్టము బాబూ! రచియించిననాటికను బ్రభువువారికిఁ గృతినిచ్చితిని. మీరాడించుకొన్న సరే, పాడించుకొన్న సరే.

సేతు—హాహాహా! (నవ్వును.)

ఇందు—(అప) సుందరీ! ఈతఁడు దౌర్జన్యమొనర్చు నేమో? మనము బయటఁబడుదుమేమో?

సుంద—(అప) నేనుంటినిగాదా? ఏమియు జడువకుము.

సేతు—ఈ మేలుముసుఁగు పెండ్లికూఁతురుగారా! ఇది దాసియా? అబ్బో! ఇదికూడ మనకన్నుఁ బొడుచుచున్నట్లున్నదే! కన్యతోనిది మనము దక్షిణగా గ్రహింపఁదగినట్లున్నది. వహావ్వా! మాఘా! బుద్ధిమంతుఁడవు. కల్పనయనఁగ నీలాగుననుండవలయును. సెబాస్! ఒకరిని చెప్పుమనఁగ నిద్దఱను దెచ్చితివి!

మా—ఈ వ్యక్తి నాటిక. అది నాంది.

సేతు—హాహాహా! (నవ్వును) నాందికూడ సుందరముగ యున్నట్లున్నది. సెబాస్! మాఘుఁడా! నాటికతోఁబాటు నాం. కూడ మాకే కృతినిచ్చితివి కాదా? హాహాహా! (నవ్వును) మాఘుఁడా! మా అభీష్టమును నెఱవేర్చితివి. సంతసించితిమి.

మా—నెరవేర్చువాఁడను నేనా? బాబూ! మా బాబు వేదపురుషులవలె సంకల్పసిద్ధులు! ఏమి బాబూ!

సేతు—ఇప్పుడు వేదములెందుకోయి! అవి నపుంసకులనెత్తిని గట్టు. చందనములోనికి గోమయమెందులకు? కావలసినది చంద్రరేఖ కాదా? ఇదిగో! నాచంద్రరేఖ. ఇది కావలయును.

గీ. మొదలె చీఁకటి యందుపై మొయిలుండుదాని
పైన మేలుముసుఁగును గూడఁ బూనితేల?
తొలఁతునా? చూతునా? కనఁబడక యున్న
నేమి లే! ముద్దుఁగొందునా? దొంగిరియట్లు.

(ఇందుమతి పైకిఁ బోవును.)

సుంద—రాజా! అక్కడనే. ఆఁగు. ముందడుగు పెట్టినయెడల బాగుగా జరుగదు. చేయిచాపి త్రెంపుకొనుటకు నీతోఁటలోని ఫల మనుకొంటివా? గోళ్లతోఁ ద్రుంపి ముక్కునొద్ద బెట్టుకొనుటకు నీయుద్యానమందలి పుష్పమనుకొంటివా? ఏమీ! ఎంత లఘువుగఁ జూచుచుంటివి! జాగ్రత్త! ఈమె యెవ్వరో యెఱుఁగుదువా? ఉత్తమక్షత్రియురాలు; పరమాభిమాన సంపన్నురాలు. అభిమానముకొఱకుఁ బ్రాణము విడుచు నాభిజాత్యసంపన్నురాలు. మీమాట లిట సాగుననుకొంటిరా?

సేతు—(అప) మాఘా! ఇదిమనకు సంధానమున నెక్కుడుగఁ దోడుపడునని నీవు చెప్పియుంటివి కాదా?

మా—(అప) ఈసుందరి వట్టిముప్పేటనారి కేళపుముండ బాబూ! పై పెంకుఁజూచి జంకఁదగదు బాబూ!

సేతు—సుందరీ! అట్లైన నేమందువు?

సుంద—ముందునకు వైచిన యడుగు వెనుకఁబెట్టుమందును. చేయిచాప వలదందును. తొందరపడవలదందును. సమయమును గుర్తెఱిఁగి దూరమాలోచించుకొనుమందును.

సేతు—సుందరీ! ఆలోచింపకుండ—మంచిచెడ్డ లెఱుఁగకుండ నంతతొందరతో మాటలాడెద నేల?

సుంద—ఆలోచించుటా! అది యెవరికున్నది? మంచిచెడ్డ లెఱుఁగుటా! అదియెవరికున్నది? శాంతియా! అదియెవరికున్నది? ఇదిగో! ప్రభువులకు మీరు చెప్పినవిద్యయే మీప్రజలలో నిట్లు ఫలించి ప్రకాశించుచున్నది. నేను బానిసను గావున నావ్యాపారము వట్టిమాటలతోనే తేలిపోవుచున్నది. మీరు ప్రభువులుగావున మీవ్యాపారము గట్టిక్షేమములలోఁ బ్రజలనుముంచుచున్నది. గురువుగారు సాసనిగూడి

నప్పుడు శిష్యుఁడు జావళిఁ బాడినఁ దప్పా? ప్రభుఁడు ప్రాఁగుఁబోతైనప్పుడు బానిస యెదురుబోతగుట తగదా?

సేతు—అట్లు కాదు. బానిస నోటిచురుకుగలది యగునెడలఁ ప్రభుఁడు చేయికఱవు గలవాఁడగుట తగదాయని పలుకుదును. బో గ్రత్త.

సుంద—అదియొక్కటి యేమీ యోగ్యతకు మానవహానశక్తికిఁ దరువాయిగనున్నది. ఉఁ. కానిండు వలదన్నవారెవ్వరు? ఏమిప్రభుఁడవు? ఏమిసరసుఁడవు? ఏమియింగితజ్ఞుఁడవు? ఏమిలలితుఁడవు! లోకమున నుండుపురుషులు ప్రేమచేఁ-బౌరుషముచే-రూపముచే-ధనముచేఁ గాంతల నాకర్షించుకొనుచుండ మీరా సాధనముల వర్జించి చేతికఱ్ఱచేఁ-గాలిముచ్చెచేఁ గాంతలకు బోగ్రుచేయుచున్నారు. మహాత్ములుగారు కత్తిమొనను మతవృద్ధిచేసినట్లు. కఱ్ఱపొన్నన మీరు సతివృద్ధిచేయుచున్నారు. ఓ! జెబ్బపుష్టిసరసమా—జబర్దస్తి కిటుల్వాసు. మూర్జా మదనవిలాసము!

సేతు—(అప) హూఘూ! ఈముండనన్ను మించినట్లున్నదోయి! ఇదియింత చెడవాగినను నాకుఁ దీవ్రముగు కోపమేరాకున్నదేల?

మా—(అప) బాబూ! అంతయే కాదు. పాగదీసినన్ను డొండ పైఁగొట్టినను నాకు దీనిపైఁగోపము రాలేదు. బాబూ!

సేతు—(తనలో) కోపము నభినయింతును. (ప్రకాశముగ) నీవెక్కడ? నేనెక్కడ? వదఱుబోత! నేను రాజనని మహాగౌరవస్థానమనని కాసంతయైన నాలోచింపకుండ నోటికివచ్చినట్లెల్ల వదరెదవా?

సుంద—గౌరవస్థానమా? జీలుగుబెండునకున్న గౌరము కాకియాఁకెకున్న గౌరవము పరకాంతను జూచి పండ్లిగిలించిన ప్రభువున కెక్కడిది? బానిసక్రింది బానిసయైన నాతని నెత్తిపైనాఁడు. చపలత లేని యుప్పరివాని నెత్తిపై మట్టితట్ట చపలుఁడగు చక్రవర్తి నెత్తిపైఁ గిరీ

టముకంటె నెక్కువది. వెకిలిరాజుచేతిఖడ్గము వెఱ్ఱిగొల్లని పంగలకఱ్ఱ కంటె నెక్కువది కాదు. కావున గౌరవలాఘవప్రశంస మీరు సేయఁదగదు. నావంటిదాసీకోటికి మీరు చేయిచాచినప్పుడిఁక మీకుఁ ఘనతయేలోకముననున్నది ? యాదృచ్ఛికముగ నిప్పుడు మీరీయుత్తమకాంతను హరించితిరి కాని, యిదివఱకు బుద్ధిపూర్వకముగ మీరు చేరఁదీసినదంతయుఁ జేఁతపెయ్యల బిడారమే కాదా ! ఎట్లైనను బరకాంతను జపలతతోఁ జూచుటయొకటి, పరువుసర్వాంగకముగ జచ్చుటయొకటియు నా ? ఈవృత్తి చేసికొను నాకంటె మీరు వ్యాపారబాహుళ్యమున నెక్కువయే కాని గౌరవమున నెక్కువ ? దాసినైన నేనే మిమ్ములత్తుపెట్టినప్పుడు మారాణియైన యీమెనిన్ను గణించునా ? మేమొందఁ లకైనఁ దెగించియున్నాము. కావున దూరమాలోచించుకొని మఱిమాటలాడుము.

మా—(అప) బాబూ ! మదనకళామహామహోపధ్యాయులైన మీకు నేను జెప్పఁగలవాఁడను గాను. బాబూ ! ఏమొరెత్తుగ వచ్చుచున్నదని సందేహింపకుఁడు బాబూ !

సేతు—(అప)

గీ॥ లలితశృంగారరసనదిఁ జెలఁగుమారు
వకృదొంగయీబులు బలుసుస్కనేన్న
టేఁతనెఱిజాణ గణియించునే తుపాకి
పిక్కటె కురుగాలి విసరు లెక్కగలదె ?

(ప్రకాశముగ) సుందరీ ! ఆలోచించుకొని మఱిమాటాడుమని చెప్పినావు. ఆలోచించుకొనుటనంతే మిది కాదు. ఇది బుద్ధితోఁజేసిన వ్యవహారమే కాదు. అట్లైయుట్లై యడ్డులేకుండ నాశుకపిత్వమువలెఁ బోసీయవలసినదే ! అంతే కాని యీమాత్రపురాజకార్యమునకు వెనుకముందు

త్రొక్కులాట యేల? పిల్లి యెలుకను బట్టుటకు శకునమేల? దుప్పి త్రాచుపామును నమిలివేయుటకుఁ దాంబూలప్రదానయేల? ఇది జన సామాన్యము. సహజము. ప్రపంచచర్యాగానమున గొల్ల నిదియే పల్లవి.

మా—(అప) మాబాబు కంతుసూత్రకారకులు. కలియుగ వ్యాసులు! ఏమిబాబూ!

సుంద—ఆహా! మనుజత్వము పశుత్వపుమట్టమునకుఁ దిగలా గుటలో నీమిట్టవేదాంతము తొట్టివైద్యమునకంటెఁ బ్రబలతరముగ నున్నది. నాయనా! అవతారపురుషుఁడవు! ఇంద్రజాలు! మేము నీ మతములోనికి దిగిపోఁజాలము. కావున మాకు సెలవొసంగుఁడు.

ఇందు—(అప) ఈసంభాషణము నాకు మిగుల రోఁతగనున్నది. త్వరగఁ బోవుదము రమ్మా.

సుంద—(అప) అమ్మా! తొందరపడకుము.

సేతు—సెలవుతీసికొనుటకే వచ్చితిరా? పోనిచ్చుటకే తెచ్చితినా? అది నట్టికల్ల. కాని నామాటలవలన మీ కాంత బెదరవలసిన పనిలేదు. మాప్రభావమట్టిదని మాటవరుస కంటిని. పనివచ్చినప్పుడు పర్వతశిఖాగ్రమును లాగఁగలయేనుఁగు విలాసముతోఁ బద్మిని నిపాయముగ నెత్త లేదా? మనకది యున్న దిదియున్నది. ఒకకంట జ్వా—ఒకకంట లీల. ఈచేతఁ జిగిలిబాకు—ఈచేత మొగలిరేకు. అం. ఇటో! అటో! మీరు కావున నింతసేపు మాటలాడుచున్నాను. మా టలలోసారము గణించువాఁడు వట్టిపనికిమాలినవాఁడు.

మా—(అప) ఎంతసేపు మాబాబు శుద్ధకర్మయోగి. ఏమి బాబు!

సేతు—టక్కు టిక్కున నేను జెప్పుచున్నాను. మీ కాంతను విధ్యుక్తముగా వివాహమాడుటకు నిశ్చయించుకొంటిని. కావున నా మా నంగీకరింపఁజేయుడు.

సుంద—అమ్మా! రాజుగారనుమాటలను వింటిరా? మీయభిప్రాయ మేమి?

ఇందు—(తల యూఁపును.)

సుంద—మాయమ్మ శిరశ్చాలనమున నంగీకృతి దెలిపినది.

సేతు—సెబాస్! ఇఁకనేమి? ఇఁక మేము భార్యాభర్తల మైతిమి. వివాహమనునది వట్టివేడబము. నిరుపయోగమైన తంతుసుమా! ముడిపడవలసినది మనసులేగాని మెడలేఁగాదు. అది టక్కునఁ బడినది. ఇఁకఁ జప్పునఁ గౌఁగిలించుకొనుట కభ్యంతర మేమున్నది? (చేతులు చాఁపును.)

సుంద—(చేతులు త్రోచివైచి) ఆగు. ఆగు. వివాహమే యభ్యంతరము.

సేతు—అది యగునంతవఱకుఁ గాఁగఁదరమగునా? ఆఁకలి చుఱచుఱలాడుచున్నది. ఎదుట బంగారుపళ్ళెరములోఁ బంచభక్ష్యపరమాన్నములతో వడ్డనయై యున్నవి. నోరూరుచున్నది. వెంటనే భక్షింపక వెఱ్ఱివాఁడైన నూరకుండునా?

మా—మా బాబుని యెంతసేపు మాండవ్యమతము. ఏమి బాబూ!

సుంద—రాజా! ఆఁడుదాని మొగ మెఱుగని వాఁడువలె నంత తహతహ పడెద వేల?

సేతు—ఉన్నసొగసే యది. ఉత్తమపురుషుల కుండఁదగినగుణసంపత్తియే యది. వారిప్రకృతు లతిగంభీరములు. దిగినకొలఁది లోఁతు. తిన్నకొలఁది యాఁకలి! పూడినకొలఁది గోయి! కుందెపుగుఱ్ఱమునకువలెఁ బరుగెత్తినకొలఁదిఁ బౌరుషము. ధారాకవితవలె విడినకొలఁది వేగము. అప్పల శృంగారమువలె మాది తాటాకు

మంట కాదు. ఇది వంశదహనము. అంటుకొన్నకొలఁది మంట. త
వ్వినకొలఁది దాహము. ఉత్తమపురుషశృంగారములో నున్న పెద్దపుల్లి
మునకయే యిది. లేకుండిన నింతతహతహ పడుదునా ?

మా—శృంగారరసములో మాత్రము మా బాబు పెట్టినది
భిక్ష. ఏమి బాబూ !

సేతు—ఇట్లయిన—వివాహమగువఱకు మొక్కుముద్దయిన
బెట్టుకొనకుండ శుష్కోపవాసము చేయవలసినదేనా ? సరే. ఊపి
బిగఁబట్టెదము. ఇఁక నేమైనఁ జెప్పవలసినదున్నదా ?

సుంద—మీకిదివఱకొక రాణి యున్నదికాదా ?

సేతు—పేకలో నాల్గురాణులు లేవా ?

ఇందు—(తనలో) నేను నట్టి చచ్చుబొమ్మరాణినా ? ఇష్టా
నుసారముగాఁ జేతఁ దిప్పుకొనుటకుగాని, నేల నడఁగఁగొట్టుటకుఁగా
ను తనవగు దిక్కుమాలిన నోరుమాలిన రాణినా ? ఆహా ! రాణి.
ఇదివఱకు నాయింటిమర్యాదకు నీయింటిమర్యాదకు గట్టుపడియుంటి
నీతికిఁ జచ్చిపడియుంటిని. నిర్భాగ్యురాలని లోకముచే ననిపించుకొ
ంటిని. చేతవాతఁగాని దెలివితేటలు లేని పేడబొమ్మ యనిపించుకొంటి
ఈగుసిసి వేసేటు తార్పుడు కానివలనఁ గూడ "పెయ్యమ్మ" యనిపిం
కొంటిని. సిన్నల్లరిచేయుట కిష్టము కాక—నీమాట కడుగుదాటవ
దని మాయమ్మ బోధించినసీతిని మీఱుటకు సాహసము లేక—
ఏమీ ! ఇప్పటు రాణినా ? కాగితపుబీట్ల రాణియో కత్తిరివేటులరా
ణియో చూచెదవుగాక !

సుంద—పేకలో నల్వురు రాజులకు నల్వురు రాణు లున్నా
ఒకని కిద్దఱురాణు లేరి ?

సేతు—పేకలో నేమి? లోకములో నేమి ? ఒక్క రాజునకు రాణీబ
హుత్వము లేకపోవుట మొదలో వము ? ఆరంభుపోవకు. అది వానియ

అశక్తత — అపౌరుషము — ఏమీ? తన కాలికి సంకెలయా? చేతికి సంకెలయా? చిత్తవృత్తికి సంకెలయా? ఇక మనుజబుద్ధి కుపయోగ మేమున్నది? రసమున కుద్దీపన మేమున్నది? రుచికి వివిధత్వ మేమున్నది? మనసునకు స్వాతంత్ర్య మేమున్నది? బ్రదుకునకు సార్థకత యెక్కడిది? చచ్చినదాఁక నొక్క మొగమే కన్నులు లొట్టపడి పోవునట్లు చూచుటా? చేతులకు స్పర్శము చచ్చిపోవునట్లు పట్టిన చేత నే పట్టుటా? ఇఁకఁ జేతినిండ బనియేదీ? ఉన్న నరములకుత్సాహ మేది? వేలు వేలు దృష్టుల కవకాశ మేది? మనస్సునకుఁ దీఁగయల్లికవంటి కల్పన యేది? అన్నియు నటుంచుము. కాలము గడచు వెఱ వేది? ఒక గోడమీఁది బొమ్మ మఱియొక గోడమీఁది బొమ్మను జూచినట్లే. అంతటితో నంతఃపుర సౌఖ్యము నాశ్వాసాంతమే. అట్లుంటకంటె నదియు లేకుండనుండ రాదా? తినవల వచ్చినప్పుడు చేయి యెత్తుమాత్ర మెందులకు? ఓ! ముప్పదిరెండు కూరలతో, నలువదినాలుగు పచ్చడులతో, నూటపదునాలుగు పులుసులతో దినదినచిత్రవిచిత్రాతివిచిత్ర రుచులతో విందారగింపవలయును. అంతే కాని యుభయభ్రష్టత్వపు టొంగిలింఘనము లెందులకు?

మా — మా బాబు లక్షణము చదువుకొనలేదు కాని కాళిదాసునికంటె గండ్రైన కవియైయుండును. ఆతఁడు మేఘసందేశ మొనర్చి లోకఖ్యాతి నొందెగాని మా బాబు మాఘసందేశము నొనర్చి త్రిలోకఖ్యాతి నందియుండును. ఏమి బాబూ!

సేతు — కవిత్వము లోకఖ్యాతికొక సాధనమని యనుకొను నిర్భాగ్యుఁడవు నీ వెక్కడ నున్నావా? ఓరి బుద్ధిహీనుఁడా! కవిత్వము వలన నిదివఱకు లోకమునకుఁ గలిగిన మేలేమి? వాల్మీకి భారతము వ్రాయకపోయిన యెడలఁ బ్రపంచమునకుఁ గలుగు నష్టమేమి? దశరథునకుఁ బదునాలుగువందల భార్యలుంటచేతఁ బదునెన్మిది కోటయేండ్లు పరిపా

లించుటకుఁ గారణమైనది. కృష్ణుఁడొక్క గీతపద్యమైనఁ జెప్పినాఁడా! ఆతఁడు ఖ్యాతికి మూలకారణమేదో యెఱుఁగుదు. అంతవెఱ్ఱిముండకొడుకై డెబ్బదిమూఁడువేల గోపికలను బెట్టుకోలేఁడు.

మా—మా బాబు కవిత్వతత్త్వవిచారమునఁ గ్రత. ఏమిబాబూ!

ఇందు—(అప) ఈచిక్కుమాలిన సంభాషణమున కంతమున్నదా? లేదా?

సుంద—(అప) ఇదిగో! (ప్రకా) రాజా! రసశాస్త్రమున మీమతమేదియో మాకుఁ దెలిసినది కాని, మీమతములో మేమేకీవించువారముగాము.

సేతు—మీకు మాకు నేతము పెట్టెక్కడో చెప్పు.

సుంద—రాజునకెల్లప్పుడు రాణియనునదొక్క [illegible]యే యుండవలెను. మీరుప్రతిపాదించిన బహుత్వము మాకసమ్మతము. ఈమె మీరువిధ్యుక్తముగా వివాహమాడునెడల నిద్దఱురాణులుందురు. అది పనికిరాదు. ఆమెయైననుండవలయు నీమెయైననుండవలయును.

ఇందు—(తనలో) సుందరి కష్టజీవనమో సుఖమరణమో తేలఁగల యంశము నడిగినది. గుండెలలో నగ్నిప్రవేశము పగులుటకు సిద్ధముగనున్నది.

సుంద—ఈమాత్రపు టంశమునకు మీరింతయాలోచించుచున్నారెందులకోయని మారాణి మీయనురాగమునందు విశ్వాస లేక తహతహపడుచున్నది.

సేతు—మనకాలోచన మింతమాత్రములేదు. ఆవేశప్రధానమగునంశ మాలోచనీయము కానేరదు. మొదటికిఁ హృదయబానిస కానేరదు. కారణబద్ధమది—కౌతుకబద్ధమిది. క్రొత్తయాకాయ వచ్చినప్పుడు ప్రాఁతదాని నెవఁడు మూర్కొనును? పచ్చ వాలుగ వచ్చినప్పుడుప్పుచేఁతు నెవఁడాదరించును?

ఇందు—(తనలో) హా ! భగవంతుఁడా !

సుంద—ప్రాఁత దాని నాదరింపక పోవుటయే కాదు. దానిని బూర్ణముగ విడిచిపెట్టవలయును.

సేతు—దానిపేరేయది. అంతపూర్వాచారపరాయణ నిర్భాగ్యులము కాము. కౌమారమువిడిచిపోయినప్పుడుకదా యౌవనము రావలసినది. అట్లు కాలవైఖరిననుసరింపలేని యప్రయోజకులముగాము.

స్మా—మాబాబు గొప్పవివాహసంస్కర్త. ఏమిబాబూ !

సుంద—(అప) అమ్మా ! కూలిపోవుచున్నావేమో నన్ను గట్టిగఁ బట్టుకొనుము.

ఇందు—(అప) తూలిపోవుటకు నేనేమి పిటికిదాననా ? అను కొనినంతయేవింటిని. ఆకస్మికోపద్రవమేదియు లేదే. ఇఁకవింధ్యాద్రివలె లువఁబడెదను. దావానలమంటుకొననీ—పిడుగులుపడనీ— చెక్కు చెదరుదునా ? ఇక్కడకు మంగళసూత్రవిచ్ఛిత్తియైనది. నేనికఁ రాణి నిగాను. ఆఁడుదానను గాను. నరజన్మనుగూడఁగాను. పూలదండ త్రాఁచుపామైనది. కంచిమేఁక శార్దూలియైనది. పంటికాటో, పంజా వేటో యింక నవశిష్టము. సుందరీ ! నీయనుజ్ఞలేకుండ నేను స్వతంత్రించి యేమియుఁ దొందరపడనని ప్రమాణము చేసియుంటిని? ఆముడి సడలుపుము.

సుంద—(అప) ఆముడి విడునది కాదు. అదివిశ్వాసహీనుఁడు వైచిన కల్యాణపుముడి కాదు. విశ్వాసినియగు దాసివైచిన వశ్యతంత్రపుముడి. నీవుతొందరపడుదువనియే నిన్నట్లుబిగింపవలసివచ్చెను. పగ మన ముఖ్యోద్దేశము కాదు. తంత్రము ఫలము చెందనప్పుడది యుండనే యున్నది.

సేతు—సుందరీ ! మీరాణి కింక సందేహమేమి ?

సుంద—మీరనఁ దగినమాట— యామె వినఁదగినమాట మీ నోటివెంటఁ గంఠోక్తిగ రాలేదని.

సేతు—చుక్క పొడచుట యేమి? రాత్రియంతమగుటేమి! క్రొత్తరాణికౌఁగిలింత లేమి! ప్రాఁతరాణి యప్పగింత లేమి? ఇఁక సరేనా? కాని రేపో యెల్లుండియో కాని వివాహము జరుగదుగదా యీలోపల నీవు నాయొద్దనుండి యీశపథము తీసికొనవచ్చునా?

సుంద—మాయేర్పాటు జరుగకున్నయెడల మాప్రాణములు మీకిచ్చెదము. మీరేతీసికొందురు. మీశపథము జరుగకున్నయెడల మీరు మాకేమియిచ్చెదరు?

సేతు—ఓ! రాజ్యమునే యిచ్చెదము.

సుంద—మీరు బలవంతులు. ఈమె మీయధీనమైయున్న మీయేర్పాటుజరుపుటకు మాకిష్టము కాకున్నయెడల మీరు జరిగించుకొనఁగలరు; మీశపథమును గూర్చి యేగట్టిచిక్కు... మిమ్ముఁ గనము క యిట్లుచెప్పుచుంటిమని యనుకొనవలదు. మీశపథమునకు ప్రత్యస్త్రాంతరముగ మీరు మాకేమైన నొసఁగుఁడు.

సేతు—ఏమి కావలయును?

సుంద—మీశపథము తీర్చుకొనకున్న రాజ్యమిచ్చెదనని మీరు బాసచేసితిరి కావున నెటుపోయి యెటువచ్చినను శపథమును గూర్చియైన మీకు జ్ఞప్తితెచ్చుటకేమైన మాకుండవలయును గా రాజచిహ్నమగు ముద్రాంగుళీయకమీమె కోరుచున్నది.

సేతు—అభ్యంతరమేమి? ఇదిగో!—కాని—యొక్క ముద్ద—

సుంద—ఆప్రశంసయిప్పుడువలదు.

మా—ముద్దున కొక్క రాజ్యము—ముగ్గున కొక్క రాజ్యము మాబాబు కలియుగకర్ణావతారము! ఏమిబాబూ!

సేతు—హా హా హా! వివాహమైనతరువాతనే మనకు సంపూర్ణమైన సాపాటా? సరే.

సుంద—ఉంగరమిచ్చెదరా?

సేతు—ఇదిగో! (ఇచ్చును.)

సుంద—(ఇందుమతి కిచ్చును) అయ్యా! మాకింక సెలవా?

సేతు—మాశృంగారరసమునకుఁ బొంగే కాని శాంతి లేక పోయినది. నాలుగుచూరు లంటించినారు. ఆర్పకుండ నడచుచున్నారు.

సుంద—శాంతికాల మాసన్నమైనది. తొందరయేల? అయ్యా! మా రాణి మీయొద్ద సెలవు తీసికొందునని చెప్పుచున్నది.

సేతు—సరే. ఓరీ ఘా ఘూ! దారిఁజూపుము.

మా—చిత్తము బాబూ! ఇటు—ఇటు—

(ఇరువురునిష్క్రమింతురు.)

ఇందు—వారు పోయినట్లేకదా!

సుంద—ఆ.

ఇందు—ఈ సుద్రయుంగరము మన కేల? తేపుకాని మెల్లుండి కాని వివాహమును నిశ్చయపఱచితిమి. ఏమిచేయఁదలఁచితివో నా కేమియు బోధపడదు. నామనము మండిపోవుచున్నది. కసిదీరునట్లేమి యేని జేయునలయును. కాని యిక్కడఁజేయునదేమున్నది!

సుంద—ఏమియు లేదు. అంతఃపురమునకుఁ బోవలయును.

ఇందు—అచ్చటి కేల?

సుంద—నీభర్తయటకు నిన్నుఁజూచి మాటలాడవచ్చునేమో?

ఇందు—నాకింక భర్తయేఁడీ?

సుంద—అట్లన రాదు. వేగమురమ్ము.

ఇందు—ఏల?

సుంద—తేపురాత్రి మనమిద్దఱము చేయఁదగినపని విశేషము గానున్నది. యోజించిపంచుకొందము రమ్ము.

ఇందు—నీవు నీబసకుఁబోవా ?

సుంద—ఇప్పు డర్ధరాత్రమునఁ గోటలో నన్నుఁ జూచువా రెవ్వరు ? కాని, తేపురాత్రిమాత్రము మనము క్రొత్తరాణియింటికిఁ బోవలయును. మఱికొన్ని సంగతు లీలోపల జరుగవలసియున్నవి.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

ఇది తృతీయాంకము.

శ్రీ

ముద్రిక.

చతుర్థాంకము.

ప్రదేశము—క్రొత్త రాణి యుంటిసందు.

ప్రవేశము—రాజువేషమున నిందుమతి—దాసి సుందరి.

సుంద—అమ్మా! ఇటు. ఇటు.

ఇందు—ఇంకనిటే. అటు దేహమునకు మనస్సునకుం గూడ వదలిపోయినది కాదా.

సుంద—ఎక్కడ వదలిపోవును? మఱింత బిగియుటకేవచ్చిన దనంగూడ నా?

ఇందు—ఔను—గొంతు.

సుంద—అంతవఱకు వచ్చునరి కెన్నిగొంతులు తెగవలయునో!

ఇందు—కానీ! తెగందలంచినవి మానునా? మర్యాద పోయినదికదా! రాజ్ఞీత్వము వదలినదికదా! స్త్రీత్వము నశించినదికదా?

సుంద—దానిని మించిన పురుషత్వము వచ్చినది. దానిలో శ్రేష్ఠమగు రాజత్వము వచ్చినదికదా! విచారమేల?

ఇందు—విచారమేవ తెకు? సంకోచమేవ తెకు? అంటుకొన్న యగ్నిఁ యవిచ్ఛిన్నముగ మండనీ! రాష్ట్రము దగ్ధముకానీ! తల్లిదండ్రులచే మగనికొఱకు విడువఁబడితిని. మగండనువానిచే మఱియొక దానికొఱకు విడువఁబడితిని. ఇంక నే నెవ్వరిదానను? ఎవ్వరికిని నేను లేను. నాకున్న దొక్క పగ. అది తీర్చుకొని—

సుంద — అమ్మా ! మీరింత మహోద్రేకమున నుండినయెడల దాంపత్య మెట్లుకొనసాగును? కొంచెము శాంతించి కార్య మాలోచింప వలయును.

ఇందు — వెఱ్ఱివానా ! నిందు దేవుఁ ప్రసహుఁ దూటుపడినది. నీ రాఁపుట నీతరమగునా ? కార్య మెట్లుకొనసాగునంటివి ? ఆతఁడు నన్ను విడువనే విడిచినాఁడు. ఇఁక సాగవలసిన దేమున్నది ?

సుంద — ఆసంగతి నీతోఁ బ్రత్యక్షముగాఁ జెప్పలేదు కాదా ! ఈలోపల నాతనికి బుద్ధివచ్చినయెడలఁ గ్రొత్తరాణి నే విడుచునేమో ?

ఇందు — ఏఁ ? ప్రత్యక్షముగ నాతోఁ జెప్ప లేదా ?

సుంద — అదేమిమాట ? నీవని యెఱిఁగి చెప్పినాఁడా యేమి ? పైయాట తొలఁగిన మగముండకొడుకులలో వెలయాలి మోహములో నిక్షేపమును, ఇల్లాలి మోహములో నిప్పుస్పర్శమును జూడ లేనివాఁ డెవ్వఁడు ? పొల్లుకవిత్వపుటిచ్చకములతోఁ బ్రేమగీతములు పాడలేనివాఁ డెవ్వఁడు ? గుడిసెసభలోఁ గోళ్ళగుంపలవంటి మంచపీఠమున స్వభార్యాసంగపరిత్యాగోపన్యాసములు పంచాననస్ఫురణముగ నుపన్యసింపలేనివాఁ డెవ్వఁడు ? ఇవి యున్నయుఁ గర్ణాకర్ణిగ విని, సంసారిణులు భర్తలపైఁ బగ తీర్చుకొనుచోడల, మగవాండ్రలో రూపాయకు మూఁడు పావులాలవంతి నీసరికి పరవుపడించియే యుండును.

ఇందు — అందుకొఱకే నాకీసాము మెలికలదారి వలదంటిని. ఈమాటు కాపులు పనికిరావంటిని.

సుంద — వీనిలోఁ దప్పేమియు లేదు కాని, యిప్పుడా వేశము తెచ్చుకొనుటమాత్రము తప్పు. అట్లు మీరాచరించుచున్నారు. అందువలన నామనసు సూడఁ జెదరుచున్నది. మంచాలోచనము తోఁప కుండ నున్నది.

ఇందు—నీవన్యథా యెంచవలదు. నీవు చెప్పినట్లు విందునని నే నొప్పుకొంటిని. రెండుమాటలదానను గాను కాని నీకున్న శాంతి నాకు రమ్మన్న రాదు. నే నిప్పుడంత తొందరపడినదియు లేదనుకొందును. ఐనను నీవు చెప్పినట్లేమాత్రమైన తొందరకూడ నింకముందుఁ బడకుండ నుండెదను. ముందు జరుగవలసిన దేదియో కానిమ్ము.

సుంద—జరుపవలసినదంతయు మీరే. ఈనాటకమునఁ బ్రధానపాత్రము మీరే కారా?

ఇందు—కాని సూత్రధారోద్యోగము నీయందు నిలిచియున్నది కాదా?

సుంద—అది నిజమే. ఇంతవఱకు మనమనుకొనిన మాటలనే నీవామెను బ్రమాదములేకుండ నడుగవలయును.

ఇందు—తప్పనప్పుడు మొదలందించుటకు నీవు సిద్ధముగనే యుందువు కాదా? ఇంక సందేహమేమి?

సుంద—అటులైన రమ్ము ఇటు. ఇటు. మిగులఁ జీకటిగా నున్నది.

ఇందు—మూషకు. రాజుగారి కాయుత్తర మందఁజేసితివి కాదా?

సుంద—మూషకున కిచ్చి రాజుగారికిఁ బంపితినని నీకిదివఱకే చెప్పియుండలేదా?

ఇందు—నా మనస్సునందు మిక్కిలి భ్రమించు చక్రమునందు వలె నేఁటనైచిన నది తూలి పడిపోవుచున్నది. రాజుగారీసరికి సంకేతస్థలికి వచ్చియుందురా?

సుంద—వచ్చుటయు నైనది. అతఁడున్నగదికి బీగము వేయుటయు నైనది.

ఇందు—ఇంతవఱకు రవంత మంచిపనియే జరిగినది. కల్యాణావేశము కారాగృహప్రవేశములోనికిఁ బరిణమించినదా. కానీ!

సుంత—ఆతఁడట్లు బద్ధుఁడై యుండనియెడల మనమీతని నెట్లు చూచి మాటాడఁ వచ్చును? అందుకొఱకు కాపనియే దీనికంటె ముందు చేయవలసి వచ్చెను.

(నేపథ్యమున)

ఎవరా మాటలాడువారు?

సుంద—ద్వారరక్షకా! చప్పునఁ దలుపు దెఱువుము.

(నేపథ్యమున) వీలులేదు పో.

సుంద—నీగొంతుగోయ! రాజుగారు వచ్చినారురా!

(తెరయెత్తఁగఁ గొత్త రాణి ముంగిలిద్వారరక్షకుఁ డగపడును.)

సుంద—అన్నిద్వారములు బాగుగ రక్షింపఁబడుచున్నవా

ద్వార—దండము దండము బాబూ! క్షమింపవలెను. గు లేకపోయినది. ఈఁగకైన నవకాశమీయకుండఁ గాచుచున్నాము.

సుంద—ద్వారరక్షకా! నీవు ముందు నడచుచు బాబుగారి దారి చూపుము.

ద్వార—చిత్తము బాబూ! దయచేయుఁడు; లేరా! రా గారు దయచేసినారురా! నీసిగఁగోయ! బాబూ! ఇటు ఇటు. ద్వారము దాఁటి మేము లోపలికిరా వీలులేదు బాబూ!

సుంద—సరే! నీవు నీతావునకుఁ బొమ్ము.

(ద్వారరక్షకుఁడు నిష్క్రమించును

ఇందు—సుందరీ! ఈయింటిలో దాసి యెవతెయో యెఱుగుదువా?

సుంద—ద్వారరక్షకుఁడు చెప్పినమాట యసత్యము కాద పైగాలి లోనికి లోనిగాలి పైకిఁ బోకుండునట్టి నిర్బంధమిట జరుగు

చున్నది. దాసి యున్నదో లేదో. ఉండక తప్పదు లెండు. అదియెట్టి స్వభావము గలదియో యేమియుఁ దెలియుట కవకాశము లేదు. ఇదిగో తలుపు వైచియున్నది. ఈ యుతక యెత్తెద (అట్లు చేసి) అమ్మా! లోనికి రమ్మ.

(లోపలి తెర యెత్తగ నొక పెద్దగదియు దానిలో నొక యరయు గనఁబడును.)

మహారాజచంద్రమా! మీరీపీఠముపైఁ గూరుచుండుఁడు.

(రాణి కూరుచుండును.)

(అప) అమ్మా! అదిగో యొకదాసి అటచాఁపపైఁ బండుకొని నిద్రించుచున్నది. దాసి లేపనా ?

ఇందు — ఆవ్యక్తి దాసియేనా ?

సుంద — (చూచి) అమ్మా ఇది దాసియే ఇదిగో! కొంచెము మోటుపనులచేత నరచేతులలోఁ జిప్పకాయలు కాచియున్నవి. ఇవిగో గోళ్లు కొంచెము అరిగినవి. అరకాళ్లుకూడఁ గొంచెము గరుసు దేరియున్నవి— కన్నెత్తికప్పుఁ బెండ్లి కొడుకు కట్టించు తాళి యిదిగో! అదిగాక వైఖరిచూడఁగఁ బిల్లలతల్లి వలెఁ గనుపట్టుచున్నది. అక్కా! అక్కా! పలుకవేల? చాపలే కుకద!

ఇందు — అట్లుగుఱ్ఱుతీయుచుండగనే.

సుంద — చూచితివా? ఒడలిపైఁ బైఁటయైన నెఱుఁగకుండ నెట్లు నిద్రించుచున్నదో.

ఇందు — పాపము. కొంచెము సవరింపుము.

సుంద — (అట్లు చేయుచు) అంతఃపురరక్షకై యిట్టిదాసులుండిన విన్నియోగమేమున్నది? ఒడలిగుడ్డయైన నెఱుఁగకుండ నిద్రించు

చున్నది. నేనన(గూడను కాని యొక్కమాయింట(బుట్టినది ఈ రెండవది దాసివృత్తి కర్పూరాలు కాదు.

ఇందు—విశ్వాసమనునది తనువులో(బుట్టవలయును గా తలయెత్తు వరాలు దిమ్మరించినను(గలుగునా?

సుంద—నా తెక్కలు చల్లగానున్న యెడల నేను లోక మీద(బడి నెత్తి వాయ(గొట్టి యిల్లునించుకొనవలయునుగాని మీరిచ్చిన నాకెంత? ఈయకపోయిన నాకెంత? అదిగాక యింతవు దాసుల జీతాలసౌభాగ్యమెవరెఱుగనిది? కాని, కావలసినంత స్వతంత్రత, కావలసినంత రాబడికల కల్పవృక్షమువంటివృత్తి నిట్టిదౌర్భాగ్యులుచేరి ధ్వస్తముచేసినారు. లే! పెద్దమ్మ లే. (చేయిపట్టిలాగును

సంపంగి—(ఒడలు విఱుచుకొనుచు) డొంకిపట్టిపట్టి లాగినప్పుడే రాలినది. (సంపంగి లేచును.)

ఇందు—(పలవరించుచున్నది.)

సుంద—ఈలాగున(గొప్పపట్టి యీడ్చినప్పుడే లేవవలసిన (లాగును.)

సంపంగి—(లేచును.)

సుంద—మహారాజుగారు! లేచి నిలువ(బడు.

సంప—(నిలువ(బడి) అమ్మయ్యో! (పాఱిపోవును)

సుంద—(సంపంగి నోరుమూసి రాణికత్తిని జూపించును.)

సంప—(గడగడ వడ(కుచు) అమ్మా! అమ్మా! (నమస్క—చును.)

సుంద—నిన్ను(గాని నీరాణినిగాని బాధించుటకువీరు రాలే నీవలన(గొన్ని సంగతులు తెలియవలసియున్నవి.

ఇందు—సుందరీ! దీనివలన(దెలియవలసిన యంశములేమున్నవి?

సుంద—(అప) ఈ క్రొత్తరాణిని రాజెక్కడ గ్రహించెనో, యెట్లు గ్రహించెనో, వీరి దేయూరో, వారచ్చటి కేలవచ్చిరో యీ మొదలగు సంగతులు మనకుఁ దెలియవు. మాఘుఁడాస సమయమున రాజుతో లేకపోవుటవలన నాతనికిఁ దెలియవు. ఈయంశము లామె నడిగినట్లుకాకుండఁ దెలిసికొనవలయును.

ఇందు—(అప) ఆసంగతు లిప్పుడు మనకంత యావశ్యకములా ?

సుంద—(అప) మీరు క్రొత్తరాణితో మాటలాడునప్పుడు మాటలధోరణిలోఁ బూర్వాంశములకు విరుద్ధముగ నేమైన మీరు పలుకునెడల మీరు రాజుగారు కారని యామె గ్రహింపవచ్చును.

ఇందు—సరే. అడుగుము.

సుంద—నీపే రేది ?

సంప—తేపా ? తేపేమో నాకెట్లు తెలియును ? ఈరాత్రి బ్రదుకు నిజమైనయెడల తేపటిమాట చూచుకొనవచ్చును. అమ్మా ! బాబూ ! రక్షింపుఁడు.

సుంద—తేపుకాదు. నీపేరు ? (ఒడలిమీఁద బ్రేలితోఁ బొడుచును.)

సంప—మిరియాలపేరు. ఇది మాముసలమ్మగారి కష్టార్జితము. మాసంపాదన లిప్పుడు సంతఖర్చునకైన సరిపోకుండనున్నవి. అమ్మా ! అమ్మా ! ఇది పోయినయెడల మాకు మఱేమియు లేదు. రక్షించు. రక్షించు.

ఇందు—చెవిటిముండ కాఁబోలు !

సుంద—నీకుఁ జెవుడాయేమి ? (చెవులు చూపించును.)

సంప—ఈముద్దులు తీర్థాని కెరువు తెచ్చుకొంటినమ్మా ! ఏది ఎక్కడనుండి యీదిక్కుమాలిన యమ్మాళ్ళఁబడితిమి.

సుంద—అమ్మా! వింటిరా! వీరేదో తీర్థయాత్రకు బయలు దేరఁగ మనరాజుగారు తెచ్చినారని తెలియుచున్నది.

ఇందు—సరే.

సుంద—మీరేయూరనుండి వచ్చినారు?

సంప—ఏకూరలు వండించుకొన్నారమా? వండించుకొనుట యెక్కడిది? మామేనమామ నిక్షేపములాగున వంటచేయుననని నీ మహారాజుగారు కడ తేర్చినారు కాదా? అతఁడే మా రాణీగారిని బెంచినాఁడు. అప్పటినుండియు నాకు యన్నముతినుటయే మానివైనది. మంచితీర్థమునుమాత్రము త్రాగుచును. ఇంక నాకెక్కడకుఁ గూరలెందులకు? ఏదో! మనస్సుతిన్నఁగ లేనప్పుడు—ఇఁక దినవెతప్పదుకదా యని—

సుంద—ఉస్సు! ఉరకుండుము. ఊరకుండుము.

సంప—కూరవంటమాటయేనా? రొట్టెపప్పుచేరు—మామిడి కాయపచ్చడి.

సుంద—ఊరకుండవేమి? నీవు ముండమోయు!

సంప—కూరకుండయేది యనియడిగెదవా? అమ్మయ్యో— దానిలో నేమియు మిగులలేదు.

ఇందు—వట్టి చెవిటిది.

సుంద—అక్కడక్కడఁ గొంచెము వినఁబడుచునేయున్న నేను నిమ్మళముగ పలుగుచున్నాను గావునఁ బూర్తిగ వినఁబడకున్నదేమో?

ఇందు—నిమ్మళముగ మాటలాడుచున్నావు కావున నీ పెదవుల కదలికనుబట్టియు సంజ్ఞలనుబట్టియు నీమాత్రమైన గ్రహించు చున్నది. గట్టిగనడుగు నెడలఁ జెవిపోర యదరుటచే మఱింత వినఁకుండును.

సుంద—ఐనను నా వెఱ్ఱి తీర్చుకొందును. (గట్టిగ) మీరాణి యేది?

సంప—ఏమి? ఏమి?

సుంద—మీరాణి?

సంప—గంటలా? మాకేమిగడియారమా? మన్నా?

(నేపథ్యమున) నన్నడుగువారెవ్వరు?

సుంద—అమ్మా! మీదాసురాలను. ఇటులొక్క సారి నిద్రాభంగమునకోర్చి దయచేయుడు.

(మానవతి ప్రవేశించును)

మాన—నన్నుఁ గూర్చి యడిగినవారెవ్వరు?

సంప—అమ్మా! అమ్మా! ఎవ్వరోవచ్చినారు.

సుంద—అమ్మా! నేనే. ఇట్లు దయచేయుఁడు. (తనలో) తిరుగ లోనికిఁబోకుండ నీమె వచ్చిన ద్వారపుఁదలుపునకుఁ దాళము వైచెదను.

(అట్లు చేయును)

మాన—(రాజవేషమునను న్న యిందుమతినిజూచి యదరిపడి సుందరితో) లే. దారిలో లే. (వెళ్లిపోవుచు) ఆతలుపు వైచెదవేమి?

సుంద—అమ్మా! తొందరయేల? కోపపడకుము. అదిగో! మహారాజుగారు. ఆయనను బ్రసన్నదృష్టిని జూచి యీరాజ్యము మమ్ము నాతని నేలుకొనుము.

సంప—(అప) అమ్మా! రవంత సేపు మిరియాల పేరని, రవంత సేపు కూరకుండయని పలుకుచున్నారు.

మాన—(సంపఁగిచాటునకుఁబోయి మేలుముసుఁగు వైచుకొని నిలువఁబడును.)

(తనలో) ఎట్టిగతి పట్టినది! హా భగవానుఁడా! నేనేమి పాపము చేసితినని నన్నిట్టి కష్టములఁ బెట్టుచున్నావు! నీదయతక్క

నన్యమును నేదియు నపేక్షింపలేదని యెఱుఁగవా? అట్టిచో దయ చూపక పోవుట సరికదా మిమ్ము మిక్కిలి బాధపెట్టుచుంటివి కానీ! నీయిష్టము! నీవిచ్చు బాధకూడ మహాప్రసాదముగనే భావింతును.

సుంద—(అప) అమ్మా! ఊరకుందువేల? [illegible]రవ తెచ్చుకొని రాజపాత్రము నభినయింపుము. కొత్తరాణిని జూచితివా? ఎంత తేజస్సంపన్నయై యున్నదో?

ఇందు—(అప) సుందరీ! నీవధిక్షేపించుచుంటివేమో కాని నాకంటికామె బంగారుబొమ్మవలెఁ గానఁబడుచున్నది. ఈ మోమును చూడఁగనే నాకేమో విశ్వాసభాజనముగనున్నదిసుమా!

సుంద—(అప) భర్తృపాత్రమవు కావున నీకట్టులే కనఁబడవలసినదే. కానీ, యాలసింపకు.

ఇందు—కాంతాలలామా! ఓసుందరీతిలకమా! (కొత్తరాణిని గాంచెను సమీపించును)

సంప—అమ్మా! ఈ రాజుగారు నన్నుఁ బిలుచుచు నాకౌఁగిలికిఁ గాఁ జేతులు దగ్గఱగ వచ్చుచున్నట్లున్నారు.

సుంద—(తనలో) నీమొగమీడ్వ! దూరదేశుల సాహసములో కాని నీదొడ్డికాళ్లబ్రదుకునకు దొరగారు కూడనా?

ఇందు—ఓవనితారత్నమా! నీవు నాతో మాటలాడకుండ నున్నావు. నీకుఁ గోపము రాఁదగినపనియే నేను జేసియుంటిని. క్షమింపవలయును.

సుంద—అమ్మా! దయయుంచి మా రాజుగారితో మాటలాడవలయును. ఇక్కడ నాయన యొక్కఁడు తక్క మిగులువారందఱు స్త్రీలేకదా! అందులో మేమిద్దఱము దాసులమే. అందుచే నా మాత్రము నరమర యుండవలసిన పారమే కాదు. ఇంక సందేహమేల

మాన—అట్లయిన నీపేరేమి?

చతుర్థాంకము.

సుంద — సుందరి.

మాన — సుందరీ ! నీతో మాటలాడను. నేను మీ రాణీ గారితో మాటలాడను. ఈశేఁడు మాయెడల మహాపకారము చేసినాఁడు. ప్రజల మానప్రాణములు రక్షింపఁగలసిన ప్రభుఁడే యిట్లు ప్రజాపకారము చేసినయెడలఁ బ్రజలు బ్రదుకుదురా ? ఉపాధ్యాయుఁడే శిష్యులకు దుర్నీతిని గఱపునెడలఁ బల్లెకూటమిఁక గల్లుపాకయే కాదా ? గొల్లఁడే గొఱ్ఱెలను హింసింపఁజొచ్చినచో మందస్థితియిఁక మాంసపుదుకాణమే కాదా ?

ఇంద — గతించినదానికి వగచిన వినియోగము లేదు. ఇదివఱకు నావలన జరిగిన యపకారమును మించిన యుపకారమును నేను జేయ సంకల్పించుకొనియుంటిని. విధ్యుక్తముగాఁ బెండ్లాడి యీదేశమునకు నిన్ను రాజ్ఞిగాఁ జేసెదను.

మాన — సుందరీ ! నాకు రాజ్ఞీత్వ మక్కఱలేదు. భాగ్యభోగ్యము లపేక్షించుదానను గానని నిశ్చయముగా నమ్మవలయును.

ఇంద — నీవిట నాకు స్వాధీనవైయున్నావు. నీవు నన్నుఁ దప్పించుకొని పోఁజాలవు. లేనిపోని బింకపుమాటలతోఁ బ్రయోజనము లేదు నన్నంగీకరించి సుఖపడుము.

సుంద — (అప) అమ్మా! జీలుగుబెండు లాగున వట్టి చప్పని నిస్సారమైన మాటలాడుచున్నావు. మనమాలోచించుకొనిన రసవంతమైన పూర్వప్రణాళిక మొదటినుండియుఁ దప్పఁ గొట్టితివేమి ?

ఇంద — (అప) నాకింతకంటె రసవంతములైన మాటలు రావు. నన్నేమి చేయుమంటివి ? మొదట నాకు సుగతనము లేదయ్యెను. రాజ్ఞికి నాపై వలపు లేదయ్యెను. రాజును దలఁచుకొనఁ గడుపు దహించుకొనిపోవుచున్నదయ్యెను. ఇఁక నాహృదయములో రస మె

చ్చటనుండి వచ్చును? మాటలలో సారమెక్కడనుండి వచ్చును.
ఇదేదో చప్పునఁ దెలిసికొనలేను. (ప్రకాశముగా) రాజ్ఞీమణీ!
నీపేరేది?

మాన—సుందరీ! మొదలే పెద్దపేరు లేదు. ఉన్న దేదో నా
మూలమున మాసిపోయినది. ఇఁక నట్టిప్రశ్నము వలదు.

ఇందు—పోనీ! నీతలిదండ్రు లెవ్వరో యదియైనఁ జెప్పుదువా?

మాన—సుందరీ! క్షత్రియకాంతనైన నేను—పరరాజుచే హ
రింపఁబడి—పరదేశమున బందెలో నుంపఁబడి—బానిసవలెఁ బరరాజుచే
బహిరంగముగఁ జూడఁబడి—పరిణయమునకై వాంఛింపఁబడి—యధమా
ధమనై యుంకను బ్రతికియున్న నేను—పరమపవిత్రులు, శైవసములు
నైన తల్లిదండ్రుల నామము కులందలి తేజోమయాక్షరముల నుచ్చరించు
టకంటె మహాపాతకమున్నదా? అంతకంటె రాజహత్య మంచిది కాదా?

ఇందు—ఆ? ఏమి? రాజహత్యయే మంచిదనుచుంటివా?

మాన—సుందరీ! కాదా మఱి? ఇదివఱకే యది జరిగియుం
డిన యెడల నెన్ని ప్రాణులు సుఖించునో?

ఇందు—సరే. వధమెంత నీవు? నీవు నన్నంగీకరింపని యెడ
నాలాగుననే కావచ్చును.

సుంద—(అప) ఉక్తిప్రత్యుక్తిసందర్భమెంతుంగని వాఁడు నాట
కమును వ్రాయునట్లు లేదో. పట్టుగా—తెచ్చిపెట్టినట్లుగా గ్రంథము
నడిపించుచున్నావు.

మాన—సుందరీ! ఎటులు? వధమెంతనేవా? నన్నంగీకరింప
యెడల నటులే కావచ్చునా! సెబాస్! నీయేలిక యింతనేరుపరికి మ
వాఁడు మాటలాడినట్లు మాటలాడినాఁడు.

ఇందు—(అప) సుందరీ! ఈకాంత నాయసమర్థను గ్రహింప
నదా యేమి?

సుంద——(అప) వీటునీ ప్రయోజకత్వము నొక్క- తెప్పపాటు లో దాసి కనిపట్టఁగలదా. ప్రభునిసామర్థ్య మొక్క-మాటలో బంటు కనిపట్టఁగలఁడు. పెండ్లికొడుకు తెల్లమొగము పెండ్లికూఁతురు కనిపట్ట లేకపోవుట యేమి ?

ఇందు——(అప) నే నాఁడుదానవని కూడ గ్రహింపలేదుకదా?

సుంద——(అప) అది యొక్క-టే తరువాయి.

ఇందు——(అప) నేను దిన్నఁగమాటలాడలేనని యీరాజువేసము నిన్ను వేయుమంటిని.

సుంద——(అప) చాలు-అనుగనక్క అలేదు-మీయంతరమేమి? నాయంతరమేమి? నేను రాజువేసము వేసి మిమ్ము నాయొద్ద దాసిగాఁ గూడఁ జేయవలయునా ?

మాన——సుందరీ ! ఊరకుండుటయేల ? అంగీకరింపనియెడల వధమే కావచ్చునని మీరాజు పలికినాఁడు. 'అంగీకరింపనియెడల' నను మాటయేల ? అంగీకరింపలేదు. అంగీకరింపను. వధమున కింక నవ శిష్టమేమున్నది? ఏడుదినములనుండి కాంబోలు నుపవాసము చేయు చున్నాను. ప్రాణము పోకుండనున్నది. వేగఁదెమలుపుమని చెప్పుము.

సుంద——అమ్మా ! సుఖజీవనమున కవకాశమున్నప్పుడు ప్రాణ పరిత్యాగము చేయఁబూనుట తగునా ? ఈరాష్ట్రమున కంతకు మహా రాజ్ఞివై మారాజును, రాజ్యమును బ్రజలను బరిపాలించుచు నుండవల సినదాన విట్లాడుట తగునా?

మాన——సుందరీ ! నీవు దాసివనుసంగతి మఱచిపోయి తలకుఁ దగనిబోధనములు చేయుచున్నావు. తప్పు.

ఇందు——(అప) సుందరీ ! చూచితివా ? యీ కాంతయోగ్యత. ఇది భర్తను వివాహమాడుట కంగీకరించినయెడల దీని నేక్క-డికై

నఁ బంపి రాజున కింకఁ గనఁబడకుండఁ జేయవలయునను కోరికతో రాజవేషమును ధరించివచ్చిన నాకీ యాశాభంగము మిగుల సంతోషకరముగా నున్నదిసుమా !

సుంద—(అప) అమ్మా ! ఏలాగుననో నీవు సంతోషముగా నుండుట కావలసినది.

మాన—సుందరీ ! ఎందులకీ సందేహమో కనుఁగొనుము. నడుమున వ్రేలాడు శాతకుక్షిత్రిఖఁ బిడికెడు గాంతుక తెగదని సందేహమా ? నాలాగునె తానుగూడ నాకు దయగనపడదే కదా సందేహ ముండఁదగినది !

ఇందు—(అప) సుందరీ ! ఈమె తిరస్కారము గూడ నాకలకారముగనున్నది. (ప్రకాశముగ) కాంతామణీ ! నిన్ను నేను జుట్టు లేకపోవునంతమాత్రమున నేను స్త్రీనని యనఁదగదు. చంపఁగలిగినంమాత్రమున నేను బురుషుఁడనని కూడ ననఁదగదు. నీయునిష్టతతో మనకు స్త్రీపురుషప్రసక్తి పోనేపోయినదికాదా ? నేను నిన్నుపేక్షిం నట్లే నీవు నన్నుపేక్షింతువని నిన్నుఁ దెచ్చితిని. నావలనఁ దప్పువచ్చిన నిన్ను నీయింటికి సగౌరవముగాఁ బంపుదును. నీయూరేదో, తల్లిదండ్రులెవరో, నాకుఁ దెలుపవక్కఱలేదు. నేనిచ్చు పరివారమును దీకొని నీవు నీయింటికి యథేష్టముగా నిప్పుడే పోవచ్చును.

మాన—సుందరీ! నేను బోవునది మింటికిఁగాని యింటికిఁగాదు లక్ష్మీదేవి మ్రొక్కుచెల్లించుకొనిననే నీసరి కిల్లుచేరి కొన్నిదినములుండవలసినది. "అమ్మా ! యిన్నిదినము లాలసించితివేల" . యనడుగు మాతల్లిదండ్రులతో నేనేమిచెప్పవలసినది ? నన్నొ వరింపనొకఁడపహరించుకొనిపోయినాఁడని చెప్పవలసినదా ? నాలుకఁ గోసికొందునుగాని నేనట్లు చెప్పుదునా ? 'అమా ! నిన్నుఁ బెంచిన వా

భృత్యుఁడే' డని యడుగ నన్నుపేక్షించినమిండనిచేఁ జచ్చెనని బ్రదికి యున్న నేను జెప్పవలసినదా ? సకారణముగనో నిష్కారణముగనో మాతల్లిదండ్రులమనస్సులందు నన్నుఁగూర్చిన సందేహము కలుగు పిమ్మట నిఁక నిల్లెందులకు ?

ఇందు — ఇక్కడనుండిన యెడలమాత్రి మాసందేహము కలుగ కుండునా ?

మాన — ఇక్కడ నుండుట కాదు. (మింటివైపునఁజూచి) అక్క డ. అక్కడ.

ఇందు — అటులైన నిదివఱకే మరణింపలేకపోయితివా? నిన్నె వరభ్యంతర పెట్టియుండలేదే?

మాన — సుందరీ ! అప్రయత్నముతోనేకదా యున్నది? దర్భ శయ్యపై నాల్గుదినములనుండి ప్రాయోపవేశము చేసియుండఁగాఁ బ్రి ధానపుఁదంతుకైకదా మీరు వేంచేసిరి. కాని యీపద్ధతిగా ముప్పది దినములకుఁగాని మరణింతునని భయపడుచున్నాను. అగ్ని జలాయుధా దులవలన నాత్మహత్యచేసికొనుట నాకిష్టము కాదు. అందువలననే యీ రవంతపుణ్యము గట్టుకొమ్మని మిమ్ముఁ బ్రార్థింపవలసివచ్చినది.

ఇందు — వనితారత్నమా ! మఱియొక్కసారి ప్రార్థించుచున్నా ను. వినుము. ఈరాజ్యము నాకక్కఱలేదు అది నీది. నారాణిని నేను వదలుకొంటిని. నీవేనా —

మాన — (చెవులు మూసికొని) పాపము శాంతించునుగాక ! సుందరీ ! మీరాజును బొమ్మని చెప్పుము. భార్యను వదలుకొనినవాని మోమును జూడరాదు. (వెనుకకుఁదిరిగి కనులు మూసికొనును.)

ఇందు — (అప) సుందరీ ! ఆహా ! ఈమె యెంతటి కాంతయే. ఈమెయే నాభర్తకు భార్యయయియున్నదనిన సాతఁడెంత లోకకంట

కుండుగాకయుండునుగదా! కాని యిఁక మనము చేయవలసినదేది?

సుంద—(అప) ఈమె నిక్కడినుండి తీసికొనిపోయి మఱి యెక్కడనైనఁ దాఁపవలయును.

ఇందు—(అప) ఎందుచేత?

సుంద—(అప) రాజీమెను జూచుటయే సిద్ధించినచో నిట్టి యుత్తమక్షత్రియురాలిని హింసించును. అదిగాక ప్రసంగవశమున మనరహస్యము బయలైనఁ గాఁగలదు.

ఇందు—(అప) నేను నదియే యోజించుచున్నాను. కా యామెను మఱియొకయెడకుఁ దీసికొనిపోవుటెట్లు? ఈమె మనకు లొంగునా? నాకీమెను జూచినకొలఁది ననురాగమేమో కాని హెచ్చు గుచున్నది. ఈమెను బలాత్కరించి యెక్కడికైనఁ దీసికొనిపో నాకు మనసొప్పకున్నది. తనయంత తానీమె యెక్కడికిని బోనను న్నది. ఈస్త్రీహత్య మనకుఁ జుట్టుకొనునేమో? ఆకటా!—అక్కడ బద్ధుఁడైయున్నాఁడు. ఈమెయా—ఇక్కడఁ బ్రాయోపవిష్టయై యున్నది. మనమా—ఘోరారణ్యమధ్యమున దారితప్పినట్లున్నాము. సుందరీ! ఏ- యాచిక్కులు. ఇప్పుడీమె నేమిచేయవలసియున్నది?

సుంద—(అప) అమ్మా! అధైర్యపడఁదగునా? బుద్ధిస్తంభింపఁ దగిన సమయమేయిది. అయిననేమి? తొందరపడక నిదానింపవ యును. ముందామెకు మీయెడల సంపూర్ణవిశ్వాసముకలుగుమాటల గొన్ని యాడిన మంచిదనుకొందును.

ఇందు—(అప) అయ్యయ్యో! గుండె లదరిపోవుచున్న ఆహాహా! పరమాభిమానవంతురాలు! బంగారుబొమ్మ! ప్రాణప రిత్యాగము చేయునుగాఁబోలు! మనమిక్కడకు రాకయుండినయెడల క్షోభము లేకయుండునుగదా! విశ్వాసజనకములగు వాక్యము

నాషమంటివా? సరే. ఆతరువాయి కూడఁ దీర్చుకొందును. (ప్రకాశ) ఓ అభిమానవతీ! నన్ను క్షమింపుము. నీవు నాకక్క అలేదు. భగవంతుని పాదములపై: బ్రమాణముచేసి చెప్పుచున్నాను. నీవు నాకు సోదరివి. నీకు నావలన నెంతమాత్రము భయము లేదు. అమ్మా! బతిమాలు చున్నాను. ఈదయ్యాలకొంపలో నుండవలదు. నావెంటఁ గోటలోనికి రమ్ము. నిన్ను నారాణియంతఃపురమునను౦చెదను. ఆమె నిన్ను గౌర వించును. అనేకదాసీగణముచే నీకుపచారము చేయించును. నాభార్య నః నేను వదలుకొందునని యాడినతప్పునూటకిదిగో లెంపలు వైచుకొను చున్నాను. (లెంపలు వైచికొనును.)

సుంద—(అప) సెబాస్! నీభర్త నీయెదుట నిట్లు లెంపలుకొట్టు కొను మహోత్సవమును శీఘ్రముగఁ జూతువుగాక! అమ్మా! ఇప్పు డు కొంచెము బాగుగ నేమాటలాడినావు.

మాన—నాకెవ్వనియుపచారములు వలదు. నేనెక్కడికిని రాను. ప్రాణము విడుచుట కెక్కడనైననేమి? సుందరీ! మీరాజుపుణ్యమా యని బ్రదుకన్నివిధముల లంజెకైపోయినది.

ఇందు—(మానవతి కాళ్లపైఁబడి) అమ్మా! నావలన మహాప రాధము కలిగినది. నన్ను క్షమింపుము. నీపరిశుద్ధికెన్నఁటికి లోపము లేదు. మంచునలుపెక్కునా? అమృతము పులుసెక్కునా? సందే హింపకుము. తల్లీ! నన్నుఁగటాక్షింపుము.

సుంద—(తనలో) పాపముచేసినవాఁడు భర్త. ప్రాయశ్చిత్తము పొందునది భార్య. ప్రపంచచర్యయెట్లులున్నదో!

ఇంద—అమ్మా! నామాటవినుము. చప్పునఁగోటలోనికిఁ బోవుదము రమ్ము. (చేతులుపట్టుకొనును.)

మాన—ఆ! ఆ! ముట్టుకొనకుము.

ఇందు—తల్లీ! సందేహింపకుము. నీకు నేను సోదరుఁడను, "అన్నా!" యని నన్నుఁ బిలువుము. అక్కా—యని పిలచిననైన నేనన్యథా భావింపను. నీయోగ్యతవలననే నిట్టి నిష్ఠురమస్థితికిఁ దిగిపోయితిని. సందేహింపకుము. రమ్ము.

సుంద—అమ్మా! రమ్ము. ఎంతమాత్రమును సందేహింపకుము ఊఁ. ఊఁ.

మాన—అన్నా! నీవు నన్ను మోసము చేయుట కిట్లు చేయుచుంటివేమో నేను రాను.

ఇందు—(అప) రానను చున్నది. ఎట్లు?

సుంద—మహాప్రభూ! అంతసాహసమువలదు. వలదు. (మానవతితో) అమ్మా! నీవు రానియెడల మా రాజుగారిక్కడనే కత్తితో బొడిచికొని (అప) అమ్మా! కత్తిపైకిఁ దీసి కొంత కడబిడ చేయ యూరకుందువేమి?

ఇందు—(కత్తి తీసి) సుందరీ! నీమాటను నేను వినను. నీ వాగాణిని బతిమాలవలదు. ఆమె యెట్లులైనను రాదు. నేను జేసిన మహాపాపమునకుఁ బ్రాయశ్చిత్తముగాఁ బ్రాణములను విడుచుటకిదిగో సిద్ధము నున్నాను.

సుంద—అయ్యయ్యో! వలదు. బాబూ! వలదు వలదు. నన్నుముందు చంపి మీరన్యథా చేయుఁడు. అమ్మా! అమ్మా! రాజును రక్షింపుము. ఈ రాష్ట్రమును రక్షింపుము. బాబూ! తొందర పడవలదు. వలదు. (మానవతి కాళ్ళపైఁబడి) అమ్మా! రక్షింతువా

మాన—సరే! సుందరీ! లెమ్ము. నేనాతనిం బుపుఁ జెప్పుదును.

సుంద—అమ్మా! ఎందుకు?

మాన—నా వస్తువొకటి యటనున్నది. నేను దెచ్చుకొని వీలో వత్తును

సుంద— అదియేదో చెప్పినయెడల నేను మీవెంటనే తీసికొని వచ్చెదను. మీరు నడచుచుండుఁడు.

మాన— అట్లుకాదు. తలుపుతీయుము.

సుంద—(అప) అమ్మా! లోపలికిఁబోయి తలుపువైచికొనిన యెడల నింతప్రయత్నము వృథయైపోవునేమో ?

ఇందు— నీకింక నామెయెడల విశ్వాసము కలుగలేదేమో కాని నాకుఁ బూర్ణముగాఁ గలిగినది. తలుపుతీయుము. ఎంతమాత్రము ను సందేహింపకుము.

సుంద—(తలుపుతీయును)

మాన—(లోనికిఁబోయి తిరుగవచ్చి, తనలో) ఇదిగో! యాత్రలోఁ బ్రాణరక్షణార్థ మక్క అకువచ్చునని నాకు మాతండ్రిగారిచ్చి నకైజారు. ఇదిగో! ఇది మొలలోఁ గానఁబడకుండ దాఁచెదను. రాజు మోసమే చేయునెడల దీనితో వానినిబొడుతును.

ఇందు— అమ్మా! పోవుదము. రమ్మా.

మాన—(సంపఁగికి రమ్మని సంజ్ఞచేయును.)

సంప— అమ్మా! ఇదిగో వచ్చుచున్నాను. దాఁకలో రొయ్యలున్నవి. ఆదాఁకయు వంటకుండయుఁ దీసికొనివత్తును. (పోఁబోవును)

సుంద—(దానినిబట్టికొని) నీమొగముండఁగా మాకోటలోని కంటకుండ యెందులకు? (తనలో) తెలివితక్కువనిర్భాగ్యురాలా! దాసినిబట్టి దొరసానికదృష్టమని చెప్పినమాట వేదవాక్యముకంటె భిన్నమా? ఇదిగో! ఇట్టి— ఇట్టి చమురుకాళ్లపెయ్య నాకుడుతుట్ట పెదవికొంకనక్కముండలున్నచోట నమ్మవారియదృష్టమునకుఁ దీసి కట్టే.

ఇందు — సుందరీ! రమ్మా.

సుంద — (అప) అమ్మా! యీయమ్మమాట యిట్లున్నది, ఇంక నాయయ్యమాట యేదో శీఘ్రముగాఁ జూడవలయును.

ఇందు — (అప) ఊఁ!

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది చతుర్థాంకము.

శ్రీ

ముద్రిక.

పంచమాంకము.

ప్రదేశము — ఒకదొడ్డిలో వీధికి దగ్గరముననున్న యొక ధాన్యపుఁగొట్టున కెదుట.

ప్రవేశము — సుందరి; ఇందుమతి.

ఇందు — సుందరీ! నిమ్మళము. నిమ్మళము..

సుంద — అమ్మా! నామాటకేమిగాని, యందెలు కడియములు గలసి చప్పుడగుచున్నవి. కడియములు పైకిలాగుకొనుము.

(కొట్టులోనుండి బిగ్గఱగా) ఎవరక్కడ! ఎవరక్కడ! మాటలాడరేమి? (గట్టిగా) ఎవరయ్యోయి!

ఇందు — లోనుండి మనయలికిడి కనిపట్టినాఁడు కాఁబోలు!

సుంద — గదిలో బిగింపఁబడినవాఁడు కన్నులు లేనివాఁడువలె గడియగడియకు "నెవరక్కడ" యని యనుట సహజము. అంతేకాని మఱియొకటి కాదు.

(కొట్టులోనుండి) తలుపుతీయుని యెడలఁ దలఁ బగులఁగొట్టెదను. చంపెదను. డొక్కచీల్చి రాలుకొట్టెదను. చిట్టినారకమ్మను జీల్చినట్లు చీల్చెదను. జాగ్రత్త! జాగ్రత్త! (గట్టిగా) అక్కడ నెవరు! మాటలాడరేమి? ఎవరయ్యోయి!

సుంద — బాబయ్యా! క్రొత్తరాణితోఁ గల్యాణసుఖము బాగుగా ననుభవించుచున్నావా? ఇంక ననుభవింపుము.

(కొట్టులోనుండి తలుపు గట్టిగఁ దన్నుచున్నాఁడు.)

సుంద — లోనుండి తలుపు తన్నుచున్నాఁడు. నలువది రానున్న తరువాత నెన్నిపాట్లుపడకుండఁ బదునాలుగేండ్లక్రొత్తపెండ్లికూఁతురు ప్రక్కలోనికి వచ్చుననుకొంటిరి? బాబూ! తన్నుకొనుఁడు. ఇంకను దన్నుకొనుఁడు.

(కొట్టులోనుండి) ఇంక నేనఁబవలేనుగోయి! గొంతుత్రాళ్లు తెగిపోవుచున్నవిరోయి! తలుపుతీయగోయి! తీసినవారి కగ్గ రాజ్యమిదను. ఓహోయి! ఓహోయి!

సుంద — (తనలో) రాజా! తలుపుతీసినవారికి రాజ్యమిదవా? ఇచ్చినయెడల నీకముందు రాణులసంపాదనమేటులు? చెకుముకికాళ్లవారు — ఈ చెంపవెంట్రుకలవారు — నీ మొఖాసాను జూ వచ్చినవారనుకుంటివా? — నీ మొగమును జూచివచ్చినవారనుకొంటివా?

(కొట్టులోనుండి గట్టిగ) ఏమిరోయి! ఎవరురోయి! ఎక్కరోయి! అయ్యయ్యో! అయ్యయ్యో! రాజ్యమీయకపోయిన యెడ జండాలుండనురోయి! ఇదిగో! వచ్చుచున్నాను.

సుంద — (తనలో) రాణినివదలుమనన్నప్పుడే యంతవా వైతివి. ఇప్పుడు దిరుగననుట యెందులకు?

ఇందు — సుందరీ! పాపము. గట్టిగఁ జిక్కుకొనినాఁడు సుమా.

సుంద — రాజా! రాజ్యమిచ్చుచుంటివి. సంతోషమే. ఉంకొన్న యీపాపటపటాలమంతయు నెవరికీయఁదలఁచితివో పనిలోఁ బయదిగూడ నిప్పుడే తేలనీ. పూర్వార్జితమైన ప్రభుత్వమొక యెత్తు — స్వార్జితమైన పెటత్వ మొక యెత్తు కాదా?

(కొట్టులోనుండి) ఎవరురోయి? నాగొంతాగ్చుకొనిపోవుచుదోయి! కనులు చీకటులుపడుచున్నవిరోయి! ఇంకను జచ్చి

దును. బాబూ ! బాబూ ! ఎవ్వరైనవచ్చి రక్షింపరో ఘుబ్బాబూ వా ! వా ! వా ! వా !

ఇందు—సుందరీ ! అదియేమి వా వా వా యనుచున్నాఁడు.

సుంద—అమ్మా ! నోటిపైఁజేవైచి వా వా వా యని కొట్టుకొనుచున్నాఁడు.

ఇందు—ఇఁకఁ దలుపుఁ దీయఁదగదా ? చచ్చిపోవుదుననుచున్నాఁడు—

సుంద—ఇంతటితోఁ జచ్చుటయేనా ? ఇఁక నెందఱినేడ్పింప వలయునో ? ఎందఱను జంపవలయునో ? చావుమాత్రము సకాలమున వచ్చుటయొక్కటియదృష్టమమ్మా ! చత్తునని చావనివాఁడెప్పటి కప్పుడే యనుచుండును. కిమ్మనకుండఁ గ్రిందివారినిగడ తేర్చుచుండును. ఈతఁడు చంపినను జచ్చువాఁడు కాఁడమ్మా ! నీవసత్పుత్రుఁడు గట్టిది. సందేహింపకుము. చచ్చుటయే ! ఈగండమేదో గడచినయెడల నింతకంటె ద్విగుణీకృతమగు తేజస్సుతో నేకచ్ఛత్రముగఁ బశువులపాకల్లో—గుఱ్ఱపులాయములలో—కుక్కలకొట్లలోఁ గొత్తయంతఃపురముల గట్టించి వీరభోగవసంతరాయఁడై విశ్వమంతయుఁ బాలింప వలయునని యీతనిమనసులో నున్నదికాని యన్యథా లేదు.

ఇందు—ఇప్పటికైన బుద్ధిరాలేదనియే నీయభిప్రాయమా ?

(కొట్టులోనుండి) అయ్యయ్యో ! మహాపతివ్రతయై—పరమ శాంతమూర్తియై—ప్రాణప్రియయైన పాతరాణిని గొంతుకోఁతల మోసకత్తెయైన క్రొత్తరాణికై యుపేక్షపడివిడిచితిని. అదే ! విడిచెద నని యంటిని. ఆపాపమే నన్ను నేలనడఁచికొట్టినది. నాకుబుద్ధివచ్చినది. బ్రదికి బయటఁబడి నారాణిని నేను జూచుటసిద్ధించునెడల నాము పాదాక్రాంతుఁడనగుదును. ఆమెయే నాకు సహధర్మచారిణి. అట్టి

యిల్లాలిని బెట్టిన క్షోభమే నన్నింతవట్టునకుఁ దెచ్చినది. ఇఁకనంత ములో నున్న పశువులమందను సంతకో, మన్నెము నకో తోలివేసి..

ఇందు — వింటివా ? బుద్ధివచ్చినదికద !

సుంద — అయ్యో ! రాజగారూ ! ఈకగుపుకాలములో నూట యేఁబదిగురు దాసిముండలను జేరఁదీయఁగలసాహసంతు లెవ్వరు ! ఎక్కడనో యుద్ధాలు జరుగుచున్నవంటే ! యుద్ధసాహాయ్యముగా వీరినందఱనటకుఁ దోలిపెట్టుము. నీపీడదీఱును. వారిపీడ నీఱును. దేశపుఁ బీడదీఱును.

(కొట్టులోనుండి) నన్నురక్షించుట మనుష్యమాత్రునిచే గాదు. ఓవెంకటేశ్వరుఁడా ! ఓయేసుకొండలభగవానుఁడా ! రక్షించు రక్షించు ! ఉన్న నూటయేఁబదుగురుంపుడుకత్తెలమీఁదనున్న బం గారువస్తువులన్నియు లాగుకొని నీకు నిలువుదోపుగా నిచ్చెద బాబూ ! నాతండ్రి ! రక్షించు. రక్షించు. రక్షించు !

సుంద — అమ్మో ! వింటివా ? బుద్ధియెంతవఱకు వచ్చినదో ప్రక్కసేవ చేసినపాడుముండల సరకులు లాగుకొని యేసుకొండ యాయనకిచ్చునఁట !

(కొట్టులోనుండి) ఓ ! ఊడుగులమ్మా తల్లి ! రక్షించు. రక్షించు ! రక్షించు ! నీకు వెండిఘటము చేయించి యిచ్చికొందును మూఁడు వేటపోతులు, నూటొకకోళ్లు, నాల్గుబండ్లనైవేద్య మిచ్చుట మ్రొక్కుకొందును. తల్లికిఁ దయయున్నఁగాని తండ్రికిరాదు. నీవై వేంకటేశ్వరునితోఁ జెప్పి రక్షించు. రక్షించు ! మాతల్లీ !

సుంద — ఆహా ! వింటివా ? పాండిత్యప్రకర్షము. ఊడుగుల మ్మకు వేంకటేశ్వరుఁడు మగఁడట. అంతటితో సరిపెట్టినాఁడు. వెం కటేశ్వరుఁడూడుగులమ్మకు భార్యయనఁదగినవాఁడు. ఇది పండితప్రభు

ఇట్టి భాషాభిమాని—ఇట్టి విద్యాపోషకుఁడు—దేశీయుల మహాపుణ్యమున నవతరించినాఁడు. బాబయ్యకుఁ గవీశ్వరుఁడని పేరు చెప్పనగరి కొడలు మంట

ఇంద్రు—సుందరీ! అతని ప్రార్థనావైఖరి మనకు బాగుగా లేకున్నను, బశ్చాత్తప్తతమాత్రమాతనికిఁ గలిగినట్లగపడుచున్నది. దైవమును సరిగాఁ బ్రార్థింపఁగలవాఁడెవ్వఁడు? మనుజప్రార్థనలకన్నిటికి వంకర టింకర ప్రారబ్ధము తప్పనేతప్పదు. కాని కావలసినది పాపపశ్చాత్తాపము. అది యాతనికి బాగుగాఁ గలిగినట్లుతోఁచుచున్నది. సత్యమగునా కాదా?

సుంద—అతని బాగుతో సంబంధమునీకు. కాన నీకుఁదోఁచుట యే ప్రధానము. సత్యమా కాదా యను సందేహమక్కఱలేదు.

(కొట్టులోనుండి) ఎవరయ్యోయి! ఎవరయ్యోయి! ఏ ఏ ఏ ఏ
(ఏడ్చును)

ఇంద్రు—అదేమి? ఏడ్చుచున్నాఁడాయేమి?

సుంద—ఒక్కఁడు గాదిలోఁగూరు చుండి చేయవలసినపని యంతకంటెనేమున్నది? అంతఃపురములోఁ గూరుచుండిన యమ్మవారలందఱేమి చేయుచున్నారు.

(కొట్టులోనుండి) ఇఁక నాపని యింతే కాఁబోలునోయి బాబూ! బాబూ! ఎవ్వరును నా మొఱ వినరా? ఏదేవుఁడు నడ్డుపడఁడా! మొసలిపీకిన గాడిదెనుగాచిన మాతండ్రీ! రక్షింపవా? నాయనా! ఏఏఏ (గట్టిగ నేడ్చును)

సుంద—వింటివా? బాబయ్య కలియుగవ్యాసుఁడు. ఖరేంద్ర మోక్షణగాథ నుపపాదించుచున్నాఁడు.

ఇంద్రు—సుందరీ! పాపము. గట్టిగా నేడ్చుచున్నాఁడే. ఇఁకఁ దలుపు తీసెదను. నీవు పొమ్ము.

సుంద—అమ్మా! బహుజాగ్రత్తగాఁ బ్రవర్తింపవలయు-
జుమా! ఆతనిమనస్సున కెంతమాత్రమును సందేహముగలుగున
మాటలాడకుమా!

ఇందు—ఇదివఱకు నీయొద్ద నొప్పుఁజెప్పిన పాఠమే కాదా?

సుంద—నేనిఁకఁ బోవుదును. (నిష్క్రమించును.)

(కొట్టులోనుండి) అయ్యయ్యో! ఇఁకఁ జచ్చిపోవుట నిశ్చయము బాబూ! ఎంత స్వేచ్ఛగాబ్రదికినవాని కెంతగుఱుకునాపు వచ్చినది బాబూ! ఎంత వేడుకతో బ్రదికినవాని కెంతదుర్మరణము వచ్చిన బాబూ! కృష్ణమూర్తిలాగున దినములు వెడలఁబుచ్చిన చక్రవ
రావలసినచావిదేనా? ఏఏఏ (గట్టిగా నేడ్చును.)

ఇందు—నాథా! విచారింపకుము. వచ్చుచున్నాను.

(కొట్టులోనుండి) ఎవరు? క్రొత్తపెండ్లికూఁతురవే! ఆ! ఆ! ఇంతయాలస్య మేలచేసితివి? దయయుంచి త్వరగఁ దీయుము.

(ఇందుమతి బీగముతీయఁగ సేతుమాధవుఁడు
కొట్టునుండి పైకివచ్చి)

సేతు—(తనలో) బ్రదికితిని బాబూ! బ్రదికితిని. బాబూ (ప్రకాశముగ) అయ్యో! ఎవరు? ఎవరు? నారాణివే! ఇందుమతి దేవివే! నీవిచ్చటి కేలవచ్చితివి?

ఇందు—ఏలవచ్చితినో తెలియకున్నదా? వచ్చి యేమి తినో యంతకంటెఁ దెలియకున్నదా? చెప్పిననైనఁ దెలియునా?

సేతు—(రెండుచేతులు పట్టుకొని) నాప్రాణము రక్షించి దానవు నీవేనా? ఆహా! ఎంతమహోపకార మొనర్చితివి! నీడల దుర్మార్గుఁడనై ప్రవర్తించు నాయెడల నెంతదయగలదానవైతివి ఈపట్టుకొనినవి చేతులు కావు, నన్ను క్షమింపుము. నేనింతలో

యెడల నఱచియఱచి గొంతునరములు తెగి, మఱియుఁ గొంతసేపటికి మరణింపవలసినవాఁడను. మృత్యుముఖమునుండి నన్ను వెలికిఁ దీసితివి. కాని నీవిక్కడి కెట్లు రాఁగల్గితివో చెప్పవా ?

ఇందు—నిన్ను వెలికిఁదీయవలదా ? నీప్రాణమువలన నాకు సుఖములేకున్నను, నీమరణ మాపత్తుగఁ దెచ్చి క్షోభ మొందవలసిన దానను నేనొక్కతెనేగాదా? మిగిలిన చెంపకొప్పులవారికిఁ బండ్లకప్పులవారి కందఱకేమి? అంతఃపురములలోఁ గోడిపలావ్రులని కొకొక్కొకములని కిలకిలలాడుచుఁ, గిచకిచలాడుచు నీవు చచ్చితివో బ్రదికియే యుంటివో యని యెంచకుండ నాడుచుఁ బాడుచుఁ గాలక్షేపము చేయుచున్నారే! వీరందఱ నేమిచేయవలయునని తెచ్చితివి? ఒక్కొక్కతె గాడుగేదె యంత స్వరూపముగలదై యున్నదే! నీవు చూడఁగ వామనస్వరూపుఁడవే! దుర్బలశరీరుఁడవే! మిగిలినవన్నియు నటుంచుము. ఒకదానితరువాత నొక్కతెగా నీనూటయేఁబదుగురు ముచ్చటతో నిన్ను ముద్దుఁబెట్టుకొనుట సిద్ధించునెడల నూఁపిరితిరుగక యరగంటలోఁ జత్తువే!

సేతు—ఇఁకఁ జెప్పకుము. నాకు సిగ్గువచ్చినది. బుద్ధివచ్చినది.

ఇందు—సిగ్గువచ్చినవాఁడవుకదా! బుద్ధివచ్చినవాఁడవు కదా! క్రొత్తగా నొక్కపెండ్లికూఁతు నేల తెచ్చితివి ?

సేతు—దానిమూలముననే బుద్ధివచ్చినదని నాయభిప్రాయము. నేను దిన్నగఁ జెప్పలేకపోయినాను.

ఇందు—ఆమె యెవతె? ఆమెదేయూరు? ఆమె తలిదండ్రు లెవ్వరు ?

సేతు—ఆసంగతులు నాకేమియుఁ దెలియవు. వారు—మేము గూడ—నది యేదో క్షేత్రము—పేరు నోట నాడుచున్నది. అక్కడనొక్క

సత్రమున బసచేసితిమి. ఆమె క్షత్రియకాంతయనిమాత్రము కర్ణాగ వింటిని. ఆమె ప్రమాదవశమున నాకంటఁబడినది. తరువాత నే పట్టుపడి యామెను దెచ్చి ప్రాంతహావేలిలో నుంచితిని.

ఇందు——ఆమెయొద్ద వంటచేయు సేవకునొకనిని నీవు చంపవఁటే !

సేతు——అయ్యయ్యో ! నీకెట్లు తెలిసెను ? మఱియెవ్వరియెనన లేదుకదా ! చూడుము. ఆబండిలోనున్నదాని నీవలికిఁ దీసికొనిపవటలో నేనో కొంతగడబిడమైనది. అతనిని బుద్ధిపూర్వకముగా నేరును జంపలేదు. ఆతనిమీఁదవైర మెవరికున్నది ? చూడుము ! ప్రాణమనఁగా నెంత ? కణతపై టప్పుమనుసరికి గప్‌చిప్ ! ఆసందడిలో నెవరికా లెక్కడఁదగిలెనో, యెవరిచేయి యెక్కడఁదగిలెనో యెవరు చెప్పఁగలరు ? దిక్కుమాలినశరీరాలు ! నిత్యమువీపాయములోఁ గూకొన్నవే కాదా ? నీవు వచ్చి రక్షించితివి కాని నేనసరికి తారునఁ జయుండవలసినది. అంతయే మనయాయుస్సులు ! ఏమని చెప్పుదును కాని, నీకీరహస్య మెట్లు తెలిసినది ?

ఇందు——ఏమియుఁ దెలియకుండనియెడల, నెంతయుఁ దెలికుండనియెడల నేనిచ్చటికెట్లురాఁగలిగితిని ?

సేతు——ఆప్రశ్నము రెండుమారు లడిగినను జెప్పకపోతివే !

ఇందు——నేనేల చెప్పవలయును ? నీకు నేను ధర్మపత్నినిగదా నీకు నాయొద్ద నెంతమాత్రమును రహస్యముండవలసినది కాగదా ! నీయంత నీవే నాకు దాఁపఱికములేకుండ నంతయుఁ జెప్పసినదే—నాకుఁ దెలిసినతరువాత నైన నింక మూసిపెట్టుకొనుట యెదులకు ? బుద్ధివచ్చినదంటివే ? ఇదేనా బుద్ధివచ్చుటకు లక్షణము ?

సేతు—నన్ను క్షమింపుము. నే నంతయుఁ జెప్పెదను. క్రొత్త కాంత నిక్కడకుఁ దెచ్చినపిమ్మట మా సంధానకర్త యైన మాఘు నామె యొద్దకు రెండుమూఁడు పర్యాయములు పంపితిని. ఆమెయు, సుందరి యను పేరుగల నామె దాసియు మొన్న రాత్రి కాఁబోలును—మన యుద్యానవనములోనికి వచ్చిరి. ఆమె నాతో మాటలాడలేదు. సుందరియే మధ్యస్థురాలై యామె యభిప్రాయము తెలిపినది. ఒకటి రెండు దినములలో వివాహము జరిగించుటకు స్థిరపఱచితిమి. ఆమెను రాణిని జేయుట కొప్పుకొంటిని. బుద్ధిలేక నిన్ను వదలుటకు గూడ సమ్మతించితిని. నీవు కోపపడవలదు.

ఇంగు—నేను శాంతిచెడినదాననైనయెడల నీవింతవిధము చేసి యుందువా ? తరువాత,

సేతు— తరువాత, విశ్వాసార్థముగా రాజముద్రికాంగుళీయకమును వారు కోరఁగ నిచ్చితిని. ఆ రాత్రికి వారు వారిబసకుఁ బోయిరి. మఱునాఁడు సాయంకాలమున మాఘుఁడు వచ్చి క్రొత్త రాణి సుందరిచేతి కిచ్చి పంపెనని యీ లేఖను నాకిచ్చెను. ఇదిగో ! చీకటియగుటచే నిది చదువుటకు వీలులేదు. కాని దీనిలోని యంశములివి.

"రాజుగారికి క్రొత్త రాణి యనేక నమస్కారములు. నిన్న రాత్రి మనము కలిసినప్పుడు మీరు రాజముద్రిక నాకిచ్చితిరి. రాజ్యమిచ్చినట్లు సంతోషించితిని. తిరుగ మీ దర్శనము నపేక్షించియుంటిని. మీ తోఁటలోనికి నేను రాను. అక్కడ మనుజుల సందడి యెక్కువగానుండును. మీరు మా యింటికిని రావలదు. మా సందులో మా యింటికిఁ గుడివైపున నైదవగుమ్మము దాఁటగఁ బెద్ద తోఁట యున్నది. వీధిగుమ్మమునకు మిగుల దూరముగ నొక కొట్టున్నది. ఆకొట్టులోనికి మీరు రాత్రి పదునొకండుగంటలకు రావలయును. మిమ్మక్కడఁ గలిసికొందును. సేవకురాలు, క్రొత్త రాణి."

ఇందు—(తనలో) ఈయుత్తరమే సుందరి వ్రాసి రఘునాథుని-కిచ్చినది. (ప్రకాశ) అది క్రొత్తరాణి వ్రాసినట్లు నీకేమైన నమ్మకము ఆమె వ్రాలు నీవెఱుఁగుదువా ?

సేతు—వ్రాలు గీలు నే నెఱుఁగను. నేనిచ్చిన ముద్ర యీ యుత్తరముక్రింద వేయఁబడియున్నది.

ఇందు—(తనలో) అదియు సుందరి చేసిన పనియే. రాజముద్రిక గ్రహణమునకు ఘోటునకుఁగట్టిన మినుపరొట్టయిదియే. (ప్రకాశ) రేపో యెల్లుండియో వివాహము స్థిరపడినదికదా ? గతించినరాత్రి, నీతో నామె మాటలాడ లేదనియే చెప్పితివికదా ! ఇంతలో నింతత్వరతో నిన్నేల రమ్మనవలయునను సందేహము నీమనస్సునకుఁ గలుగ లేదా ? అదికాక యామె యీగ్రామమునకుఁ గ్రొత్తకదా—తన యుంటికిఁ గుడివైపున నైదవగుమ్మమునియునటఁ బెద్దదొడ్డియనియు, దానిలో నొకకొట్టనియు, దానికి వీథిగుమ్మమునకు దూరమనియు నిన్నిసంగతు లామె కెట్లు తెలిసినవని నీకుసందేహము కలుగ లేదా ఇంత యోజన లేకుండ దుడుకుదుడుకున గాదిలోనికిఁ గంకణాలయుత్సవమునకై సిద్ధపడితివా ? ఎంత తెలివితక్కువపని చేసితివి !

సేతు—సుందరి గండ్రముండ లే. అది యేపని చేసినను జేయఁ గలదని నమ్మవలసినదే లే. అది యేదికనిపెట్టినను గనిపట్టఁగలదు. నీ దానివంటిదానిని జూచియుండవు.

ఇందు—(తనలో) అమ్మయ్యో ! నిజము పలికినాఁడు. గుండెలదఱిపోయినవి ! ఆహా ! ప్రమాదవశమునఁ బలికిననైనను సత్యము కున్నతీక్ష్ణత యవర్ణ్యముగదా !

సేతు—ఇందుమతీ తెలివితక్కువపనియని వేఱచెప్పనేల బుద్ధి శృంగారరసమునకు నేతము పెట్టన్నసంగతి మహాకర్తలందఱు నొప్పుకొనినమాటయే కాని మఱియొకటి కాదు లే. ఇది పౌరుషప్రథా

మైన లౌకికవ్యాపారముగాని దైవచింతాప్రధానమైన తత్త్వమార్గము కాదని ధర్మశాస్త్రము ఘోషించుచునేయున్నది.

ఇందు—ఏమి ? ఇదిపౌరుషమా ? మగువలమందనడుమను గూరుచుండుట మగతనమునకు లక్షణమా ? ఆపత్తులలోసహనము గలవాఁడు మగవాఁడు. ఆలియభిమానమును గాపాడువాఁడు మగవాఁడు. అరిషడ్వర్గమును జంపువాఁడు మగవాఁడు. అంతయేకాని కంటబడినదానినెల్లఁ గట్టుకొని పంచపాళిలో పరదాచాటునఁ బస్తుపెట్టించి యీలాగునఁ బదిపన్ఱెండ్లో, పదిపదునాలుగులోఁ గుంచములో గదుల్లుపోసినట్లు నగరులో బిగింపుగాదట్టించియే నిమునిమునకెవరు లాగుదురోయని యెప్పటికప్పుడే మొగము చాటువేసి యందఱ నేడ్పించి తాను గాదిలోఁ గూర్చుండి వీరందఱకంటె గట్టిగానేడ్చు వాఁడు మగవాఁడా ?

సేతు—ఏదో జరిగినన్నివాళ్లత్యంతపరితాపముతోననిర్వచనీయతేజస్సుతో జరుగనే జరిగినది. మగతనపుఁబ్రశంస యెందులకు ? అదియుంక మదలుకొంటిమికాదా ? మాఘుఁడిచ్చిన యాయుత్తరమును నమ్మి నిన్నరాత్రి పదకొండుగంటల కింతునఁబ్రవేశించితిని. తెల్లవారినది. తిరుగసాయంకాలమైనది. ఇప్పుడిపలుకువచ్చితిని. ఇప్పుడేమగంటలగునేమో ?

ఇందు—అయియుండును. క్రొత్తరాణి నిన్నుఁ గలియుటకు రాఁ దలఁచియే నిన్నికొట్టులోనికి రమ్మనెనని నీకునమ్మకమా ?

సేతు—క్రొత్తరాణి దొంగ. దానిదాసి సుందరి దానికన్న దొంగ. నిన్నరాత్రి వారుమేముకలిసినప్పుడే కొంతసందేహము మనస్సునకుఁ గలిగినది. కాని పెండ్లితొందర—ప్రబలముగా నుంట చేత,

ఇందు—అదిదొంగయని నీవెట్లు చెప్పఁగలవు ?

సేతు — నేను గదిలోఁ బ్రవేశించిన పదినిముసములకు వాఁకిటిలో గొంచె మలికిడియైనది. సరే; అదివచ్చినదిదాయని సంబరపడి పండుకొన్నవాఁడను లేచి కూరుచుంటిని. ఇంతలో గప్పున నున్నది.

ఇందు — అదేమి ?

సేతు — తలుపునకుఁ బైవైపు గొళ్లెము పడినది. అంతలో టక్కున బీగము పడినది. ఒక్కనిముసమగునరికి నాకు విషయము సుస్పష్టపడఁ బడినది. పరిహాసమున కిట్లామె చేసినదేమోయని యనుకొని బతిమాలుకొంటిని. పారితోషకము లాసపెట్టితిని. భయపెట్టితిని. అఱచితిని. మొత్తుకొంటిని. ఒక్క రీతిగా నప్పటినుండి నీవువచ్చి తలుపుతీయువఱకు నెత్తినోరు కొట్టుకొంటిని. ఇప్పుడుపోయి దానిని బ్రతివిధము చేయింపక యూరకుందునా ? రమ్ము.

ఇందు — ఉండుము. ఇంకను వెలుపలసందడిగా నున్నది. ఈ దినము సతకూడదు. ఒక్కయరగడియసేపు తాళుము. నీవు చెప్పవలసిన గాథ యేదోయైనది. ఇంక నేను జెప్పవలసినదేదో వినుము. మూఁడు ముక్కలలోఁ జెప్పెదను. నిన్నరాత్రి నీతో మాటలాడఁ దలఁచి నీగదికి వచ్చితిని. నీవు లేవు. పండ్రెండైనది. ఒంటిగంటయైనది. రెండయినది. నీవింక రాలేదు. మూఁడుగంటలుకూడ వింటిని. నీవు రాలేదు. నాప్రాణము చెదరిపోయెను. ఏమైన మోసము జరిగియుండునేమోయని యెంచి ముసుగువైచికొని నాల్గుగంటలసమయమున దాసినిదోడుతీసికొని క్రొత్తరాణి మహలుకిఁ బోయితిని. ఆమె గాఢముగా నిద్రించుచుండెను. లేపి నాభర్త రాజుగారేరని బాకుఁదీసి పొడువఁబోయితిని. అప్పుడు మీపూర్వరాత్రి సమావేశపుసంగతి నీకు వ్రాసినయుత్తరము సంగతి యుత్తరమునకు నీవిచ్చిన రాజముద్రిక నమ్మికకొఱకు వేసినసంగతి, వదినమ్మ గాదిలోనికి వేంచేసినసంగతి, యామె సుందరిచేఁ దాళము వేయించిన సంగతి చెప్పినది. తలుపుతాళము దానియొద్దఁ దీసికొంటిని.

అప్పటికి బల్లునఁదెల్లవాఱిపోయెను. ఎటులోఁగోటలోఁబడితిని. అంతఃపురరాణిని బగలు నేనిక్కడకువచ్చుటకు వీలులేదుకదా! మాటికియొకరిని బంపుట కెవ్వరికిఁ దెలియఁదగినయంశము కాదుకదా! ఏమిరా భగవంతుఁడా యశ సాయంకాలమగువఱకు వేఁచియుండి యిప్పుడే వచ్చి తలుపుతీసితిని.

సేతు.—నీవు నామర్యాద కాపాడితివి. నాప్రాణమును రక్షించితివి. నాశత్రువును శిక్షించితివి! నీకు సాష్టాంగనమస్కృతికన్న నే నేమిచేయఁగలను? (నమస్కరించును.) ఆహా! ఎంతపుణ్యాత్మురాలవు!

ఇందు.—(తనలో) ఆహా! మోస మెంతపనిచేసినది! భర్తను వశపఱచుకొని కనుసన్నలఁ దిప్పుకొనుచున్న యిల్లాండ్రిందఱు మోసముచేతనే యట్లు చేయుచున్నారేమో? శాంతివహించినంత కాలము నాభర్తకు నాపైఁ గోపము హెచ్చిపోవుచునేయుండెను. బతిమాలుకొనినంత కాలమతనికి బిఱ్ఱబిగింపధికముగనేయుండెను. ఒదిగియొడఁగి మడఁగియున్నంత కాలమాతఁడు నెత్తిక్కిత్రొక్కుట వదలనేవదలఁడయ్యెను. నీవే గతియని మ్రొక్కినంత కాలము కోటలోనుండి నన్ను గెంటివైచుటకే ప్రయత్నించెను. మోసమునఁ బఱఁదీసి బాధించుటతోడనే భర్త స్వాధీనుఁడయ్యెను. నేనే ధర్మపత్నినైతిని. క్రొత్తపెండ్లికూఁతురు శత్రువయ్యెను. ఆహా! మోసమెంతమహిమగలదియో! వగలాఁడియైన యాఁడుదిగాని భర్తను వశపఱచుకొనలేదు కాఁబోలు! టక్కులాడియైనయిల్లాలు గాని మగనికి ముక్కుత్రాఁడు వోయలేదు కాఁబోలు! ఈకాలములో నాఁడుది యట్టిదై జమ్మకలదిగా నుండవలయును గాఁబోలు! కాన యట్టిదానినేగాని మగవాఁడు ప్రేమింపఁడు కాఁబోలు! వాని నైజమది కాఁబోలు! ప్రపంచజ్ఞానములేని నాకేమైనఁ దెలియునా? యేమొచ్చునా?

సేతు—చూడు ! దాసి నెత్తి వాయఁగొట్టి నాముద్రికను కొంటివా ?

ఇందు—తృణప్రాయముగ రాజముద్రికను నీవీయఁగలవు కాని నేను దిరుగఁ దీసికొనకుండ నుండఁగలనా ?

సేతు—అహా ! ఈకార్యమువలన నారాష్ట్రము మునుఁగుచుండఁగా పాడితివి ! నీకు నేను సర్వధావిధేయుఁడను. త్రికరణశుద్ధిగా దైవసముఖమునుజూచి చెప్పుచున్నాను. కాని, ఇదిగో ! ఇంటికిఁబోయి దాని తల నఱికివైచినఁగాని నాకుఁ గసితీఱదు.

ఇందు—ఇదివఱకు దాని సేవకుని జంపితివి. అదియే తప్పుగా నుండ నిప్పు డంతకంటెఁ దప్పొనర్చుటెందులకు ?

సేతు—అది నన్ను మోసముచే నిట్లు బాధించునా ?

ఇందు—(తనలో) బంధించినదానను నేనైయుండ దానికి శిక్ష తగునా ? (ప్రకాశ) నాథా ! దానిని నీవిటకుఁదెచ్చి నీవావేలనో బాధింపలేదా ? ఆమె నిన్నుఁ దిరుగబంధించి పగదీర్చుకొనుటతప్పా ? దీర్చుకొనుట కవకాశమున్నప్పుడు భార్యయే యూరకుండదుగదా పైదానిమాటలెక్కయేమి ?

సేతు—నన్నెంతహింసపెట్టినదో భగవంతునకెఱుక.

ఇందు—నీవామె నెంతహింసించితివో పరమాత్మునకెఱుక. అదికాక మఱియొక్కయంశ మాలోచించుకొనుము. ఆమె నిన్ను బంధించుటచేత నేకదా నీకుఁ బూర్ణమైన పశ్చాత్తాపము కలిగినది ! వచ్చినది నేను భార్యగాఁ గానఁబడుచుంటిని. నీతియే యుత్తమమైన తెలిసినది. ఏకపత్నీవ్రతముకంటె నుత్తమచరిత్రము లేదని గోచరించుచున్నది. నీనడతలో నిట్టి మంచిమార్పు కలుగుట కామెయే కారణము కాదా ? మహోపకారిణియగు నామెను గౌరవింతురా ? బాధింతురా ?

సేతు—అట్లైన నన్నేమిచేయుమంటివి? నాకిన్ని తెలియవు. నీవు నన్నిట్లు నడువుమని చెప్పుము. అట్లు నడువనియెడల క్షత్రియవంశ జాతుఁడనుగాను.

ఇందు—ఆమెయెడల గౌరవభావముతో నీవుండవలయును.

సేతు—అట్టే.

ఇందు—(తనలో) పదిపదునాలుగేండ్ల వయసుచు బంగారుబొమ్మ—ఎవ్వరిదానవని యడిగిన నేమియుఁ జెప్పదు. మాటలాడదు నంచి యర్థమైనఁ గానదు. మీయింటికిఁ బొమ్మన్నఁ బోదు. నాయంతఃపురములో బెట్టుకొంటిని. ఈఁడు దానిని దెచ్చుటయేమి? అది నన్ను వదలకుండుటయేమి? ఈతనికి దానిపైఁ బడలినది కాని నాకేఋణసంబంధమో కాని యింత బాధించుచున్నది.

సేతు—ఇప్పుడామె యెచ్చటనున్నది?

ఇందు—నాయంతఃపురములోనికిఁ దెచ్చి పెట్టికొంటిని.

సేతు—అట్లుచేసితి వేల?

ఇందు—దాసియింటికిఁ బొమ్మనఁ బోకుండినన్ నేమిచేయవలసినది?

సేతు—ఎందుచేతఁ బోదు?

ఇందు—ఏమని చెప్పను? ఆమె యట్టి యభిమానవతి—ఆమె యట్టి యభిమానవతి—ఆఁడుదాని యభిమానసందర్భము మగవానికిఁ జెప్పఁదగదు. చెప్పిన నది యాతనికి బోధపడునది కాదు. అది యాఁడుదానికిఁ దెలియఁదగినదే. అది యాకాశముకంటె నధికమైనది. సూదిమొనకంటె సూక్ష్మమైనది.

సేతు—అట్టి మహాభిమానసంపన్నురాలినా నేను దెచ్చినది! ఆహా! నాపాపమున కవధియున్నదా?

ఇందు—ఇప్పటికి నవధియేయున్నది. ప్రియాపవేశపవిత్రముచే నామె ప్రాణత్యాగముచేయునెడల మాత్రము నీపాపమున కవధియుండదు.

ఇది పంచమాంకము.

శ్రీ

ముద్రిక.

షష్ఠాంకము.

ప్రదేశము — అంతఃపురము.

ప్రవేశము — మానవతి, ఇందుమతి.

ఇందు — అమ్మా! నీపేరైనఁ జెప్పఁగూడదా?

మాన — మొదటఁ జెప్పఁదగిన పేరే — మాపు మచ్చయు లేని పేరే — కాని, ఇప్పుడట్లు కాదు. అమ్మా! అవిధేయతను క్షమింపుము.

ఇందు — క్షమింపక నేను చేయవలసినదేమున్నది? నామనస్సుండఁబట్టక యేదో యుపేక్షతో — నేను బైకిఁ జెప్పఁజాలని యా్ర ముతో — నామనస్సునకైన నేమో యర్థముకాని యాందోళనముతో అమ్మా! అటులు కంటనీరు బెట్టుకొందువేమి? ఏమో నాకడుపులోనున్న కష్టమును జెప్పుకొనుచుంటివిగాని నీమనస్సున కేమైన బాధ నీకు లేదుకదా!

మాన — నీకడుపులోఁ గష్టమే నామనస్సులో బాధయైనది
(ఏడ్చును.)

ఇందు — అమ్మా! అమ్మా! ఎందుచేత? ఎందుచేత? చెప్పవా? చెప్పవా?

మాన — ఏమియు లేదు. నేను జచ్చినవెనుకఁ దెలియును లే
(ఏడ్చును.)

ఇందు — అట్లేడ్చెద వేమి ? మాఅమ్మా ! నాకు దడ యెత్తు చున్నది. చెప్పవా? చెప్పవా? చెప్పకున్న యెడల నాతోడే.

మాన — నేను జెప్పఁదలఁచుకొనలేదు. చెప్పిన యెడల నీతోడే.

ఇందు — ఎవరు వారు !

(నేపథ్యమున)

అమ్మా ! మీనానాయనగారియొద్దనుండి మాధవుఁడనువాఁడు వచ్చినాఁడు. మీతో మాటాడునఁట. లోనికి రమ్మనిసెలవా?

ఇందు — నన్నుఁ బెంచి పెద్దదానిఁ జేసిన మాధవుని గూర్చి యీ క్రొత్తయనుజ్ఞ యేల ?

(నేపథ్యమున) క్రొత్తరాణిగారు వారు యట్లు చేయవలసి వచ్చినది.

ఇందు — అభ్యంతరము లేదు. ఈప్రక్కనే యాతనితో మాట లాడుదును. వేగరమ్మని చెప్పు.

(మాధవుఁడు ప్రవేశించును.)

ఇందు — మాధవా ! అక్కడ నేయాఁగుము. మిగులఁ బెద్దవాఁడ వైతివే ! నీవంటిపెద్దవాని నిటకుఁ బంపవలసిన యావశ్యకత మాతండ్రి గారి కేమికలిగినది ?

మాధ — మీతల్లిగారానకుమ మిగులరోగపడినారు. ఆమెకు నిమ్మళముగా నున్నయెడల నొడలిమీఁది నగలన్నియు శ్రీపురమహాలక్ష్మికిచ్చెదనని మీ చెల్లెలు మ్రొక్కుకొన్నారు. అమ్మకు నిమ్మళముగా నున్నతరువాత మ్రొక్కు చెల్లించుకొనుట కమ్మాయిగారు కొలఁదిపరివారముతో బయలుదేరినారు. ఇప్పటికివఱకుఁ దిరుగనింటికి రాలేదు.

ఇందు — అయ్యో ! అయ్యో ! ఎందుచేత ?

మాన—(గట్టిగా నేడ్చుచు) మాధవా! మాఅమ్మగారు నిశ్శేషముగా నున్నారుగదా!

ఇందు—అయ్యో! అయ్యో! మాయమ్మగారను నన్నావేమి?

మాధ—(తొందరతో నెదుటకువచ్చి) అమ్మా! మానవతమ్మా! ఇచ్చట సురక్షితముగా నున్నావా? తల్లీ!

ఇందు—అవును. ఇచ్చట సురక్షితముగా నున్నది. కాని, మాధవా! నీవుపోయి రాజుగారి నొకపదినిముసములలో నేనురమ్మంటినని చెప్పుము.

మాధ—చిత్తము. (పోవును)

ఇందు—అమ్మా! నీవునా చెల్లెలగు మానవతివేనా తల్లీ! మా అమ్మా! ఎంతదానవైతివి! నిన్నెన్నాళ్లకుఁ జూచితినమ్మా! తుతుదకు నాభర్త నీకుఁగూడ నిట్లపకృతి గావించినాఁడా? మాతల్లీ నావంక నొకసారి కన్నులు తెఱచిచూడుము.

మాన—(తలపైకెత్తును.)

ఇందు—(ముద్దుపెట్టుకొని) చెల్లెలా! నిన్నుఁ జిన్నతనములో ముద్దుబెట్టుకొననేలేదు. అయ్యయ్యో! నేనెంతపాపాత్మురాలను! ఏ అత్తవారింటికి వచ్చినతరువాతఁ బిరుగఁబుట్టినింటి మొగమేచూడమైతిను. ఏమిచేయుదును? నీవుపుట్టితివని పెరుగుచుంటివని వినుట కాని రాకలా పోకలా యేమున్నవి? అమ్మ కంతరోగమువచ్చి రాపీలు లేకపోయెను. చెల్లెలా! అమ్మకు విషముగా జబ్బుచేసి కాఁబోలునేమి?

మాన—అమ్మ బ్రదుకునని యెవ్వరైనననుకొనిరా? పెద్దకూఁతురిని జూడనుగాఁబోలునని యెన్నిమాఱులోఁ గన్నుల నీరుపెట్టుకొన్నది. నేను బచ్చిపోయినతరువాతనైన మీతండ్రిగారిని జూచుట

మీాయక్క వచ్చునేమో దానిని నీవుచూడగానే క్రొత్తయని సందే
హించి దూరదూరముననుండక దానిని నామూరుగా గట్టిగాఁ గౌఁగి
లించుకొనుమాయని నాకెన్నిమాటులో బోధించినది.

ఇందు — పాపము! నేనేమిచేయఁగలను? నాకుమాత్రము
వచ్చి చూడవలయునని లేదా? మాఅమ్మా! ఇప్పటికైన నిన్నుఁ
జూచితిని. ఏసాధారణులు కొంపలలోఁబడినప్పుడే యిట్టి యచ్చటకు
ముచ్చటకు నవకాశమున్నది కాని రాజసంబంధములకెల్ల నీబాధ
కొలఁదిగానో గొప్పగానో యుండనేయున్నదమ్మా! కాని భాగ్యాలకు
భోగ్యాలకు — గడబిడలకు దడబడలకు — రాజసంబంధములకొలకపే
తపమటకూడ సహజమేనమ్మా! నిజమగునాకాదాఅమ్మా!

మాన — ఔను. నిజమే.

ఇందు — (మానవతి మెడతడుముచు) అమ్మా! నీమెడలో
నేయాభరణములును లేవే? పెండ్లియైనవచ్చిన కన్నెవు. ఇట్లుమొండి
మెడతోనుండఁదగునా? ఇదిగో! నాయాభరణములన్నియుఁ దీసి
కొనుము.

మాన — నాకక్కఱలేదు. నీనగలు నేనుదీసికొననేల?

ఇందు — అమ్మా! అమ్మ కారోగ్యముకలిగినతరువాత నీన
గలు మహాలక్ష్మికిచ్చెదనని నీవుప్రతిజ్ఞచేసినట్లు చెల్లెలిని జూచినతోడనే
దానికి నానగలన్నియు నిచ్చెదనని నేనొకనిర్ణయము నెన్నిసంవత్సర
ములకిందటనో చేసికొంటిని. నీమ్రొక్కు నీవుచెల్లించుకొని నాయే
ర్పాటు నేనుజెల్లించుకొననీయకపోవుట నీకుఁదగునా? ఇఁకమాట
లాడకుము. (తనయాభరణములు లామెమెడనువేయును.)

మాన — నీకాభరణములేవి?

ఇందు — అమా! ఇఁక నా కాభరణములతోఁ బనిలేదు.

మాన—ఎందుచేత ?

ఇందు—నీకుఁ జెప్పెదను గాదా ? అమ్మా ! నీ కెవరిని జేసికొన వలయునని యున్నది.

మాన—నాకిప్పుడు పెండ్లితొందర యేల ?

ఇందు—అమ్మా ! ఎంత సంగనాచివే. నీకుఁ బదునాలుగేండ్లు లేవా? ఏదీ ? నా పెండ్లికే కాదా అమ్మకు నెలదప్పినది. పదునాలుగేండ్లకుదిరు జాలువచ్చినదని యమ్మలక్కలాశ్చర్యముగాఁ జెప్పుకొనిరి. అప్పుడు నీవు గర్భమునఁబడితివి. నేనుగాపురమునకువచ్చి పదునైదు సంవత్సరములు మొన్నటి శ్రీరాబ్ధిద్వాదశికయినవి. పదునాలుగేండ్లదాని మగఁడక్కఱలేదేమి ? ఓసీ ! ముద్దరాలవు ! నాకు నీయీడుననే కాదా పెండ్లియైనది.

మాన—నా పెండ్లిమాటకేమి కాని నీకునగలెందుకక్కఱలేదు!

ఇందు—నీతోఁ జెప్పెదను. ఇంకముఖ్యమైన సంగతులు నీతో సావకాశముగాఁ జెప్పవలసియున్నది. వానితొందర యిప్పుడేమియు లేదు. కాని చెల్లెలా ! నీవు నన్నెఱుఁగవు కాని కనకపుర రాజుభార్య నీయక్క యన్నసంగతి నీవెఱుఁగుదువు కాదా ? ఈగ్రామమునఁ బ్రాంతవాటిలో నీవుండియు నిట్లుచేసితివేల ?

మాన—ఇది కనకపురమని నాకెట్లు తెలియును ? నాయొ నున్న దాసికిఁ దగని చెప్పదు. అదిగాక చావదలఁచిన దానికిది యేయూరైననేమి యని నేను నిర్లక్ష్యముగానుంటిని. అదిగాక మాకెట్టి సంబంధమో నీవెఱుఁగుదువా ?

ఇందు—ఔనమ్మా ! కాని యీయుదయమునుండియు నను జూచినప్పుడెల్లఁ బ్రక్కకుఁదిరిగి యేడ్చుచుంటివేల ?

మాన—ఈయుదయమే యిది కనకపురమని యెవ్వరో యనఁగ వింటిని.

ఇందు—ఆ ! ఆ ! నేను నీయక్కనని యీయాయుదయమే కనిపెట్టితివా ?

మాన—ఆ. అదిగాక మీయక్కకు బుగ్గమీఁదఁ బుట్టుమచ్చ యున్నదిసుమా ? యని మనయమ్మ యెన్నిసారులో వెట్టిథోరణిగాఁ జెప్పుచుండెడిది. అదిచూచి మఱింత బాగుగా నానవాలుపట్టితిని.

ఇందు— ఆనవాలుపట్టియు నన్నుఁ గౌఁగిలించుకొనక యింతసేపెట్లూరకుంటివే ? నీవు కఠినురాలవమ్మా !

మాన—కఠినురాలనైనయెడలఁ గడుపుదఱుగుకొనిపోవునట్లీల యేడ్చియుందును ?

ఇందు—పోనీ ! అంత విచారించినదానవు—రవంత చెప్పలేకపోయితివా ?

మాన—అక్కా ! ఏమని చెప్పఁగలను? నీభర్త యింత ప్రమోజకత్వము చేసినాఁడని నేను జెప్పనా ? నీమనస్సు క్షోభపడదా ? కిక్కురుమనకుండఁ జావనైనఁ జచ్చెదనుగాని—

ఇందు—అమ్మా ! మానవతి యనుటకు నీవేతగుదువు. అమ్మా! చూడు. నిజముగా నాభర్త యట్లుచేయుటచేతనే మనకిట్టిమహానందము కలిగినది. ఆతనిలో నాకస్మికముగాఁ గలిగిన మార్పు నీవెఱుగవు. ఎఱిగియుండిన యెడల నాతనిని నీవుకూడఁ బరిపూర్ణముగ గౌరవింతువు.

మాన—ఆమార్పేమి?

ఇందు—ఆతఁ డేకపత్నీవ్రతుఁ డైనాఁడు. ఇదివఱకున్న యుంపుడుకత్తెలందఱకు వారి వారికిఁ గొంత భరణమిచ్చి యీయుదయముననే పంపివైచినాఁడు.

మాన—అక్కా ! నాకు నింతసంతోషకరమగు వార్త చెప్పితివి ! అమ్మ చెప్పుడిదియే కాఁబోలు. నీవింక సంపూర్ణముగా సౌఖ్యమనుభ

వింతువన్న సంగతి యమ్మ చెవిని బడినయెడలఁ గొండయెక్కినట్లు సంతోషింతును.

ఇందు—అమ్మా! చిరకాలము కాపురము చేసితినిగదా! ఆసౌఖ్యమేదో తెలిసినది. ఇక నాసౌఖ్యమున కేమి కాని, నీవుసుఖపడ వలసిన దినములువచ్చినవి. నీపెండ్లిమాట యేమాయని యోజించుచున్నాను. చూడు. చెల్లెలా! నీవెవ్వరినైనఁ బ్రీతియున్న వానినే చేసికొందువా?

మాన—నాకుఁ దెలియదు. నీయిష్టము. అమ్మయిష్టము.

ఇందు—నేనమ్మతోఁ జెప్పి యొప్పింతునులే. నీయిష్టానుసారముగా నేఁ జేయవచ్చునుగదా!

మాన—అక్కా! నన్నడుగనక్కఱ లేదు.

ఇందు—అడుగనక్కఱ లేదనకుము! అడుగవలసిన యక్కఱ వచ్చినది. అందుకే అడుగుచున్నాను. వేఁడుకొనుచున్నాను. ఇదిగో! కాళ్లుపట్టుకొనిబతిమాలుకొనుచున్నాను.

మాన—నీవు నాకంటెఁ బెద్దదానవైయుండియు నిట్లు చేయ గునా? కాళ్లువదలుము.

ఇందు—నేను వదలను. నేను బెద్దదాననుగాను. నాపెద్దతనము పోయినది. నాబుద్ధినశించినది. నేను బాపాత్మురాలను. నీవు యోగ్యురాలవు. మానవతివి. నేను విన్నంటుటచే నీవెక్కడ నపవిత్రవగుదువోయని భయపడుచున్నాను. నాకోరిక చెల్లింతునన్నను నీకాళ్లు వదలుదును.

మాన—అలాగే వదలుము.

ఇందు—(వదలి) చెల్లెలా! నేను పదునాలుగేండ్లనుండి భర్తతో నున్నాను. కడుపుఫలింపలేదు. ఇక ఫలింపవలయునన్న నాసయు లేదు. ఫలింపనక్కఱయు లేదు. నీవుకూడ నావంటి గొడ్రాలవేయగుదువా

నీవుపుత్రవతివి కాకూడదా? నాయాశీర్వచనమునఁ నగుదువు. అమ్మ బ్రతికియుండఁగా దౌహిత్రదర్శనలాభమామెకుఁ గలిగింపుము. మావంశము నిర్వంశమయ్యెనను లోపములేకుండ మమ్ముఁ గటాక్షింపుము.

మాన—అక్కా! అన్నియు నెఱిఁగియుండియు నీవిట్లనుట న్యాయమా?

ఇందు—న్యాయము కావుననే చెప్పితిని. బుద్ధికలిగియో బుద్ధిలేకయో నిన్ను నాభర్త తెచ్చినాఁడు. ఈయంశము లోకమున నిదివఱకే వ్యాపించి యుండును. నీకొఱకు మరియొక సంబంధమిప్పుడు చూడఁదగదు. లోకము మంచిది కాదు. ఈమాటవలననే నాయభిప్రాయమేదో బుద్ధిమంతురాలవగు నీవు తెలిసికొనఁగలవు. నాభర్త పూర్వవైఖరినే పాపియైనచో నేమైననగుఁగాక యని నిన్నిందులకుఁ బ్రోత్సహింపను. ఆతఁడిప్పుడు పరిపూర్ణముగా మారినాడు. ఆసంగతి నామనస్సునకుఁ దెలియును

మాన—అక్కా! నాయిష్టము చూడనక్కఱలేదా?

ఇందు—ఆతఁడు నీకంటికి బాగుగా లేఁడా? నీవాతనిని జూడకుండ నట్లుచెప్పుట న్యాయమా?

మాన—చూడకపోవుటయేమి? మొన్నరాత్రి యాతఁడు మాయింటికివచ్చి నన్నెక్కడకుఁ దేలేదా? నీకు నేను దోఁబుట్టినవాఁడను సుమా యని నాకాళ్లపైఁబడుటచేత నేకదా యిక్కడకువచ్చితిని. ఇప్పుడా తోఁబుట్టినవానితోడ నాపెండ్లి? చాలు!

ఇందు—అయ్యో! వెఱ్ఱిదానా? సిగ్గులేక నటకునివలెఁ దేర మీసములు మూతికంటించుకొని నిన్నుఁ జూడవచ్చిన కొజ్జాదానను నేనే!

మాన—ఆ! ఆ! అటులేల చేసితివి?

ఇందు—నీవు నాపగదానవనుకొని నిన్ను నాభర్తను సాధించుట కెన్ని నీతిమాలిన వేసములైన వేసితిని. వేయుఫలసివచ్చినది. నా

దుర్గతి. నేను బాపాత్మురాలనని యిదివఱకు నీతోఁ జెప్పియుండలేదా ఆ సంశయము లన్నియుఁ దరువాతఁ జెప్పెదను. కాని నీవు నాభర్తను జూడలేదు. ఆతఁడు సుందరుఁడు కాఁడు–కురూపి కాఁడు కొంచెము పొట్టిగా మాత్రముండును. నీవుచూడవచ్చును. కాని యొక సంగతి చెప్పెదవినుము భర్త యెప్పుడు బుద్ధిమంతుఁడై యుండవలయును గాని సుందరు యుండనక్కఱలేదు. అమ్మా! సౌందర్యమేమి శాశ్వతమా? కర్మము చాలక యొక్కువన్నాడిన యెడల బోసిదాసరయ్యే. తల వెండ్రుకలు పండిన యెడలఁ బాడుకొంటి. కత్తితో నెగిరిపోవు వెండ్రుకలనుజూచి చెంపపెట్టుతో రాలుపండ్లనుజూచి, మొండతాఁకుసుతో కొలుచ చ్ఛాయను జూచి భర్తను నిగ్రహించుకొనుట ప్రజ్ఞాహీనత కాదా? స్థిరమైన బుద్ధియే భర్తకలంకారము. అట్టిది నాభర్తకుఁ గలిగినది. కావునఁ దల్లీ! సందేహింపకుము.

మాన — నన్నాతఁడిట్లు పరాభవించినప్పుడు నేనాతనికి భా నగుట నాయభిమానమునకు లోపముకాదా?

ఇందు — నిన్నాతఁడు చేసినదింకఁ బరాభవమే కాదు. మా– లో నీవుంటివి. నీకొక వ్రాసియుంచెను. నీయాజ్ఞలను దీర్పఁగ ద్వారరకులుండిరి. నీకు జరిగినదింతేయే కాని నాభర్తను నీమూలమున నేను పరాభవించితినో యెఱుఁగుదువా? గల్లాకొట్టులో నాతని నొక్క ద్రోయించితిని. కొట్టుతలుపు తాళము వేయించితిని. చచ్చితినిబాబయో రక్షించు భగవంతుఁడా! నాకు బుద్ధివచ్చెనదే యింగదు మతి! యయ్యారెగిరిపోవనఱచునట్లు నెత్తి నోరుకొట్టుకొని యిరువదిగంటలొక్క వరుసగా గొంతుక తడుపుకొనుటకు నీరైననుస్సఁగకుండ జేసింపచితి– పరాభవమనునప్పుడది. ఇంత చేసితిని గావుననే నా కాతఁడు స్వాధీడయ్యెను. అయినను నాకు లేశమైన సంతోషములేదు. అమా

ఆలాగున వింతపడిచూడకుము. జరిగిన చిత్రకథయంతయుఁ గ్రమముగాఁ జెప్పినఁగాని నీకింతటబోధపడదు. అదిగాక మఱియొకమాట; మగవానిని సాధించుటకు భార్యకంటెఁ దగినదెవ్వతె? ప్రక్కలోఁ బోటుపిడుగుపాటుకంటె గట్టిది. కట్టినయెడల జక్రివర్తిమీఁదనైనఁ నభియోగము తేవచ్చును. ఆలితన్నిన తన్నునకభియోగ మామెయొద్దనే. కాదా? భార్య శాసించిన తీర్మానమునకుఁ బైతీర్పింకఁబరలోకమునందే కదా? అక్కడ సాక్షులమాటలకు, న్యాయవాదుల నీలుగులకు నవకాశమేది? నేను నాభర్తకుఁ గష్టపడి తెప్పించిన మంచిబుద్ధిని నిలుపఁగల ప్రజ్ఞాశాలినివి కావున నాతనియందలి యభిమానముచేఁ గూడ నిన్నిట్లు ప్రార్థించుచున్నాను. ఏమంటివి?

మాన—ఇప్పుడేకదా! చెప్పితివి. ఆలోచించుకొందములే.

ఇందు—సరే మాతా! ఆమాత్రపుమాట చాలు. నీవు లోనికిఁ బోయి స్నానముచేసి యీపూటనైన భోజనము చేయుము. నేను మీ బావగారితో మాటలాడివచ్చెదను.

మాన—సరే. (నిష్క్రమించును.)

ఇందు—ఎవరక్కడ!

(నేపథ్యమున) అమ్మా!

ఇందు—మాపుట్టినింటనుండివచ్చిన మాధవు నిట్లోకసారిరమ్మని చెప్పుము.

(నేపథ్యమున) చిత్తము.

ఇందు—మానాయనగారికి లేఖవ్రాయుదునా? కాక మాధవునిచే వార్తయేపంపుదునా? మానాయనగారుమాత్రము లేఖవ్రాసినారా? నేనేల వ్రాయవలయును?

(మాధవుఁడు ప్రవేశించును.)

ఇందు—మాధవా! రాజుగారిని రమ్మని చెప్పుమని నీతోఁ జెప్పితినిగాదా? చెప్పితివా?

మాధ—చెప్పితినమ్మా! ఇప్పుడే వచ్చెదనని నారు.

ఇందు—సరే. నీవు మాల్లి చంద్రములకు నానమస్కారములు చెప్పుము. మానవతమ్మ యిచ్చటకువచ్చి సురక్షితముగా నున్నదని చెప్పుము. దానికిఁదగిన చోటఁ బెండ్లికుదిరినదని చెప్పుము. మీరు వెంటనే యిక్కడకు బయలుదేరి రావలసినదని చెప్పుము. మీరు రాఁగానే చెల్లెలికల్యాణము జరుగునని చెప్పుము. నీవు పుచ్చుకొనఁదగిన బహుమానము తీసికొని వేగఁబొమ్ము.

మాధ—అమ్మా! మానవతమ్మ యేమైనఁ దల్లిగారికిఁ జెప్ప నేమో?

ఇందు—అది యిప్పుడు స్నానము చేయుచున్నది. తరువాత దానినడిగి తెలిసికొనియే పొమ్ము.

మాధ—అమ్మా! మఱియొకమాట! మానవతమ్మకు వంటఁజేయువాఁడు కనఁబడఁడేమి?

ఇందు—అతఁడేమో చనిపోయినాఁడఁట.

మాధ—పాపము. ఆతనికొడు కేమియుఁ దెలియక విచారించుచున్నాఁడని యడిగితిని.

(నేపథ్యమున) లోనికి రావచ్చునా?

ఇందు—రావచ్చునాయని వేఱ యడుగనేల? మాధవా! నీవు పొమ్ము. (మాధవుఁడు పోవును.)

(సేతు మాధవుఁడు ప్రవేశించును.)

సేతు—రావచ్చునా యని యేలయడిగితినో చెప్పనా? పుట్టి నింటినుండివచ్చిన సేవకునితోఁ బెట్టుకొను లొట్టుబట్టీయమున కంతు లేదులే.

ఇందు—ఇక్కడ మీయంతఃపురరహస్యము లన్నియుఁ గనుఁ గొనిరమ్మని మాయమ్మ వాని నిక్కడకుఁ బంపలేదు. కోపమునఁగి వారేడ్చుచుండుటచేత నేమియుఁ దోఁచక పంపినారు. తెలిసినదా?

సేతు—అదేమి? అదేమి?

ఇందు—ఏమని చెప్పుదును? మాచెల్లెలెక్కడకో పోయిన దఁట! కానఁబడకుండనున్నదఁట!

సేతు—అయ్యయ్యో! అక్కడేల జరిగినది చెప్పుమా!

ఇందు—ఏలజరిగినదా? (మూతిపైఁ జొడిచి) అలౌకికమైన నీయవకతవకమూలమున జరిగినది. నీవు తెచ్చిన క్రొత్తరాణియే మా చెల్లెలు.

సేతు—(చెవులుమూసికొని) హరి హరీ! ఎంతపాప మొనర్చి తిని! అత్తమామలయెడల నెంతయపచారముచేసితిని! నన్ను క్షమిం పుము. (కాళ్లపైఁ బడును.)

ఇందు—లే లే! కనులుకాల్చి కాళ్లపైఁబడిన వినియోగ మే మున్నది అయ్యయో! మాపుట్టినింటి పుట్టిముంచితివే! ఇప్పుడేమి కావలసినది? అయ్యయో! పెండ్లియీడుపిల్ల! రతనాల గని—పర మానసంపన్న—అట్టి దానిని—ఎక్కడ నెమిలిపిల్లను దొంగిలికొనిపోయినట్లు లెత్తుకొనివచ్చితివే. దానిబ్రదు కెల్ల వల్లకాడు చేసితివే—ఆభిజాత్యసంప న్నుఁడైన క్షత్రియపుత్రుఁ డెవఁడు దానిని బెండ్లాడును? అభిజాతము నిర్వాహమాత్ర మిట్టిస్థితిలో నెవఁడు వచ్చును! అయ్యయో!

అభిమానమే సర్వమైన వర్ణములో నివారమే—మాపిల్లను మీరు చేసికొందురా యని జిహ్వకోసిననైన ననువారము కామే—ఈదిక్కుమాలినవార్త మాతల్లిదండ్రులకుఁ దెలిసినయెడల వారు కట్టెఁగట్టుకొ యగ్నిలోఁ బడుదురే. అదిగాక యాపిల్ల యెనిమిదిదినములనుండి యాహారమును వర్జించి ప్రాణపరిత్యాగమును సంకల్పించుకొనియున్నదే! మాపుట్టినిల్లిట్లు తుడిచిపెట్టుటకే దీక్షవహించితివా? భర్తపైపోయితివి కాని నిన్నేమిచేసిననైనను దోసమున్నదా?

సేతు—దోసమున్నదాయని నీవు కొంతసందేహించుచుంద లకు? లేదని నేనుస్పష్టముగఁ జెప్పుచున్నాను లోకమెల్ల నాపక్షమున సాక్షులు. నేను పాపాత్ముఁడను. నేను జేయని తప్పులేదు. నాకు రాఁదగని శిక్షలేదు. సిగ్గువచ్చినది. బుద్ధికలిగినది. నీకంటె గతిలేదని నీ కాళులపైఁబడితిని. నీయిష్టానుసారమాచరించుకొనుము.

ఇందు—అన్నియవశిష్టములు తీరినతరువాత నీకు బుద్ధివచ్చి లాభమేమి? నీవు సర్వవిధములఁ జెడితివి—మమ్ముఁ బాడుచేసితివి.

సేతు—నన్ను బాగుచేయవలయునను దీక్ష నీకిదివఱకే కలిగియుండినయెడల నేను నీచెల్లెలి నెత్తికొనివచ్చుట సిద్ధించియుండదు. కావునఁ గొంతలోపము నీదికూడ నుండిన నుండవచ్చును.

ఇందు—అయ్యయ్యో! పంచదారచిలుకను గాకి యెత్తుకొపోయినట్లు చేసితివే. చూడుము. అట్లు కాకియెత్తుకొనిపోయిన చిలుక నేమిచేసెదము?

సేతు—అది మనకుఁ దిరుగఁ బనికిరాదు. కావున నా కాకికే దానిని వదలివైచెదము.

ఇందు—అట్లేమాటలాడక నీవు మాచెల్లెలిని జేసికొనుము. ఏమి? అట్లు సందేహించుచు మొగము చిట్లించుచున్నావేమి?

సేతు—ఏమియు లేదు. అనేకత్వమువలనఁ గలిగిన కష్టము లేవో తీఱి గట్టునఁబడితినిగదా! ఇంక నాకెందులకు? అదిగాక మఱియొక యధిక్షేకణము న్నది. ఏకపత్నీవ్రతుఁడనై యుండెదనని ప్రమాణము చేసికొనియుంటిని.

ఇందు—ఆవ్రతము నీకుఁ దప్పకుండునట్లు నేను జేసెదనుగాదా? అందునుగూర్చి నీకెంతమాత్రమును సందేహమక్కఱలేదు. ఏమి? మాటలాడవు!

సేతు—ఏమున్నది? ఇప్పుడు కాదు—ఇఁకఁ బదియొండ్లకుఁగాని—ప్రాణము హరియని వదలువఱకు నొక్కటేమాట.

ఇందు—ఏమది?

సేతు—నీయిష్టమెట్లో యట్లే. నీయిష్టమెట్లో యట్లే. చచ్చునంతపనియైనది కావున నీసప్తాక్షరీమంత్రమే పురశ్చరణము.

ఇందు—సరే. చూడు. మా చెల్లెలు మిగుల నభిమానవతి సుమా? నావలె శాంతికలదిగాదు. మిగుల భద్రముగఁ బ్రవర్తింపవలయును. జాగ్రత్త!

సేతు—ప్రక్కచూపు కట్టిపెట్టుకొన్నవానికి భద్రముగాక మఱియేమి? కాని యిద్దఱుండియు నేకపత్నీవ్రతదీక్షయని పలికితివే? ద్వైతములో నీయద్వైతమేమో నాకు బోధపడలేదు.

ఇందు—బోధపడునట్లిప్పుడే చెప్పెదను. చూడు. ఱుందరితో నేను న తంత్రమంతయు నీకామూలాగ్రముగాఁ దెలిపితినిగదా? ఎందుకుఁ దెలిపితినో గ్రహించితివా?

సేతు—మనకు మనకు నేవిధమైన రహస్యములుండఁ గూడదని—

ఇందు—అదియే కాదు. నేను బరమశాంతచిత్తను. నీవు నన్నెంత బాధపెట్టినను జిరకాలము సహించితిని. కోపమన్నది నేనెఱుఁ

గను. మాయయన్నది నే నెఱుఁగను. నాల్గుదినముల క్రిందటి వఱకు నే నసత్యమాడియెఱుఁగను. అట్టి పవిత్రచిత్తను. నీవు నాయోగ్యతను గణించితివి కావు. నన్నుఁ గోటనుండి వెడలఁగొట్టఁ బ్రయత్నించితివి. తుట్టతుదకుఁ బ్రాణము విసిగి నేను నిన్ను శిక్షించుటకు సంకల్పిం కొంటిని. మాయలో దిగితిని. దొంగవేసములు వేసితిని. అనేకము లగు నసత్యములాడితిని. నిన్ను గాదిలో బంధించితిని. మొఱ్ఱోయ యేడ్పించితిని. భార్యనైన నేనిట్టి ద్రోహము నీయెడఁ జేయవలసినది కాదు. పరమపాపాత్మురాలనైతిని. నిన్ననుద్దను ఫిరంగిగుండును నీ చేసితివి. నేను జేసిన దుష్టవ్యాపారమునకై నాకిప్పుడు పశ్చాత్తాపము కలిగినది. తప్పు బాహాటముగ నొప్పుకొనుటయే పశ్చాత్తాపమునకు ముఖ్యలక్షణము. కావున నీతో నీవృత్తాంతమంతయుఁ జెప్పి క్షమింపు మని వేఁడుకొంటిని. ఈచరిత్రము ప్రమాదవశమున సుఖపర్యవసన్న మైనదిగాని సంఘమరణసహితమై కష్టాంతము కాఁదగినది. కష్టాంతమే యగునెడలఁ బాపశాంతికిఁ బశ్చాత్తాపమైన లేకుండ దుర్గతులపాలు గావలసియుండును. దైవకటాక్షమున నిప్పటివఱకు ఘటనములు మిగి లినవి. నీయెడలఁ జేసిన తప్పొప్పుకొనుటచేత నిన్నుఁగూర్చిమాత్రము నాహృదయము నిష్కల్మషమైనది. కాని——

సేతు.——అయ్యయ్యో! నీవిట్లనుట తగునా? నీవు మహా- ణ- కార్య మాచరించితివి.

"గీ॥ ప్రభువుచే బాగుపడనట్టి పాపికలఁడు
ప్రజలచే బాగుపడనట్టి పాపికలఁడు
ఎట్టి పాపాత్ముఁడైనను గట్టుకొన్న
భార్యచే బాగుపడనట్టి భర్తలేఁడు."

అని మాకుంటిపంతులుగారు బాల్యములోఁ జెప్పిన పద్యము సంపూర్ణనిదర్శనము నాయెడలనే కనిపట్టితిని.

ఇందు—నీవు నామాట కడ్డురాకుము. నీపద్యము లింక గట్టి ము. నీయెడలమాత్రమే నాహృదయము నిష్కల్మషమైనది. కాని నముగూర్చిమాత్రము నాహృదయమింక సకల్మషముగ నేయున్నది. ాడిన యసత్యములకు—నేను జేయఁగూడనిచేష్టలకు—నేను దలఁప ని తలఁపులకు—నన్నా పరమాత్ముఁ డింతట క్షమింపఁడు. కష్టపడి, వనామము స్మరించి, వైరాగ్యవృత్తిఁబూని, సంసారపరిత్యాగ ను జేసి—

సేతు—అయ్యయ్యో! అట్లనుచుంటి వేల?

ఇందు—అ ! నామాట కడ్డురాకుము. ఆత్మపరిశుద్ధి నశిం జేసికొని భర్తతో సుఖమొందిన యాఁడుదానికంటె నధమవస్తువు పంచమునను న్నదా? నాకుఁ గావలసినది భర్తృసుఖమా? భక్తి ఖమా? ఇఁక నాకు నీవక్కఱలేదు. నేనిప్పుడే సన్యాసినినయ్యెదను.

సేతు—అయ్యయ్యో! వలదు. వలదు.

ఇందు—నామాట కడ్డురావలదని చెప్పలేదా?

సేతు—అటులనుచుండ నేనేమిచేయవలసినది?

—నీయిష్టమెట్లో యట్లే యును సప్తాక్షరీమంత్రమును ంపుము. ఇదిగో! వెనుక నేను జాగ్రత్తపఱచుకొన్న కాషాయము.

(లుంగిని దొడిగికొనును.)

సేతు—అయ్యయ్యో! అయ్యయ్యో! మంచియో చెడ్డయో యాఁడుదానికి బుద్ధి పూర్ణముగాఁ బునితరువాత నాఁపుట బ్రహ్మ రమగునా? కానీ! నాకర్మమిట్లున్నది.

ఇందు—విచారింపకుము. దివ్యమంగళవిగ్రహమైన భార్య సంపాదించుకొంటివి. ద్వైతములో నద్వైతమెట్లని యిప్పు డధిక్షేపి తివే. నాయాశ్రిమస్వీకారముతో ద్వైతము వదలినదికదా? నిలిచి యద్వైతమే కాదా? ఇంక నీయేకపత్నీవ్రతమునకు భంగమేదీ! కలిగి సుఖపడి వంశవృద్ధి చేసికొనుము. ఇంక నీతోఁ జెప్పవలసినమా లివియే. ఓ పురాత్పరుఁడా! రక్షింపుము.

బిలహరి—ఏక.

పరమేశ! ఈశ్వరా! భవబంధనాశనా!
ప్రణతార్తి హరభక్తపరిపోషణక్షణా!
బహుదయాపరిపాక! పాపవిధ్వంసనా! "పర-శ"
ఇక్కడన కకక్కడన కెక్కడనుగాంచినను
అక్కజంబుగ నుండుమనుచుఁ బెద్దలుపల్క
మ్రొక్కి మ్రొక్కి కనులు పొడుచుకొనిచూచినను
ఎక్కడను గానఁబడవె నయ్యా! "పరమేశ"

సేతు—అయ్యయ్యో! ఈకొ__పాట ల?

ఇందు—క్రొత్తపాటలు నీకిష్టముకానియెడల మనపాతపా యే పాడెదను.

ధరణి యీతిబాలులేక తనరుఁగాక
ప్రజల యనోన్య వైరములుబాయు __
కవితరాజపోషణమునఁ గ్రా గాక
నీతిపాల. ముగ రాజు నెగ గాక!

సే—తథాస్తు.

ఇది స్తాంకము.